శనివారం
22•2•2020
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

• వెల. రూ. 6.50 • సంపుటి 9 • సంచిక 238 • పేజీలు : 12 + 16

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE






• మహిళల టీ-20 ప్రపంచకప్

## భారత్ బోణీ

ఆస్ట్రేలియాపై అద్భుత విజయం

పూనమ్ పంజా

నాలుగు వికెట్లతో విజృంభణ

ప్రతిష్ఠాత్మక మహిళల టీ20 ప్రపంచ కప్‌లో భారత జట్టు అదిరిపోయే బోణీ కొట్టింది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో శుక్రవారం జరిగిన తొలిమ్యాచ్‌లో టీమ్‌ఇండియా విజయదుందుభి మోగించింది. భారత్ నిర్దేశించిన 133 పరుగుల లక్ష్యఛేదనలో లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్(4/19) ధాటికి ఆసీస్ 19.5 ఓవర్లలో 115 పరుగులకే ఆలౌటైంది. తొలుత భారత్ 20 ఓవర్లలో 132/4 స్కోరు చేసింది. నాలుగు వికెట్లతో కంగారూల నడ్డివిరిచిన పూనమ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

వివరాలు ఆటలో



శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసరగుట్టపై శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

## శంభో శివశంభో..

**మహాశివరాత్రి** సందర్భంగా శుక్రవారం రాష్ట్రంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో తెల్లవారుజామునుంచే శివలింగాలకు జలాభిషేకాలు, క్షీరాభిషేకాలతోపాటు పంచాక్షరీ మంత్రమైన ఓం నమఃశివాయ.. అంటూ శివనామస్మరణలు మార్మోగాయి. శివస్వాముల భజనలతో ఆలయాలు భక్తి పారవశ్యంతో నిండిపోయాయి. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న ఆలయం, మేడ్చల్ జిల్లాలోని కీసర శ్రీభవాని రామలింగేశ్వరస్వామి ఆలయం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర-ముక్తీశ్వర ఆలయం, ములుగు జిల్లాలోని రామప్ప, హన్మకొండలోని వేయిస్తంభాల రుద్రేశ్వరాలయం, నల్లగొండ జిల్లాలోని ఛాయా, పచ్చల సోమేశ్వరాలయాలు, చెర్వుగట్టులోని పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయం, సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులోని శంభులింగేశ్వరస్వామి ఆలయం, జనగామ జిల్లా పాలకుర్తిలోని సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయం, సంగారెడ్డి జిల్లాలోని కేతకీ సంగమేశ్వరాలయం, జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లోని బాలబ్రహ్మేశ్వరస్వామి తదితర ఆలయాలను లక్షల మంది భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వం తరఫున మంత్రులు, ఎమ్మెల్యేలు తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు.

# శిశు ఆరోగ్యమస్తు

రాష్ట్రంలో 92.4% టీకాలు నమోదు • దేశవ్యాప్తంగా తెలంగాణకు పదోస్థానం

కేసీఆర్ కిట్స్‌తో పెరిగిన ఇమ్యునైజేషన్ • హెచ్‌ఎంఐఎస్ తాజా నివేదికలో వెల్లడి



ఐదేండ్లలో రాష్ట్రంలో ఇమ్యునైజేషన్ ప్రగతి

| 2015-16 | 2016-17 | 2017-18 | 2018-19 | 2019-20 |
|---|---|---|---|---|
| 68% | 72% | 91% | 96% | 92.4% (జనవరి వరకు) |

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఆరోగ్యమే మహాభాగ్యమని గుర్తించిన ప్రభుత్వం నవజాత శిశువులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నది. ఆరోగ్య తెలంగాణ సాధనలో భాగంగా భవిష్యత్‌లో ఎలాంటి రోగాన్నయినా తట్టుకొనే శక్తినిచ్చేందుకు శిశువులకు సకాలంలో టీకాలు వేయించడంలో ముందున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి శిశువుల ఇమ్యునైజేషన్ (టీకాలు వేయించడం)శాతం ఏటా మెరుగుపడుతున్నది. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ఎన్‌ఎఫ్‌డబ్ల్యూఎస్ (నేషనల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సర్వే) విభాగం వెల్లడించిన నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2015-16 ఏడాదిలో 68 శాతం ఇమ్యునైజేషన్ నమోదైంది. 2016-17 నుంచి 2019-20 వరకు చేపట్టిన ఇమ్యునైజేషన్‌లో తెలంగాణ మరింత పురోగతి సాధించింది. హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్‌ఎంఐఎస్) నివేదికల ప్రకారం 2019-20 జనవరి నాటికి 92.4 ఇమ్యునైజేషన్‌తో దేశంలో పదోస్థానంలో నిలిచింది. తెలంగాణ ప్రభుత్వం కేసీఆర్ కిట్ల పథకం అమలుచేస్తుండటంతో ఇమ్యునైజేషన్‌శాతం పెరిగిదని ఈ సంస్థ పేర్కొన్నది. మెరుగైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం వైద్యసేవలను మెరుగుపరుచడంతోపాటు మాతాశిశు సంరక్షణ (ఎంసీహెచ్) కేంద్రాలను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసింది. సామూహిక ఇమ్యునైజేషన్‌ను సమర్థంగా నిర్వహించేలా వైద్యవిభాగాలకు లక్ష్యాలను నిర్దేశించింది. ఈ కారణంగానే రాష్ట్రంలో ఇమ్యునైజేషన్ శాతం పెరిగింది.

**గర్భిణులకు అండగా కేసీఆర్ కిట్లు**

ప్రభుత్వ వైద్యశాలల్లో సహజ ప్రసవాలు పెంచి సిజేరియన్లను, మాతా శిశు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం కేసీఆర్ కిట్ల పథకాన్ని 2017 జూన్ 3 నుంచి అమలుచేస్తున్నది. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవిస్తే రూ.12వేలు, ఆడపిల్ల పుడితే మరో రూ.వెయ్యి అదనంగా ఇవ్వడంతోపాటు కేసీఆర్ కిట్ అందజేస్తున్నారు. ఈ మొత్తాన్ని గర్భం దాల్చినప్పటి నుంచి శిశువుకు 18 నెలల వరకు టీకాలువేయిస్తే ఇస్తున్నారు. గర్భం దాల్చగానే ఐదు-ఆరునెలల్లో రూ.మూడు వేలు, ప్రసవం తర్వాత రూ.నాలుగు వేలు (ఆడపిల్ల పుడితే రూ.ఐదువేలు), శిశువు జన్మించిన

మిగతా 2వ పేజీలో

# యూపీలో బంగారు గనులు

సోన్‌భద్ర జిల్లాలో 3,500 టన్నుల పసిడి నిక్షేపాలు గుర్తింపు

మనదేశంలోని మొత్తం నిల్వలకంటే ఐదురెట్లు ఎక్కువ

వేలం ప్రక్రియకు సిద్ధమవుతున్న ఉత్తరప్రదేశ్ సర్కారు



అత్యధిక బంగారం నిల్వలున్న దేశాలు/సంస్థలు

| | | |
|---|---|---|
| అమెరికా | : | 8,133.5 టన్నులు |
| జర్మనీ | : | 3,366 టన్నులు |
| ఐఎంఎఫ్ | : | 2,814 టన్నులు |
| ఇటలీ | : | 2,451.8 టన్నులు |
| ఫ్రాన్స్ | : | 2436 టన్నులు |
| రష్యా | : | 2,241.9 టన్నులు |
| చైనా | : | 1,948.3 టన్నులు |
| స్విట్జర్లాండ్ | : | 1,040 టన్నులు |
| జపాన్ | : | 765.2 టన్నులు |

**లక్నో, ఫిబ్రవరి 21:**

626 టన్నులు.. మనదేశం మొత్తం మీద ఉన్న బంగారు నిల్వలు ఇవి. అయితే దీనికి ఐదు రెట్లకుపైగా.. 3,500 టన్నులకు పైగా బంగారు నిక్షేపాలను ఉత్తరప్రదేశ్‌లో గుర్తించారు. 'జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా' (జీఎస్‌ఐ), 'ఉత్తరప్రదేశ్ డైరెక్టరేట్ ఆఫ్ జియాలజీ అండ్ మైనింగ్' సంస్థలు దాదాపు రెండు దశాబ్దాల అన్వేషణ తర్వాత మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన సోన్‌భద్ర జిల్లాలో రెండు భారీ బంగారు గనులను గుర్తించాయి. సోన్‌పహాడీలో సుమారు 2,943.26 టన్నులు, హార్దీ గ్రామంలో 646.16 టన్నుల మేర బంగారు నిక్షేపాలు ఉన్నట్లు అంచనావేస్తున్నారు. ఈ-టెండరింగ్ ప్రక్రియ ద్వారా ఈ బ్లాకులను వేలం వేసేందుకు ఉత్తరప్రదేశ్ సర్కారు సిద్ధమైంది. ఇందుకోసం ఏడుగురు సభ్యుల కమిటీని ఏర్పాటుచేసింది. గురువారం ఈ కమిటీ సోన్‌భద్రలో పర్యటించింది. బంగారు గనులున్న మొత్తం ప్రాంతాన్ని జియోట్యాగింగ్ చేసి, శనివారం నివేదికను అందజేయనున్నది. భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ఈ ప్రాంతంలో బంగారు గనులను సులభంగా తవ్వవచ్చని అధికారులు చెప్తున్నారు. బంగారంతోపాటు యురేనియం వంటి విలువైన ఖనిజాలు ఈ ప్రాంతంలో ఉండొచ్చని భావిస్తున్నారు. సోన్‌భద్ర జిల్లాలో బంగారం గురించి అన్వేషణ 1992-93లో మొదలైంది. పెద్ద ఎత్తున బంగారు నిక్షేపాలు బయటపడటంతో ఉత్తరప్రదేశ్ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరనున్నది. యువతకు కూడా పెద్ద ఎత్తున ఉపాధి లభించనున్నది.

# ఏజెన్సీ ముట్టడి

ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా కొనసాగుతున్న 'ఆపరేషన్ ప్రహార్'

దండకారణ్యంలో అలజడి.. రాష్ట్ర సరిహద్దులో జల్లెడ పడుతున్న పోలీసులు



- వైమానికదళాల సాయం, డ్రోన్ కెమెరాల వినియోగం
- 30 కిలోమీటర్ల వరకు చొచ్చుకెళ్లి సెర్చ్‌ఆపరేషన్
- ఆపరేషన్‌లో సుమారు రెండువేల మంది జవాన్లు
- మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య భీకరపోరు!
- నంబాల నియామకం తర్వాత పెరిగిన నక్సల్స్ దాడులు

**భద్రాద్రికొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మళ్లీ అలజడి! దండకారణ్యంలో వరుస దాడులతో కవ్విస్తున్న మావోయిస్టులు! మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ ప్రహార్‌లో పెరిగిన వేగం! ఫలితంగా.. కొంతకాలంగా నిశ్శబ్దంగా ఉన్న ఏజెన్సీ గ్రామాల్లో ఆందోళన నెలకొన్నది. మావోయిస్టు కేంద్రకమిటీ కార్యదర్శిగా నంబాల కేశవరావు నియామకం తర్వాత భారీ రిక్రూట్‌మెంట్‌కు అడుగులు వేయడంతోపాటు, వరుసదాడులు జరుగుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో ఇన్ఫార్మర్ల నెపంతో ఆదివాసీలపై హత్యాకాండ కొనసాగుతున్నది. సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొంటున్న జవాన్లపై దాడిచేసి చంపేస్తున్నారు. ఈ క్రమంలోనే భద్రతను కట్టుదిట్టం చేసిన ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మూడు రోజులుగా ఆపరేషన్ ప్రహార్‌ను ముమ్మరం చేసింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సంయుక్తంగా ఏకకాల దాడులకు రంగం సిద్ధమైంది. ఈ ఆపరేషన్‌లో వైమానిక

మిగతా 2వ పేజీలో



## పక్కా బిజినెస్!

- పూర్తిగా వాణిజ్యకోణంలోనే ట్రంప్ భారత పర్యటన
- అమెరికా ఉత్పత్తులపై ఇండియాలోనే అత్యధిక సుంకాలు
- దీనిపై మోదీతోనే తేల్చుకుంటా
- అద్భుతమైన ఒప్పందం జరుగొచ్చు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు

5

## కాటేస్తున్న కరోనా

- ప్రపంచ ఆర్థిక వ్యవస్థను వణికిస్తున్న వైరస్
- భయం గుప్పిట్లో వృద్ధిచోదక దేశాలు
- చైనా ఉత్పాదకరంగం కుదేలు
- భారత్‌సహా ఎన్నో దేశాలపై తీవ్రప్రభావం
- జూన్‌నాటికి అదుపులోకి రాకపోతే ప్రపంచ జీడీపీ 1 శాతం పడిపోయే అవకాశాలు

8

**చికెన్ ధరలు** (వెన్‌కాబ్) (రూ.)

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 45.00 | రిటైల్ లైవ్ | 67.00 |
| డ్రెస్డ్ | 97.00 | స్కిన్‌లెస్ | 111.00 |

**గుడ్ల ధరలు** (వందకు) (రూ.)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 340.00 | రంగారెడ్డి | 340.00 |
| మెదక్ | 340.00 | కరీంనగర్ | 343.00 |
| వరంగల్ | 343.00 | డజన్ ధర | 60.00 |

## మార్చి 4 నుంచి ఇంటర్ థియరీ పరీక్షలు

హాజరుకానున్న 9.65 లక్షల మంది విద్యార్థులు

హాల్‌టికెట్ల జారీ మొదలు.. డౌన్‌లోడ్‌కూ అవకాశం

హాల్‌టికెట్లు ఇవ్వని యాజమాన్యాలపై చర్యలు

2



హరహర.. మహాదేవ



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి

# కిటకిటలాడిన రాజన్న సన్నిధి

- ఎములాడలో కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు
- అంగరంగ వైభవంగా మహాలింగార్చన

**వేములవాడ, నమస్తే తెలంగాణ/వేములవాడ కల్చరల్:** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం శుక్రవారం శివనామస్మరణతో మార్మోగింది. మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రాజన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. 1.5 లక్షల మంది భక్తులు రాజన్నను దర్శించుకున్నట్టు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంతోపాటు ఏపీ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు తరలిరావడంతో రాజన్న క్షేత్రం కిటకిటలాడింది. భక్తులు తల నీలాలు సమర్పించి, ధర్మగుండంలో స్నానాలు ఆచరించారు. శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం తరపున డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హరిచంద్రనాథ్, అర్చకులు గురువరాజు, మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావు, గంగుల కమలాకర్, కలెక్టర్ కృష్ణభాస్కర్.. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అద్దాలమండపంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ప్రధానార్చకులు నమిలకొండ ఉమేశ్, ఈశ్వరగారి సురేశ్ వేదమంత్రాలతో మంత్రులకు, అధికారులకు వేదోక్త ఆశీర్వచనం చేయగా, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌తో కలిసి స్వామివారి ప్రసాదం, చిత్రపటాలను అందజేశారు. అగ్రహార బ్రాహ్మణులతో సాయంత్రం అద్దాల మండపంలో మహాలింగార్చన వైభవంగా నిర్వహించారు. శివమాల ధరించిన దాదాపు వెయ్యి మందికిపైగా శివస్వాముల శివనామస్మరణంతో ఆలయం మార్మోగింది. స్వామివారి దర్శనం అనంతరం భీమేశ్వర ఆలయంలో మాల విరమణచేశారు. రాత్రి 11.30 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్నవారిలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఐడీసీసీ కార్పొరేషన్ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, కరీంనగర్ జిల్లా న్యాయమూర్తి అనుపమ చక్రవర్తి, ఫ్యామిలీ కోర్ట్ జడ్జి లలితాశివజ్యోతి, సీఎం కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ యోగితారాణా, ఆదనపు కలెక్టర్లు శ్యామ్‌ప్రసాద్‌లాల్, అంజయ్య, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ ఉన్నారు.



ఎములాడ రాజన్నకు పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

## ప్రజలకు సీఎం కేసీఆర్ మహాశివరాత్రి శుభాకాంక్షలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని భగవంతుడిని ప్రార్థించారు.



## సీనియర్ ఫొటో జర్నలిస్ట్ నరసింహారావు మృతి

- సీఎం కేసీఆర్ సంతాపం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీనియర్ ఫొటో జర్నలిస్టు నరసింహారావు (62) శుక్రవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్సపొందుతూ మృతి చెందారు. ఆయన మృతికి సీఎం కేసీఆర్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సంతాపం తెలిపారు. నరసింహారావు నాలుగు దశాబ్దాలుగా ఫొటోజర్నలిస్టుగా సేవలందించారని సీఎం కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిప్పలుర్తికి చెందిన సీఎన్ రావు చనిపోయేవరకు ఈనాడు దినపత్రికలో ఫొటో జర్నలిస్టుగా పనిచేశారు. ప్రముఖ హిందీ, ఇంగ్లిష్ పత్రికలకు ఫొటో జర్నలిస్టుగా సేవలందించారు. పలు జాతీయ అవార్డులు అందుకున్నారు. నరసింహారావుకు భార్య, కుమారుడు ఉన్నారు. శనివారం ఢిల్లీలో నరసింహారావు అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

# కొనసాగుతున్న ఎత్తిపోతలు

కాళేశ్వరం లింక్-1, 2లలో నడుస్తున్న మోటర్లు

- లక్ష్మీ పంప్‌హౌజ్‌లో తిరిగి ప్రారంభమైన పంపులు
- అన్నింటికంటే ముందు ఖాళీకానున్న లక్ష్మీబరాజ్
- ఎల్‌ఎండీలో 11.272 టీఎంసీలకు నీటినిల్వ
- వరదకాల్వలో 5 మీటర్లకు జలాలు

**హైదరాబాద్/కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ప్రాజెక్ట్ లింక్-1, 2లలో గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. దాదాపు అన్ని పంప్‌హౌజ్‌లలో మోటర్లు నడుస్తున్నాయి. శివరాత్రి పర్వదినం నేపథ్యంలో స్నానమాచరించేందుకు వీలుగా మూడ్రోజులు లక్ష్మీ పంప్‌హౌజ్‌లో మోటర్లను నిలిపివేసిన అధికారులు శుక్రవారం తిరిగి ప్రారంభించారు. మొత్తం పదకొండు మోటర్ల ద్వారా 2 టీఎంసీలను సరస్వతీ బరాజ్‌కు తరలించారు. ప్రస్తుతం లక్ష్మీబరాజ్‌లో 99.4 మీటర్ల మేర 14 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. బరాజ్‌ల నిర్మాణాలను సాంకేతికంగా పరిశీలన చేసేందుకు అన్నింటికంటే ముందు లక్ష్మీబరాజ్‌ను ఖాళీ చేయనున్నారు. ఎత్తిపోయగా నీళ్లు మిగిలిఉంటే గేట్లు ఎత్తి దిగువకు వదలాలని గతంలోనే నిర్ణయించారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాసిపేటలోని సరస్వతీ పంప్‌హౌజ్‌లో 5, 6,7 నంబర్ల పంపులు నడుపుతూ.. మంథని మండలం సిరిపురంలోని పార్వతీ బరాజ్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అంతర్గాం మండలం గోలివాడలోని పార్వతీ పంప్‌హౌజ్‌లో 3, 6,7 మోటర్ల ద్వారా ఎల్లంపల్లి బరాజ్‌కు ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఇటు పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం (6వ ప్యాకేజీలో)లోని నంది పంప్‌హౌజ్‌లో శుక్రవారం కూడా 5, 6 నంబర్ల మోటర్లనే నడిపించి 6,300 క్యూసెక్కులనీటిని ఎత్తిపోశారు. నంది రిజర్వాయర్ నుంచి 7వ ప్యాకేజీలోని జంట సొరంగాల ద్వారా 8 ప్యాకేజీలోని కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌజ్‌కు జలాలు తరలాయి. ఇక్కడా గురువారం మాదిరిగానే 2, 3 నంబర్ల పంపులనే నడిపించారు. గాయత్రీ పంప్‌హౌజ్‌లో శుక్రవారం సాయంత్రానికి 7.6 టీఎంసీల జలాలను ఎత్తిపోసినట్టు అధికారులు తెలిపారు. ఎత్తిపోతల ప్రక్రియను ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ పంప్‌హౌజ్ నుంచి ఎస్సారెస్పీ వైపు వెళ్తున్న జలాలు

### ఎల్‌ఎండీకి 2,902 క్యూసెక్కులు

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి ఎల్‌ఎండీకి శుక్రవారం 2,902 క్యూసెక్కుల జలాలను తరలించారు. ఎస్సారార్ జలాశయం స్లూయిస్ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో ఎల్‌ఎండీలో నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతున్నది. ప్రస్తుతం 11.272 టీఎంసీలు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఎస్సారార్‌లో 24.92 టీఎంసీల నిల్వ ఉన్నది.

### ఇటు ఎస్సారార్‌కు.. అటు వరద కాల్వకు

ఎస్సారెస్పీ పునర్జీవ పథకంలో భాగంగా వరద కాల్వలో ఒకటీఎంసీ నీటిని ఎత్తిపోసి చెరువులను నింపేందుకు రాంపూర్, రాజేశ్వరరావుపేట పంప్‌హౌజ్‌ల వద్ద అధికారులు చర్యలు చేపట్టారు. గాయత్రీ పంప్‌హౌజ్‌లో 2,3వ నంబర్ పంపుల ద్వారా ఎత్తిపోసిన జలాలు.. వరదకాల్వకు 99 కిలోమీటర్ వద్ద ఏర్పాటుచేసిన జంక్షన్‌పాయింట్ చేరుకొని అక్కడి నుంచి కుడి, ఎడమ కాల్వలకు తరలుతున్నాయి. వరదకాల్వపై 102 కిలోమీటర్ వద్ద నిర్మించిన హెడ్‌రెగ్యులేటర్ గేట్లను కొంతమేర కిందికి దించడంతో వరదకాల్వతోపాటు గ్రావిటీ కాల్వలో నీరు నిండుగా వెళ్తున్నది. ఇటు ఎస్సారార్‌కు 2 వేల క్యూసెక్కులు, పునర్జీవ పథకంలో భాగంగా ఎగువన రాంపూర్ పంప్‌హౌజ్‌కు 4,500 క్యూసెక్కులు తరలుతున్నాయని వరదకాల్వ ఏఈఈ తిరుపతి తెలిపారు.

### రాంపూర్, రాజేశ్వర్‌రావుపేటలో ఎత్తిపోతలు

ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా మల్యాల మండలం రాంపూర్, ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌజ్‌ల నుంచి కాళేశ్వర జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం రాంపూర్ పంప్‌హౌజ్‌కు గాయత్రీ పంప్‌హౌజ్ నుంచి 3 వేల క్యూసెక్కుల వరద రాగా నిరంతరాయంగా రెండుమోటర్లను నడిపిస్తూ రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌజ్ వైపు ఎత్తిపోస్తున్నట్టు వరదకాల్వ ఈఈ సుధాకిరణ్ తెలిపారు. రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌజ్‌లో 3, 6వ మోటర్లను ప్రారంభించి ఎస్సారెస్పీవైపు నీటిని ఎత్తిపోస్తున్నారు. వరదకాల్వను ఆనుకొని ఉన్న దిగువ చెరువులను ఓపెన్ తూంల ద్వారా నింపుతామని ఈఈ తెలిపారు. రాంపూర్ పంప్‌హౌజ్ నుంచి వరద కాల్వకు మూడ్రోజుల క్రితం రెండుపంప్‌ల ద్వారా విడుదల చేసిన జలాలు శుక్రవారం మధ్యాహ్నం వరకు రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌజ్‌కు చేరుకున్నాయి. ఇక్కడి నుంచి బాల్కొండ వరకు వరద కాల్వలో నీటిని నింపనున్నారు. ప్రస్తుతం వరదకాల్వలో 5మీటర్ల వరకు నీటినిల్వ ఉన్నది. యాసంగిని దృష్టిలో ఉంచుకొని 9 మీటర్ల వరకు నీటిని నింపనున్నారు. రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌజ్ నుంచి పోచంపాడు వరకు ఉన్న 34 ఓపెన్‌తూముల ద్వారా 49 చెరువులను నింపనున్నట్టు ఈఈ తెలిపారు.



కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ వంతెనవద్ద నిండుగా పారుతున్న కాల్వ

# కంపా నిధుల వినియోగంలో అగ్రస్థానం

- కంపా కింద ఈసారి రూ.600 కోట్లకు అనుమతివ్వండి
- కేంద్ర ప్రభుత్వానికి నివేదించిన తెలంగాణ అటవీశాఖ
- సరాసరి 98.82 శాతం ఖర్చుతో రెండేండ్లుగా ముందు వరుసలో తెలంగాణ

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాంపన్సేటరీ ఎఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (కంపా) నిధుల వినియోగంలో దేశంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. 2014-19 మధ్య రాష్ట్రానికి అందిన రూ.645 కోట్లలో సరాసరి 99.82 శాతం ఖర్చుచేసి రెండేండ్లుగా అగ్రపథాన నిలుస్తూ వస్తున్నది. గత ఏడాదిలో రూ.501 కోట్లను వివిధ కార్యక్రమాల కింద వాడుకోవడానికి కేంద్ర అటవీ, పర్యావరణశాఖ అనుమతించిన నేపథ్యంలో ఈ ఏడాదికి రూ.600 కోట్ల కంపా నిధులు వినియోగించుకొనేందుకు అనుమతివ్వాలంటూ రాష్ట్ర అటవీశాఖ కేంద్రానికి ఇప్పటికే నివేదిక ఇచ్చింది. 2019-20లో కేంద్రం అనుమతించిన రూ.501 కోట్లను ఏయే కార్యక్రమాల కింద ఎంత ఖర్చు చేశారో వివరించింది. కంపా నిధులను సద్వినియోగం చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రభాగంలో ఉన్నట్టు కేంద్రం నియమించిన థర్డ్ పార్టీ సర్వేలో తేలింది. ప్రత్యామ్నాయ అడవుల సృష్టి, జీవవైవిధ్యం కాపాడటం, అడవుల పునర్జీవం బాగుందని ఈ సర్వే తెలంగాణకు కితాబిచ్చింది. దేశంలోని అత్యధిక రాష్ట్రాలు కంపా నిధులను 70 శాతంలోపు మాత్రమే ఖర్చు చేస్తుండగా.. తెలంగాణ మొదటి నుంచి 90 నుంచి 100 శాతం నిధులను వినియోగించుకొంటున్నదని తేలింది.

### కొత్త చట్టంతో ప్రత్యేక అకౌంట్‌కు జమ

ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు, పరిశ్రమలు, ఇతర అవసరాలకు అటవీ భూములను సేకరిస్తే కంపా కింద భారీ నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఎలాంటి మినహాయింపు లేదు. క్షీణించిన అడవుల్లో హెక్టార్‌కు రూ.6లక్షలు, రిజర్వ్ ఫారెస్ట్‌కు రూ.8లక్షలు, దట్టమైన అడవుల్లో హెక్టారుకు రూ.10 లక్షల చొప్పున నెట్ ప్రాఫిట్ వ్యాల్యూ కింద చెల్లించాల్సి ఉంటుంది. చెట్లకు కూడా ఖరీదు కడుతారు. ఇలా వసూలైన మొత్తాన్ని ఢిల్లీలోని కంపా అడ్‌హాక్ అకౌంట్ కింద ఆయా రాష్ట్రాల ఖాతాల్లో జమచేస్తారు. ఈ మొత్తంలో 10 శాతం మాత్రమే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అటవీ అభివృద్ధి కోసం చెల్లించాలని సుప్రీం కోర్టు ఆదేశాలున్నాయి. గత ఏడాది మార్పుచేసిన కంపా చట్టం ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఖాతాల్లో 90 శాతం నిధులను సంబంధిత రాష్ట్రాల ఖజానాకు తరలించి ప్రత్యేక అకౌంట్ కింద జమచేస్తున్నారు. ఈ మేరకు తెలంగాణ అకౌంట్ కింద జమైన రూ.3,110 కోట్ల డిపాజిట్ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం బదలాయించిన విషయం తెలిసిందే. ఆయా రాష్ట్రాలు సమర్పించే అభివృద్ధి పనుల కార్యాచరణ నివేదికను కేంద్రం అనుమతించిన తర్వాతనే ఈ నిధులను వినియోగించుకొనే వెసులుబాటు రాష్ట్రాలకు ఉంటుంది.



### రికార్డుస్థాయిలో వినియోగం

ఉమ్మడి రాష్ట్రం హయాంలో కేంద్రం నుంచి అతి తక్కువ మొత్తంలో కంపా నిధులు అందాయి. 2013-14లో తెలంగాణకు రూ.49 కోట్లు మాత్రమే వచ్చాయి. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణలో ప్రాజెక్టులు ఊపందుకోవడంతో కంపా నిధుల జమ, అదే స్థాయిలో వినియోగమూ పెరిగింది. 2014-19 వరకు ఐదేండ్ల కాలంలో రూ.645 కోట్ల నిధులకు అనుమతి లభించగా.. ఈ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించడంతో దేశంలోనే తెలంగాణ అగ్రభాగాన నిలిచింది. నిధుల్లో సరాసరి 99.82 శాతం ఖర్చుచేసి రెండేండ్లుగా ముందు వరుసలో నిలుస్తున్నది. ఫలితంగా గత ఏడాది రాష్ట్రానికి భారీ మొత్తంలో నిధులు అందాయి. ఈసారి కూడా రూ.600 కోట్ల మేర నిధులు వాడుకొనేందుకు కేంద్ర అటవీ, పర్యావరణశాఖ అనుమతి ఇస్తుందనే పూర్తి విశ్వాసంతో ఉన్నందున.. 2021-22 బడ్జెట్‌లో కంపా నిధులను రూ.600 కోట్లుగా చూపనున్నట్టు తెలుస్తున్నది.

# శిశు ఆరోగ్యమస్తు

మొదటిపేజీ తరువాయి...

మూడున్నర నెలల్లోగా పోలియో, పెంటావాలెట్ తదితర టీకాలు వేయించాక రూ.మూడు వేలు, శిశువుకు తొమ్మిది నెలలు వచ్చాక మీజిల్స్, విటమిన్ ఏ తదితర టీకాలు వేయించాక మరో రూ.మూడు వేలు అందజేస్తున్నారు. గర్భిణిగా ఉన్నప్పుడు విశ్రాంతి తీసుకుంటున్నందున కోల్పోయిన జీవనభృతి తిరిగి ఇవ్వడంతోపాటు శిశువుకు తగిన సమయంలో టీకాలు వేయించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. దీంతో టీకాలు వేయించే శాతం పెరిగి, మాతాశిశు మరణాల శాతం ఏటా తగ్గుముఖం పడుతున్నది.

### సాక్షి, టైమ్స్ కథనాలను ఖండించిన కమిషనర్

ఇమ్యునైజేషన్‌ప్రక్రియలో తెలంగాణ చివరిస్థానంలో ఉన్నదంటూ సాక్షి, టైమ్స్ ఆఫ్ ఇండియా దినపత్రికల్లో ప్రచురితమైన కథనాల్లో వాస్తవం లేదని రాష్ట్ర వైద్య విభాగాలు వెల్లడించాయి. ఆ కథనాలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ యోగితారాణా శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. హెచ్‌ఎంఐఎస్ నివేదిక ప్రకారం 2019-20లో జనవరి చివరినాటికి తెలంగాణలో 92.4 శాతం ఇమ్యునైజేషన్ పూర్తిచేసినట్టు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇమ్యునైజేషన్‌ప్రక్రియలో రాష్ట్రం పదోస్థానంలో ఉన్నదని తెలిపారు.

**ఐదేండ్లలో రాష్ట్రంలో ఇమ్యునైజేషన్ నమోదైన తీరు**

| ఆర్థిక సంవత్సరం | ఇమ్యునైజేషన్ శాతం | నిర్ధారించిన సంస్థ |
|---|---|---|
| 2015-16 | 68 | ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ |
| 2016-17 | 72 | హెచ్‌ఎంఐఎస్ |
| 2017-18 | 91 | హెచ్‌ఎంఐఎస్ |
| 2018-19 | 96 | హెచ్‌ఎంఐఎస్ |
| 2019-20 (జనవరి వరకు) | 92.4 | హెచ్‌ఎంఐఎస్ |

**హెచ్‌ఎంఐఎస్ నివేదిక ప్రకారం ఆయా రాష్ట్రాల్లో ఇమ్యునైజేషన్ శాతం**

| రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం | చిన్నారుల లక్ష్యం | ఇమ్యునైజేషన్ సంఖ్య | చేపట్టిన శాతం |
|---|---|---|---|
| జమ్ముకశ్మీర్ | 1,75,583 | 1,85,415 | 105.6 |
| మహారాష్ట్ర | 16,22,583 | 16,50,626 | 101.7 |
| ఢిల్లీ | 2,71,750 | 2,70,899 | 99.7 |
| ఉత్తరాఖండ్ | 1,49,583 | 1,46,356 | 97.8 |
| బీహార్ | 24,70,500 | 23,74,304 | 96.1 |
| జార్ఖండ్ | 6,82,250 | 6,54,500 | 95.9 |
| పశ్చిమబెంగాల్ | 12,29,250 | 11,74,426 | 95.5 |
| ఉత్తరప్రదేశ్ | 47,85,333 | 45,19,270 | 94.4 |
| మణిపూర్ | 33,333 | 31,340 | 94.0 |
| తెలంగాణ | 5,29,500 | 4,89,370 | 92.4 |
| కేరళ | 4,14,500 | 3,81,706 | 92.1 |
| కర్ణాటక | 9,45,417 | 8,67,853 | 91.8 |
| దాద్రానగర్‌హవేలి | 7,417 | 6,766 | 91.2 |
| హర్యానా | 4,79,667 | 4,35,982 | 90.2 |
| ఛత్తీస్‌గఢ్ | 5,18,333 | 4,70,765 | 90.8 |
| పంజాబ్ | 4,65,667 | 3,29,941 | 90.2 |
| గోవా | 18,833 | 16,864 | 89.5 |
| మధ్యప్రదేశ్ | 16,38,667 | 14,63,277 | 89.3 |
| ఆంధ్రప్రదేశ్ | 7,00,583 | 6,25,434 | 89.3 |
| త్రిపుర | 44,917 | 39,914 | 88.9 |
| గుజరాత్ | 10,86,250 | 9,33,764 | 86.0 |
| మిజోరం | 15,167 | 12,981 | 85.6 |
| అసోం | 5,95,083 | 5,05,894 | 85.0 |
| తమిళనాడు | 9,26,917 | 7,61,182 | 82.1 |
| హిమాచల్‌ప్రదేశ్ | 95,833 | 78,153 | 81.6 |
| చండీగఢ్ | 17,417 | 13,783 | 79.1 |
| ఒడిశా | 6,66,000 | 4,90,336 | 73.6 |
| రాజస్థాన్ | 14,99,083 | 10,49,833 | 70.0 |
| అండమాన్‌నికోబార్ | 4,417 | 3,058 | 69.2 |
| అరుణాచల్‌ప్రదేశ్ | 23,083 | 15,260 | 66.1 |
| లక్షద్వీప్ | 1,167 | 738 | 63.3 |
| సిక్కిం | 9,083 | 5,331 | 58.7 |
| డామన్,డయ్యూ | 6,750 | 3,934 | 58.3 |
| నాగాలాండ్ | 25,000 | 13,746 | 55.0 |
| పాండిచ్చేరి | 19,667 | 10,624 | 54.0 |
| దేశవ్యాప్తంగా | 22,136,417 | 2,00,86,288 | (సగటు) 90.7 |

**ముహూర్తం**



సూర్యోదయం: 6.40 గంటలకు



సూర్యాస్తమయం: 6.14 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం చతుర్దశి సాయంత్రం 7.03 వరకు, తదుపరి అమావాస్య, నక్షత్రం: శ్రవణం ఉదయం 11.20 వరకు, తదుపరి ధనిష్ఠ, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: ఉదయం 9.33 నుంచి 11.00 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.40 నుంచి 8.11 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 3.43 నుంచి సాయంత్రం 5.30 వరకు.

# ఏజెన్సీ ముట్టడి

మొదటిపేజీ తరువాయి...

దళాల సాయం తీసుకుంటున్నట్టు సమాచారం. డ్రోన్ కెమెరాలను సైతం అడవులను జల్లెడపట్టేందుకు వినియోగిస్తున్నట్టు తెలుస్తున్నది. ఆపరేషన్ ప్రహార్‌లో భాగంగా భద్రతా బలగాలు బృందాలుగా దండకారణ్యంలో సుమారు 30 కిలోమీటర్ల వరకు చొచ్చుకుపోయి సెర్చ్ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. తెలంగాణ సరిహద్దు నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు ఏకకాలంలో ఆపరేషన్ ప్రహార్ కొనసాగుతున్నదని ఛత్తీస్‌గఢ్ డీజీపీ డీఎం అవస్థి అధికారికంగా ధ్రువీకరించారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 1500 మంది డీఆర్జీ బలగాలు, 500 మంది కోబ్రా బెటాలియన్ జవాన్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆపరేషన్ ప్రహార్‌లో భాగంగా రెండురోజుల కిందట ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా తొండమార్క- దుర్మా సరిహద్దులో జరిగిన ఎదురుకాల్పుల్లో సుమారు 20 మంది మావోయిస్టులకు గాయాలు కాగా, మరికొందరు మృతిచెందినట్టుగా పోలీసువర్గాల సమాచారం. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం అధికారికంగా తెలియాల్సి ఉన్నది. ఆపరేషన్ ముమ్మరమైన నేపథ్యంలో భీకరపోరు తప్పదని తెలుస్తున్నది.

### వరుసదాడులతో కవ్విస్తున్న మావోయిస్టులు

ఈ నెల 10న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని పామేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలపై మావోయిస్టులు మెరుపుదాడి చేయగా ఇద్దరు జవాన్లు, ఒక మావోయిస్టు మృతి చెందగా, మరో ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. 18వ తేదీన సుక్మా జిల్లాలోనూ జవాన్లపై జరిపిన కాల్పుల్లో ఒకరు మృతిచెందగా, మరో జవాన్ పరిస్థితి విషమించి మృతిచెందాడు. తాజాగా కాంకేర్‌జిల్లాలోని కోయిలాబేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కటాగావ్ నది వద్ద వంతెన నిర్మాణపనులకు మావోయిస్టులు ఆటంకం కలిగించారు. పనులు నిర్వహిస్తున్న నిర్మాణసంస్థ అకౌంటెంట్ జగ్గు మండల్‌ను హత్యచేశారు.

### నంబాల ఆధ్వర్యంలో భారీ విస్తరణకు ప్రణాళిక

ఇటీవల ప్రకటించిన కేంద్ర కమిటీ నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు అలియాస్ గంగన్నను నియమించినట్టు మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ నుంచి ధ్రువీకరణ లేఖలు వెలువడ్డాయి. వయోభారం దృష్ట్యా అగ్రనాయకుడు గణపతిని కేంద్ర కమిటీలో తూర్పు విభాగం ప్రాంతీయ కార్యదర్శి (ఈఆర్బీ)గా నియమించినట్టు సమాచారం. దూకుడు వైఖరి కలిగిన కేశవరావు నాయకత్వంలో మావోయిస్టు పార్టీని విస్తరింపచేసేందుకు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తున్నది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా, జగదల్‌పూర్, దంతేవాడ, బీజాపూర్, నారాయణపూర్, కాంకేర్, బస్తర్ జిల్లాల్లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భారీ రిక్రూట్‌మెంట్ చేపడుతున్నట్టు సమాచారం. ఛత్తీస్‌గఢ్‌తోపాటు మహారాష్ట్ర, ఆంధ్ర, ఒడిశా, ఉత్తర తెలంగాణలో ప్రాబల్యాన్ని పెంచుకునే దిశగా పనిచేస్తున్నట్టు తెలుస్తున్నది. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల సరిహద్దులో రిక్రూట్‌మెంట్ అడుగులు వేస్తున్నట్లు నిఘావర్గాల సమాచారం. ఈ రిక్రూట్‌మెంట్‌ను దీటుగా ఎదుర్కొనేందుకే ఆపరేషన్ ప్రహార్ పేరుతో మావోయిస్టుల ఏరివేతకు వ్యూహం రచించడంతో ఛత్తీసగఢ్‌లో వందల సంఖ్యలో, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో పదుల సంఖ్యలో మావోయిస్టులు, సానుభూతిపరులు లొంగుబాటపడుతున్నారు. ఇటీవల మావోయిస్టు అగ్రనేతల పేరిట కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తలకు బెదిరింపులతో బహిరంగలేఖలు వచ్చాయి. వీటిని తిప్పికొట్టేందుకు పోలీస్ యంత్రాంగం ప్రతి వ్యూహాలతో ముందుకు వెళ్తున్నది. ఇటు మావోయిస్టులు, అటు పోలీసులు మధ్య పోరులో ఆదివాసీలు బిక్కుబిక్కుమంటూ జీవనం కొనసాగిస్తున్నారు.

## లోకం పోకడ




మిగతా అరవైతొమ్మిది లక్షలమందిని గ్రాఫిక్స్‌లో సర్దుదాం.. మన డిజిటల్ ఇండియా సత్తా చాటుదాం!!



గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా శుక్రవారం తమిళనాడు రాష్ట్రం కోయిల్‌పట్టిలో మొక్కలునాటి నీరు పోస్తున్న ప్రముఖ సినీనటి ప్రియమణి. చిత్రంలో దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల, క్యారెక్టర్ ఆర్టిస్ట్ రామరాజు, కాదంబరి కిరణ్ ఉన్నారు. శుభకార్యాల్లో మొక్కలను బహుమతిగా లేదా రిటర్న్ గిఫ్టులుగా ఇవ్వాలని ఆమె సూచించారు.

# మార్చి 4 నుంచి ఇంటర్ పరీక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో మార్చి 4 నుంచి ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. హాల్‌టికెట్ల జారీ ప్రక్రియను ప్రారంభిస్తూ.. అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు వాటిని పంపిస్తున్నారు. అందని విద్యార్థులు ఇంటర్‌బోర్డు అధికారిక వెబ్‌సైట్ నుంచి తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయం బోర్డు అధికారులు కల్పించారు. ట్యూషన్ ఫీజుల పేరుతో కొన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయనే ఆలోచనతో ఈ సౌకర్యాన్ని కల్పించినట్టు తెలిపారు. హాల్‌టికెట్లు ఇవ్వని యాజమాన్యాలపై చర్యలు తీసుకొంటామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 9.65 లక్షల మంది విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 4.8 లక్షలు, ద్వితీయ సంవత్సరంలో 4.85 లక్షల మంది విద్యార్థులున్నట్టు బోర్డు అధికారులు ధ్రువీకరించారు. పరీక్షలను సజావుగా నిర్వహించడానికి అన్నిచర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

శివోహం




మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైలంలో స్వామి అమ్మవార్ల ప్రభోత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తజనం



కీసరగుట్టలోని రామలింగేశ్వరుడిని దర్శించుకొనేందుకు బారులుతీరిన భక్తులు



కీసర రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీ సంతోష్‌కుమార్. చిత్రంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రావు, ఎమ్మెల్యే వివేకానంద, సీఎస్ సోమేశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ నేత మర్రి రాజశేఖర్ రెడ్డి, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి కూడా ఉన్నారు.

## కీసరలో ప్రముఖుల పూజలు

**కీసర:** రాష్ట్రంలో ప్రముఖ శైవక్షేత్రంగా పేరొందిన కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మేడ్చల్ జిల్లాలోని కీసరగుట్ట పుణ్యక్షేత్రం శుక్రవారం శివనామస్మరణతో మారుమోగింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేదపండితులు గర్భగుడిలో శివలింగానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కీసరగుట్టలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్, కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, కలెక్టర్ వీ వెంకటేశ్వర్లు, పలువురు ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొన్నారు. రాచకొండ సీపీ మహేశ్ భగవత్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

### గురుకుల డిగ్రీ కళాశాలల్లో
## 34 ప్రిన్సిపల్ పోస్టుల భర్తీ

మార్చి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 34 ప్రిన్సిపల్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తుచేసుకోవాలని తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామక బోర్డు (టీఆర్‌ఈఐ-ఆర్బీ) శుక్రవారం ఒక ప్రకటనలో కోరింది. టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ పరిధి మహిళా డిగ్రీ కళాశాలల్లో ఇదివరకే అనుమతించిన 19, టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ గురుకుల మహిళా, సాధారణ డిగ్రీ కళాశాలల పరిధిలో కొత్తగా కేటాయించిన 15 ప్రిన్సిపల్ పోస్టులు భర్తీచేయాలని నిర్ణయించారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. పూర్తి వివరాలకు www.treirb.net www.treirb.net, www.telangana.gov.in www.telangana.gov.in వెబ్‌సైట్లను పరిశీలించాలని, ఇతర సమాచారం కోసం 040-23317140 నంబర్‌లో సంప్రదించాలని, విద్యార్హతలున్న అభ్యర్థులు మార్చి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకోవాలని టీఆర్‌ఈఐ-ఆర్బీ సూచించింది.

## ఎమ్మెస్‌ఎంఈ పార్కులపై దృష్టి

- 17 పార్కులను అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయం
- కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన రాష్ట్ర అధికారులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎమ్మెస్‌ఎంఈ) ఊతమిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెస్‌ఎంఈ పార్కులను అభివృద్ధి చేస్తున్నది. ఇప్పటికే ఉన్న 17 ఎమ్మెస్‌ఎంఈ పార్కులను అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. వీటిల్లో ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, నీరు, విద్యుత్ సరఫరా, కామన్ ఫెసిలిటి సెంటర్ల (సీఎఫ్సీ) ఏర్పాటు వంటి సదుపాయాలు కల్పించనున్నారు. దశాబ్దాల క్రితంనాటి పారిశ్రామిక పార్కులను అప్‌గ్రేడ్ చేయడం వల్ల కొత్త టెక్నాలజీకి కావాల్సిన శిక్షణ ఇచ్చేందుకు సీఎఫ్సీలు ఉపయోగపడనున్నాయి. కేంద్రం ప్రవేశపెట్టిన క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (సీడీపీ) కింద వీటిని చేపడుతున్నారు. వీటికి 60 నుంచి 75 శాతం వరకు నిధులను కేంద్రం గ్రాంట్‌గా ఇస్తున్నది. ఒక్కో పార్కుకు రూ.15 కోట్లు గరిష్ఠ గ్రాంట్‌గా కేంద్రం నుంచి అందే అవకాశాలు ఉన్నాయి. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించనున్నది. వీటిలో ఆరు క్లస్టర్లు.. వరంగల్, సుల్తాన్‌పూర్ ఫిక్కి లేడీ ఆర్గనైజేషన్ పార్కు, బుగ్గపాడు, కళ్లెం, కుందన్‌పల్లి, భువనగిరికి సంబంధించి ప్రతిపాదనలు తయారుచేసి కేంద్రానికి పంపారు. వీటికి రూ.54 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఇందులో రూ.42 కోట్లు కేంద్రం వాటా, రాష్ట్రం వాటా రూ.12 కోట్లు. మిగిలిన 11 పార్కులు సహా గద్వాల, హయత్‌నగర్, జడ్చర్ల, చిట్యాల, రామగుండం, మంచిర్యాల, హైదరాబాద్‌లో మరికొన్నింటినికి కూడా తెలంగాణ అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేశారు.



సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రాత్రి మొక్కనాటుతున్న ఎంపీ సంతోష్‌కుమార్. చిత్రంలో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రావు, ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, లింగయ్య తదితరులు.

## రెగ్యులర్ వీసీలతో సమస్యలకు పరిష్కారం!

- ఉద్యాన, వెటర్నరీ వర్సిటీల్లో మారనున్న రూపు
- టీచింగ్, పరిశోధనారంగాలపై పర్యవేక్షణ కరువు
- ఐకార్ అక్రెడిటేషన్‌పై ప్రభావం

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాలకు త్వరలో వీసీలను నియమించాలన్న సీఎం కేసీఆర్ నిర్ణయంతో ఉద్యాన, వెటర్నరీ వర్సిటీల్లో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నారు. ఐదేండ్లుగా ఖాళీగా ఉన్న కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయాలకు త్వరలోనే రెగ్యులర్ వీసీల నియామకం కోసం తీసుకున్న నిర్ణయంపై ఉద్యోగులు, సిబ్బంది హర్షం వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్ర పునర్విభజనలో భాగంగా 2014 డిసెంబర్‌లో తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేశారు. నాటి వ్యవసాయశాఖ కమిషనర్ పూనం మాలకొండయ్య వర్సిటీ వీసీగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి సుమారు ఐదేండ్లపాటు వీసీగా కొనసాగారు. ప్రస్తుతం బీ జనార్దన్‌రెడ్డి ఇంచార్జి వీసీగా కొనసాగుతున్నారు. పూర్తిస్థాయి వీసీ లేకపోవడంతో కీలకనిర్ణయాలు తీసుకోలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. పాలకమండలి నియామకం కూడా లేకపోవడంతో ఐదేండ్ల నుంచి స్నాతకోత్సవం జరుగలేదు. పరిశోధనాస్థానాల్లో పరిశోధనలపై నియంత్రణ లేకుండాపోయి ఉద్యాన, పశువైద్యరంగాల్లో పరిశోధనలపై ప్రభావం పడుతున్నది. రెగ్యులర్ రిజిస్ట్రార్, డీన్, పరిశోధనా సంచాలకులు లేకపోవడంతో ప్రొఫెసర్లే అదనపు బాధ్యతలు నెరవేర్చాల్సి రావడం భారంగా మారుతున్నది. కోట్ల రూపాయలు వెచ్చించి ములుగులో ఏర్పాటుచేసిన 'బాహుబలి' పరిపాలనా భవనంలో వర్సిటీ అధికారులు మినహా విద్యార్థులు, నాన్‌టీచింగ్, టీచింగ్ సిబ్బంది కూడా లేరు. ఉద్యాన రైతులకు శాస్త్రీయ సలహాలు, సూచనలు అందాలంటే టీచింగ్, పరిశోధనలపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయానికి నిధులు రావాలంటే వర్సిటీ పరిధిలోని కళాశాలలకు భారత వ్యవసాయ పరిశోధనామండలి (ఐసీఏఆర్) అక్రెడిటేషన్ తప్పనిసరి. ఇతరరాష్ట్రాలు, దేశాలకు చెందిన విద్యార్థులు, వివిధ దేశాల్లో పరిశోధనలు చేపట్టిన అధ్యాపకులు, అంతర్జాతీయ, జాతీయ సంస్థల నుంచి ప్రాజెక్టులు వంటి ప్రాథమ్యాలుండాలి. లేదంటే కళాశాలలకు నిధులు రాకపోగా.. ఆయా కళాశాలల్లో చదివిన విద్యార్థులకు ఇతర రాష్ట్రాల నియామకాల్లో అర్హత ఉండదు.

## వరకట్న హత్యకేసులో ముగ్గురికి ఏడేండ్ల జైలు

దిగువ కోర్టు తీర్పును తిరగరాసిన హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వరకట్నం కోసం మహిళను హత్యచేసిన కేసులో ముగ్గురికి హైకోర్టు ఏడేండ్ల చొప్పున కారాగారశిక్ష, రూ.20వేల చొప్పున జరిమానా విధించింది. గతంలో నిందితులను నిర్దోషులుగా పేర్కొంటూ మెదక్ మూడో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి (ఫాస్ట్‌ట్రాక్) కోర్టు ఇచ్చిన తీర్పును చీఫ్ జస్టిస్ ఆర్‌ఎస్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం తిరగరాసింది. జరిమానా కట్టనిపక్షంలో మరో ఏడాది జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నది. మృతురాలు తల్లికి రూ.50 వేలు చెల్లించాలని ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఎల్లాపూర్‌కు చెందిన తలారి భాగ్యలక్ష్మి వివాహం నర్సాపూర్‌కు చెందిన దుడ్డల సంతోష్‌తో 2010లో జరిగింది. కొద్ది రోజులు బాగానే ఉన్న సంతోష్ తర్వాత తల్లి బాలామణి, తండ్రి నర్సింహులుతో కలిసి భాగ్యలక్ష్మిని అదనపు కట్నం కోసం వేధించడం మొదలుపెట్టాడు. ఓ రోజు భాగ్యలక్ష్మి అనుమానాస్పద స్థితిలో కాలినగాయాలతో చనిపోయింది. భాగ్యలక్ష్మిని భర్త, అత్తమామలే హత్యచేశారని మృతురాలి సోదరుడు కృష్ణ, తల్లి నర్సమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన మెదక్ మూడో అదనపు జిల్లా కోర్టు 2013లో నిందితులు నిర్దోషులని తీర్పునిచ్చింది. దీంతో బాధితురాలి కుటుం బం హైకోర్టులో సవాల్‌చేసింది. విచారణ చేపట్టిన హైకోర్టు దిగువకోర్టు తీర్పును తప్పుబట్టింది. ప్రధాన సాక్షుల వాంగ్మూలాల్లో తేడా లు ఉండటం సహజమేనని పేర్కొన్నది. అదనపు కట్నం కోసం అత్తమామలు, భర్త డి మాండ్ చేసినట్టు బలమైన సాక్ష్యాలు ఉన్నాయని తెలిపింది. ఎవిడెన్స్ యాక్ట్ సెక్షన్ 113 బీ ప్రకారం తమకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యా లు నిజంకాదని నిందితులు నిరూపించుకోలేకపోయారనేది దిగువ కోర్టు విస్మరించిందని పేర్కొన్నది. అన్ని ఆధారాలను పరిశీలించిన ధర్మాసనం నిందితులను దోషులుగా నిర్ధారించి.. ఐపీసీ సెక్షన్ 304 బీ ప్రకారం శిక్షలు విధించింది.



Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office: Commercial Complex II, Sector - 49-50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com

*₹10000 ఆదా సాధారణ ఫైనాన్స్ స్కీంపై లెక్కించబడింది మరియు నిర్దేశిత లోన్ మొత్తం మరియు వ్యవధి పై ఆధారపడింది. ఎంపిక చేయబడిన ఫైనాన్షియర్‌తో తమ స్వంత నిర్ణయాధికారం మేరకు ఫైనాన్స్ లభిస్తుంది. చిత్రంలో చూపించబడిన ఉత్పత్తి మార్కెట్‌లో లభించే అసలు ఉత్పత్తి కంటే వేరుగా ఉండవచ్చు. చిత్రంలో చూపించిన యాక్సెసరీస్ ప్రామాణిక ఫిట్మెంట్‌లో భాగం కాదు. **షరతులు వర్తిస్తాయి.

**Honda Exclusive Authorized Dealerships:** **KARIMNAGAR:** Samrat Honda - 0878-2277299; 9441333665; Srikanth Honda - 0878-2224555, 7799946632; **KARIMNAGAR INTERCITY BRANCH, VAVILALA RAMREDDY NAGAR:** Samrat Honda - 0878 2954514; 9849252091; **JAGATIAL:** Samrat Honda - 9701200045, 9704500045; Vennela Honda - 9618416377; **HUZURABAD:** Samrat Honda - 8099979050; **SIRCILLA:** Srikanth Honda - 08723-233336, 7799700245; **VEMULAWADA:** Srikanth Honda - 9177662757; **METPALLY:** Saanvi Honda - 9581295818; **JAMMIKUNTA:** Srikanth Honda - 7799700263; **HUSANABAD:** Laxmi Honda - 08019138142; **RAMAGUNDAM:** Sai Ram Krishna Honda - 8100779999; **PEDDAPALLY:** Sairam Krishna Honda - 9100044414; **SULTANABAD:** Aradhana Honda - 9849885862; **DHARMARAM:** Sairam Honda - 7799146669; 08728-270950; **MANCHERIAL:** Jagadamba Honda - 08736-259303, 9849113133; **BELLAMPALLY:** Thirumala Honda - 08735225975; 9059979909; **ASIFABAD:** Jagadamba Honda - 9849113133; **KAGAZNAGAR:** Jagadamba Honda - 9849113133; **ADILABAD:** Sree Mahalakshmi Honda - 9010977757; **NIRMAL:** Sree Mahalakshmi Honda - 9010977757; **KHANAPUR:** Sri Ganesh Honda - 9010977757; **BHAINSA:** Sree Mahalakshmi Honda - 9010977757; **ICHODA:** Sree Mahalakshmi Honda - 9010977757; **UTNOOR:** Mahalakshmi Motors - 9010977757; **BOATH:** Ajay Motors - 9010977757; **ADILABAD INTERCITY NEAR BUSSTAND:** Sree Mahalakshmi Honda - 9010977757.

**For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com**



కోయంబత్తూరులోని ఈశా ఫౌండేషన్‌లో మహా శివలింగానికి పూజలు చేస్తున్న వెంకయ్య

• ఓం నమఃశివాయ



కాళేశ్వరం వద్ద గోదావరి తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

## కన్నులపండువగా శివపార్వతుల కల్యాణం

**కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామివారి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు అంబరాన్నంటాయి. మహాశివరాత్రి సందర్భంగా స్వామివారిని 1.5 లక్షల మంది భక్తులు దర్శించుకొన్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. గోదావరి తీరంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు సైకత లింగాలకు పూజలుచేశారు. అక్కడినుంచి ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకొన్నారు. అనంతరం ముక్తీశ్వర శుభనందాదేవి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.



కాళేశ్వరం ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం



## ఘనంగా 'ఈశా' శివరాత్రి వేడుకలు

పాల్గొన్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తమిళనాడు కోయంబత్తూరులోని ఈశా ఫౌండేషన్ యోగా కేంద్రంలో శివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సద్గురు రచించిన 'డెత్– యాన్ ఇన్‌సైడ్ స్టోరీ' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు లింగ భైరవి, ధ్యాన లింగ యోగిక్ ఆలయాన్ని సందర్శించిన వెంకయ్య నాయుడు, సద్గురుతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాశివుడికి పంచభూత ఆరాధన చేశారు. ఆ తర్వాత ఆదియోగి భారీ విగ్రహాన్ని సందర్శించారు. జాగారం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

**ఆర్ట్ ఆఫ్ లివింగ్ కేంద్రంలో..**

మహాశివరాత్రిని పురస్కరించుకొని బెంగుళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతర్జాతీయ కేంద్రంలో వైభవంగా ఉత్సవాలు జరిగాయి. గురుదేవ్ రవిశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. రుద్రపూజ, ధ్యానం, సత్సంగంతో ప్రారంభమైన శివరాత్రి మహోత్సవాల్లో వేదమంత్రాలు, శివస్తుతి భక్తి గీతాలు, ఢమరుక నాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. మహాశివరాత్రిని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా దాదాపు 200కు పైగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ కేంద్రాల్లో రుద్రపూజలు, ధ్యానం నిర్వహించారు.



ఢిల్లీలోని కంటోన్మెంట్‌లో సైనిక ప్రధాన కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రాజ్‌నాథ్

## శక్తిమంత దేశాల్లో భారత్

రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వెల్లడి

సైనిక ప్రధాన కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ

**న్యూఢిల్లీ:** భారత సైన్యం ప్రధాన కార్యాలయ నిర్మాణానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం భూమి పూజ చేశారు. ఢిల్లీలోని కంటోన్మెంట్ ప్రాంతంలో 39 ఎకరాల్లో నిర్మించనున్న ఏడంతస్తుల భవనానికి 'థల్ సేనా భవన్' అని నామకరణం చేశారు. వెలిగే సూర్యుడు ఆకృతిలో దీన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ మాట్లాడుతూ మన శక్తి సామర్థ్యాలను చూసి భారత్ బలహీనదేశం కాదని, శక్తివంతమైన దేశాల్లో ఒకటని ప్రపంచ దేశాలు గుర్తించాయన్నారు. ఈ గుర్తింపు, గొప్పతనం అంతా మన అమర జవాన్లకే చెందుతుందని తెలిపారు. 'భారత్ అత్యంత శక్తి సామర్థ్యాలు గల దేశంగా నిలదొక్కుకోవాలన్నది మన అమర జవాన్ల కోరిక. వారి కోరిక సాకారమైంది. సైనిక సంపత్తి పరంగా ప్రపంచంలోనే శక్తి సామర్థ్యాలు కలిగిన దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచింది. ప్రస్తుతం మనం ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే స్థితిలో ఉన్నాం' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. సైన్యాధిపతి నరవణె మాట్లాడుతూ ఈ నూతన భవనం పూర్తవ్వడానికి మూడునాలుగేండ్లు పట్టొచ్చని, దీని కోసం దాదాపు రూ.700 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు.

# పాక్‌కు శరాఘాతం!

ఆ దేశాన్ని గ్రే లిస్ట్‌లోనే కొనసాగించాలని ఎఫ్‌ఏటీఎఫ్ నిర్ణయం

ఉగ్రనిధులను అడ్డుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

జూన్‌లోగా 27 అంశాల కార్యాచరణను పూర్తిచేయాలని స్పష్టీకరణ

ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు నుంచి పాక్‌కు నిధుల రాక కష్టమే

మరింత ముదరనున్న ఆర్థిక సంక్షోభం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** పాకిస్థాన్‌ను 'గ్రే' జాబితాలోనే కొనసాగించాలని అంతర్జాతీయ ఉగ్రవాద నిధుల నిరోధక సంస్థ 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్' (ఎఫ్ఏటీఎఫ్) శుక్రవారం నిర్ణయించింది. ఉగ్రవాదులకు నిధుల చేరవేతలో ప్రమేయమున్న వారిని శిక్షించకపోతే కఠిన చర్యలు తప్పవని ఆ దేశాన్ని హెచ్చరించింది. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో వారం రోజులుగా జరుగుతున్న ఎఫ్ఏటీఎఫ్ ప్లీనరీ సమావేశాలు శుక్రవారం ముగిశాయి. లష్కరే తాయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద సంస్థలకు నిధులు అందకుండా నియంత్రించేందుకు తాము నిర్దేశించిన 27 కార్యాచరణ అంశాల్లో పాకిస్థాన్ కేవలం 14 అంశాలనే అమలుచేసిందని ఎఫ్ఏటీఎఫ్ పేర్కొంది. పాక్‌కు ఇచ్చిన అన్ని గడువులు ముగిశాయని, అయినప్పటికీ కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడంలో ఆ దేశం విఫలమైందని తెలిపింది. ఈ ఏడాది జూన్ లోగా కార్యాచరణను పూర్తిచేయకపోతే కఠిన చర్యలు తప్పవని ఒక ప్రకటనలో హెచ్చరించింది. పాక్‌తో వాణిజ్య సంబంధాలు, లావాదేవీలపై ప్రత్యేక దృష్టిసారించాలని సభ్యదేశాలు తమ ఆర్థిక సంస్థలకు తెలియజేయాలని సూచించింది.

**ఇలాగే వ్యవహరిస్తే బ్లాక్ లిస్ట్ చేరే ప్రమాదం..**

ఎఫ్ఏటీఎఫ్ నిర్ణయం నేపథ్యంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్), ప్రపంచబ్యాంక్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) తదితర సంస్థల నుంచి నిధులు పొందడం పాకిస్థాన్‌కు కష్టతరమవుతుంది. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఆ దేశానికి ఇది శరాఘాతంగా మారనుంది. ఎఫ్ఏటీఎఫ్ ఆదేశాలను అనుసరించకపోతే ఉత్తరకొరియా,



ఇరాన్ మాదిరిగా పాక్ కూడా 'బ్లాక్' లిస్ట్‌లో చేరే పరిస్థితిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. మలేషియా నుంచి గట్టి మద్దతు లభించినప్పటికీ, ఇతర పశ్చిమ దేశాల మద్దతు పొందడంలో పాక్ విఫలమైంది. 39 సభ్యదేశాలు గల ఎఫ్ఏటీఏలో పాక్ గ్రే లిస్ట్ నుంచి బయటపడేందుకు ఆ దేశానికి 12 దేశాల మద్దతు అవసరం. బ్లాక్ లిస్ట్‌లో చేరకుండా ఉండాలంటే కనీసం మూడు దేశాలు మద్దతివ్వాలి. గతేడాది అక్టోబర్‌లో జరిగిన సమావేశాల్లో చైనాతోపాటు మలేషియా, టర్కీ మద్దతివ్వడంతో బ్లాక్ లిస్ట్‌లో చేరే ప్రమాదం నుంచి పాక్ గట్టెక్కింది. లష్కరే తాయిబా, హిజ్బుల్ ముజాహిదీన్, జైషే మహమ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలకు పాక్ మద్దతునిస్తున్నదని, ఆ దేశంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎఫ్ఏటీఎఫ్‌ను భారత్ ముందు నుంచీ కోరుతున్నది. పాక్‌ను గ్రే లిస్ట్‌లోనే కొనసాగించాలని మూడు రోజుల కిందట ఎఫ్ఏటీఎఫ్ ఉపసంఘం సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. లష్కరే తాయిబా ఉగ్రసంస్థ వ్యవస్థాపకుడు, ముంబై పేలుళ్ల సూత్రధారి హఫీజ్ సయీద్‌కు పాకిస్థాన్‌లోని ఉగ్రవాద వ్యతిరేక కోర్టు 11 ఏండ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించిన వారం రోజులకే ఎఫ్ఏటీఎఫ్ సమావేశాలు జరిగాయి. ఎఫ్ఏటీఎఫ్‌ని, ఇతర సభ్యదేశాలను ప్రసన్నం చేసుకునేందుకే పాక్ ఆ నిర్ణయం తీసుకున్నట్టు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మరో ఉగ్రవాది, జైషే మహమ్మద్ స్థాపకుడు మసూద్ అజర్, అతడి కుటుంబ సభ్యుల ఆచూకీ కనిపించడం లేదని పాక్ ఇటీవలే ఎఫ్ఏటీఎఫ్‌కు సమాచారమిచ్చింది. ఐక్యరాజ్యసమితి ఉగ్రవాదులుగా ముద్రవేసిన 16 మందిలో ఏడుగురు ఇప్పటికే మరణించారని, మిగిలిన వారిలో ఏడుగురు తమను ఆ జాబితా నుంచి తొలిగించాలని ఐరాసకు దరఖాస్తు చేసుకున్నారని వివరించింది. ఉగ్రవాదులకు నిధుల చేరవేతను అడ్డుకునేందుకు 1989లో ఎఫ్ఏటీఎఫ్ ఏర్పాటైంది. పారిస్ కేంద్రంగా ఇది పనిచేస్తున్నది.

## అమ్మ పిలుస్తోంది!

సత్ఫలితాలను ఇస్తున్న 'ఆపరేషన్ మా'

ఉగ్రవాద సంస్థల్లో చేరిన కశ్మీరీ యువతను వెనక్కి రప్పించే యత్నం

**శ్రీనగర్:** నక్సలైట్లను జనజీవన స్రవంతిలో కలిసేలా ప్రోత్సహించేందుకు 'అమ్మ పిలుస్తోంది' అంటూ పోలీసులు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చేపట్టిన ప్రయోగాత్మక కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. ఇదే మాదిరిగా ఉగ్రవాద సంస్థల్లో చేరిన యువకులను తిరిగి ఇంటికి రప్పించేందుకు జమ్ముకశ్మీర్‌లో ఇండియన్ ఆర్మీ.. 'ఆపరేషన్ మా' పేరుతో కార్యక్రమం చేపట్టింది. ఎన్‌కౌంటర్లో చిక్కుకొన్న ఓ స్థానిక ఉగ్రవాదిని సాధారణ జనజీవితంలోకి రావాల్సిందిగా ఒప్పించేందుకు ఆయన తల్లితో మాట్లాడించేందుకు కశ్మీర్‌లోని 15వ కార్ప్స్‌కు నాయకత్వం వహించిన లెఫ్టినెంట్ జనరల్ కన్వల్జీత్‌సింగ్ ధిల్లాన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ఉగ్రవాద సంస్థల్లో బలవంతంగా ఉండిపోవాల్సిన యువతను తిరిగి ఇంటికి రప్పించేందుకు తమ ముందున్న అన్ని అవకాశాలను వినియోగిస్తామని, గతంలో కూడా ఇలాంటి కార్యక్రమాలను చేపట్టి విజయం సాధించామని తెలిపారు. ఉగ్రసంస్థల్లోని స్థానిక యువతను ఒప్పించేందుకు వారి తల్లి, స్థానిక మతపెద్దలతో మాట్లాడించి తిరిగి ఇంటికి చేరుకొనేలా చేయడమే 'ఆపరేషన్ మా' ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంతో ఉగ్రవాద సంస్థల్లో చేరే స్థానిక యువకుల సంఖ్య తగ్గిందని సైన్యానికి చెందిన ఓ అధికారి తెలిపారు. భద్రతా సంస్థల నివేదిక ప్రకారం ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత ఆర్నెళ్ల కాలంలో ఉగ్రవాద సంస్థల్లో చేరిన యువకుల సంఖ్య ప్రతి నెలలో సగటున నలుగురుగా ఉండగా.. 2019 ఆగస్టు 5కు ముందు ఈ సంఖ్య నెలకు 14గా నమోదైంది. గతంలో ఎన్‌కౌంటర్లో చనిపోయిన ఉగ్రవాదుల అంత్యక్రియల సందర్భంగా పదివేలకు పైగా జనం హాజరయ్యేవారని, ప్రస్తుతం ఆ సంఖ్య కొద్దిమంది దగ్గరి బంధువులకే పరిమితమైందని ఆ నివేదిక పేర్కొంది.

అజ్మీర్ దర్గాకు ప్రధాని చాదర్



రాజస్థాన్‌లోని ప్రసిద్ధ అజ్మీర్ షరీఫ్ దర్గాకు ప్రధాని నరేంద్ర మోదీ చాదర్‌ను అందజేశారు. ఖ్వాజా మొయినుద్దీన్ చిష్తి 808వ ఉర్సు ఉత్సవాల నేపథ్యంలో శుక్రవారం ఢిల్లీలో తనను కలిసిన దర్గా ప్రతినిధులకు మోదీ చాదర్‌ను అందజేసినట్లు ప్రధాని కార్యాలయం ట్విట్టర్‌లో పేర్కొంది.

## ఆ స్థలాన్ని నిరాకరించలేం!

మసీదు నిర్మాణ స్థలంపై యూపీ సున్నీ వక్ఫ్ బోర్డు స్పష్టీకరణ

**లక్నో:** అయోధ్య కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును అనుసరించి తమకు కేటాయించిన ప్రత్యామ్నాయ స్థలాన్ని తిరస్కరించేందుకు తమకు అవకాశం లేదని ఉత్తరప్రదేశ్ సున్నీ వక్ఫ్‌బోర్డ్ పేర్కొంది. ఆ స్థలాన్ని ఏ విధంగా వినియోగించాలన్న దానిపై సోమవారం జరిగే బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపింది. అయోధ్యలోని వివాదాస్పద స్థలాన్ని రామమందిర నిర్మాణానికి కేటాయిస్తూ గతేడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు తీర్పును వెలువరించిన సంగతి తెలిసిందే. అలాగే మసీదు నిర్మాణం కోసం ప్రత్యామ్నాయంగా ఐదు ఎకరాలు కేటాయించాలని కూడా తీర్పు చెప్పింది. ఈ స్థలాన్ని తిరస్కరించే అవకాశం తమకు లేదని, తిరస్కరిస్తే అది కోర్టు ధిక్కార చర్య అవుతుందని వక్ఫ్ బోర్డ్ అధిపతి ఫారూఖీ పేర్కొన్నారు. కోర్టు తీర్పునకు కట్టుబడి ఉంటామని తాము ముందు నుంచీ చెబుతున్నామన్నారు.

### ఎంసెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం మే 4 నుంచి 11 వరకు నిర్వహించనున్న ఎంసెట్ – 2020 ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను శుక్రవారం నుంచి ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 30వరకు గడువు ఉన్నదని ఎంసెట్ కన్వీనర్ తెలిపారు. డెబిట్, క్రెడిట్‌కార్డు, టీఎస్, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలు, నెట్‌బ్యాంకింగ్ ద్వారా ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. పరీక్షఫీజును రూ.800గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులకు ఫీజులో 50శాతం రాయితీ కల్పించారు.

### పీఈసెట్ ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం

- 24న ఎడ్‌సెట్ నోటిఫికేషన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని బీపీఈడీ (బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్), డీపీఈడీ (డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్) కళాశాలల్లో సీట్ల భర్తీకోసం మే 13 నుంచి నిర్వహించనున్న పీఈసెట్–2020 ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. ఇప్పటివరకు 100 మందికి పైగా విద్యార్థులు వెబ్‌సైట్‌ను సందర్శించి ఫీజులు చెల్లించినట్టు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సత్యనారాయణ తెలిపారు. బీఈడీ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం మే 23న నిర్వహించనున్న ఎడ్‌సెట్ నోటిఫికేషన్ 24న విడుదల చేయనున్నట్టు కన్వీనర్ ప్రొఫెసర్ మృణాళిని చెప్పారు.

### లైజన్ అధికారిని నియమించండి

- సింగరేణి డైరెక్టర్‌కు బీసీ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సింగరేణిలో 49శాతం మంది వెనుకబడిన తరగతులవారు ఉన్నారని, వీరికి సంబంధించిన సమస్యలపై సమన్వయం చేయడానికి ఒక చీఫ్ లైజన్ అధికారిని నియమించాలని ఆ సంస్థ బీసీ ఉద్యోగుల సంఘం యాజమాన్యాన్ని కోరింది. సంఘం అధ్యక్షుడు పీ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బీ హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్ శ్రీనివాస్, బీ మహేశ్, రామకృష్ణ తదితరులు శుక్రవారం సింగరేణి భవన్‌లో డైరెక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బీసీల కోసం కృషిచేస్తున్న జనరల్ మేనేజర్ పీ సత్తయ్య పేరును పరిశీలించాలని అందులో కోరారు. కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు సంస్థలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కోసం లైజన్ ఆఫీసర్లను నియమించారని, ఇదే క్రమంలో బీసీ ఉద్యోగుల కోసం కూడా అన్ని ఏరియాల్లో నియమించాలని విజ్ఞప్తిచేశారు.

# ఏపీ ఈఎస్‌ఐలో భారీ కుంభకోణం

- వందల కోట్ల అక్రమాలను గుర్తించిన విజిలెన్స్ అధికారులు
- ఫార్మా కంపెనీలకు 132 శాతం అదనంగా ధర చెల్లింపు
- మాజీ మంత్రి అచ్చెన్నాయుడు పాత్రపై దుమారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అదే విధానం.. అవే నకిలీ కొటేషన్లు, బిల్లులు.. అవే రేట్లు.. తెలంగాణలో ఐఎంఎస్ కుంభకోణం తరహాలో ఆంధ్రప్రదేశ్ ఈఎస్‌ఐలో భారీ అవినీతి వెలుగులోకి వచ్చింది. తెలంగాణ ఐఎంఎస్ కుంభకోణంలో పాలుపంచుకున్నవారే అక్కడా సూత్రధారులని బయటపడింది. మందులు, వైద్య పరికరాల కొనుగోళ్లలో గత అరేండ్లలో రూ.900 కోట్లకు పైగా అక్రమాలు జరిగినట్టు ఏపీ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓ నివేదికను విడుదల చేసింది. ఏపీవ్యాప్తంగా నాలుగు ఈఎస్‌ఐ దవాఖానలు, మూడు ఈఎస్‌ఐ డయాగ్నొస్టిక్ సెంటర్లు, 78 ఈఎస్‌ఐ డిస్పెన్సరీలకు సరఫరా చేసే మందులు, మెడికల్ కిట్లు తదితర వాటికి వాస్తవధర కంటే 132 శాతం అధికంగా ఫార్మా కంపెనీలకు కట్టబెట్టినట్టు.. ఇందులో కొందరు ఈఎస్‌ఐ అధికారులు పెద్దమొత్తంలో డబ్బులు దండుకున్నట్టు తెలుస్తున్నది. ఐదేండ్లుగా ఏపీ ఈఎస్‌ఐ డైరెక్టర్లుగా పనిచేసిన డాక్టర్ బీ రవికుమార్, డాక్టర్ సీకే రమేశ్‌కుమార్, డాక్టర్ జీ విజయ్‌కుమార్ వారి వారి హయాంలో మందులు, మెడికల్ పరికరాలు, సర్జికల్ వస్తువులు, ల్యాబ్‌కిట్ల కొనుగోళ్లను రేట్ కాంట్రాక్టు సంస్థలకు కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నాన్‌రేట్ కాంట్రాక్టు సంస్థలకు కట్టబెట్టినట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు.

**తెలంగాణలో అక్రమాలకు పాల్పడిన కంపెనీలే..**

తెలంగాణ ఐఎంఎస్ స్కాంలో ముఖ్యపాత్ర పోషించిన కంపెనీలే ఏపీ ఈఎస్‌ఐ కుంభకోణంలోనూ ప్రధానపాత్ర పోషించినట్టు తెలుస్తున్నది. లెజెండ్ ఎంటర్‌ప్రైజెస్, ఓమ్నిమెడితోపాటు ఎన్వెంటర్ పర్ఫామెన్స్ సంస్థల డైరెక్టర్లు అధికారులతో కుమ్మక్కై ల్యాబ్ కిట్ల కొనుగోళ్లలో గోల్‌మాల్‌కు పాల్పడినట్టు సమాచారం. మొత్తం రూ. 975 కోట్ల మందుల కొనుగోలు చేసి రూ.100 కోట్లమేర నకిలీ బిల్లులు సృష్టించినట్టు తెలిసింది. వాస్తవంగా మందుల కొనుగోలుకు ప్రభుత్వం రూ.293 కోట్లు కేటాయించగా.. రూ.698 కోట్ల మందులు కొనుగోలు చేసినట్టు ప్రభుత్వానికి చూపించి రూ.404 కోట్ల మేర ప్రభుత్వ ఖజానాకు నష్టం కల్గించినట్టు విజిలెన్స్ నివేదికలో వెల్లడించినట్టు సమాచారం. ఈ కొనుగోళ్లలో అప్పటి కార్మికశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పాత్రపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. తనవాళ్లకు చెందిన టెలిహెల్త్ సర్వీసెస్ కంపెనీకి కాంట్రాక్ట్ అప్పగించాలని ఆయన ఈఎస్‌ఐ డైరెక్టర్లకు లేఖ రాసినట్టు ఆరోపణలు వస్తున్నాయి.

**బాధ్యులెవర్నీ వదిలిపెట్టం: ఏపీ కార్మికశాఖమంత్రి జయరాం**

ఏపీ ఈఎస్‌ఐలో జరిగిన అవినీతికి బాధ్యులైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఏపీ కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం స్పష్టంచేశారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా అక్రమంగా చెల్లించిన బిల్లుల సొమ్మును రికవరీ చేస్తామని, మాజీమంత్రి అచ్చెన్నాయుడు సహా ఈ అవకతవకల్లో సంబంధం ఉన్న ఎవరినీ వదిలిపెట్టేది లేదని తెలిపారు.

**నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు: అచ్చెన్నాయుడు**

ఈఎస్‌ఐ అవకవతవకల్లో తన పాత్ర ఉన్నదంటూ వైఎస్సార్సీపీ తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఏపీ మాజీమంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఓవర్గం మీడియా దురుద్దేశంతో తనపై ఆరోపణలు చేస్తున్నదని, అప్పటి కేంద్రప్రభుత్వం ఆదేశాల ప్రకారమే తాను టెలిహెల్త్ సర్వీసెస్‌కు కాంట్రాక్టర్లు ఇచ్చామని చెప్పారు.



కిడ్నీ సంబంధిత వ్యాధితో మరణించిన మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన టీ వెంకటరమణ తల్లిదండ్రులకు సీఎం సహాయనిధి నుంచి విడుదలైన రూ.3 లక్షల చెక్కును శుక్రవారం తన నివాసంలో అందజేస్తున్న పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్.-నమస్తే తెలంగాణ, హైదరాబాద్

## 'అమరావతి' అక్రమాలపై సిట్

ఉత్తర్వులు జారీచేసిన ఏపీ ప్రభుత్వం

**అమరావతి, నమస్తే తెలంగాణ:** ఏపీ మాజీ సీఎం చంద్రబాబు హయాంలో అమరావతిలో జరిగిన ఇన్‌సైడర్ ట్రేడింగ్, బినామీ లావాదేవీలు, ఇతర భూ సంబంధిత వ్యవహారాలపై విచారణకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఐపీఎస్ అధికారి కొల్లి రఘురాంరెడ్డి ఆధ్వర్యంలో 10 మందిని సిట్‌లో సభ్యులుగా నియమించింది. రాజధాని భూముల్లో అక్రమాలపై క్యాబినెట్ సబ్‌కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా సిట్ విచారణ చేపట్టనున్నది. సీఆర్డీయే పరిధిలో సరిహద్దుల మార్పు, ఇన్‌సైడర్ ట్రేడింగ్, బినామీ లావాదేవీలు తదితర అంశాలపై సిట్ దర్యాప్తు జరుపనున్నది. రాజధాని పరిసర ప్రాంతాల్లో ఆక్రమించిన భూములను రాజధాని పరిధిలోకితెస్తూ చేసిన అక్రమాలపై కూడా సిట్ విచారించనున్నది. నిందితులపై క్రిమినల్ కేసులు పెట్టే అధికారం సిట్‌కు ఉన్నది. ఐపీఎస్ అధికారులు అట్టాడ బాబూజీ, వెంకట అప్పలనాయుడు, శ్రీనివాస్‌రెడ్డి, జయరాం రాజు, విజయ్‌భాస్కర్, గిరిధర్, కెనడీ, శ్రీనివాసన్, ఎస్వీ రాజశేఖర్‌రెడ్డిలను సిట్ సభ్యులుగా నియమించారు.

### బీజేపీ రాష్ట్ర అధ్యక్ష రేసులో లేను

- మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు స్పష్టీకరణ

**హైదరాబాద, నమస్తే తెలంగాణ:** బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో తాను లేనని మహారాష్ట్ర మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నేత సీహెచ్ విద్యాసాగర్‌రావు స్పష్టంచేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఒక కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అవుతాననే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు. పార్టీలో తనకంటే జూనియర్లు దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి నాయకత్వంలో కూడా పనిచేశానని గుర్తుచేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడెవరనేది జాతీయ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అధ్యక్షుడిగా లక్ష్మణ్‌ను కొనసాగించినా ఆయన కొత్త అధ్యక్షుడే అవుతారని పేర్కొన్నారు. అసెంబ్లీలో సీఏఏకు వ్యతిరేకంగా తీర్మానంచేసినా పార్లమెంటు చట్టం ప్రకారం అమలు యథావిధంగా కొనసాగుతుందన్నారు.

# సంక్షోభంలో పెట్టుబడిదారీ సమాజం

- కమ్యూనిస్టు ప్రణాళిక పుస్తకం ఆవిష్కరణలో సీపీఐ మాజీ జాతీయ ప్రధానకార్యదర్శి సురవరం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పెట్టుబడిదారీ సమాజం తీవ్ర సంక్షోభంలో ఉన్నదని సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ సంక్షోభాన్ని పేదదేశాలపై రుద్దేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. మార్క్స్, ఏంగెల్స్ రచించిన కమ్యూనిస్టు మ్యానిఫెస్టోను పీకాక్ క్లాసిక్స్ ప్రచురణ కర్త ఏ గాంధీ తెలుగులోకి అనువదించిన 'కమ్యూనిస్టు ప్రణాళిక' పుస్తకాన్ని రెడ్‌బుక్‌డే సందర్భంగా శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురవరం మాట్లాడుతూ.. సైద్ధాంతిక అధ్యయనంతో వామపక్ష ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. 172 ఏండ్ల క్రితం మార్క్స్, ఏంగెల్స్ రచించిన కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో అద్భుత గ్రంథమని ప్రముఖ కవి కే శివారెడ్డి పేర్కొన్నారు. తాను ఎదగడానికి ఈ పుస్తకం ప్రేరణ నిచ్చిందని చెప్పారు. తనకు స్ఫూర్తినిచ్చిన పుస్తకాలలో కమ్యూనిస్టు మ్యానిఫెస్టో ఒకటని సీపీఎం రాష్ట్రకార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. వర్గరహిత సమాజ నిర్మాణం కోసం మార్క్స్, ఏంగెల్స్ ఈ పుస్తకాన్ని రచించారని సీపీఐ రాష్ట్రకార్యదర్శి చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. హిందుత్వ ఎజెండా అమలవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనిస్టు మ్యానిఫెస్టో ఒక ఆయుధంగా పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి, న్యూడెమోక్రసి నేత వెంకట్రామయ్య, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, జనశక్తి సంపాదకుడు జశ్వంత్, విప్లవ గాయకురాలు విమలక్క, ప్రజాకవి, గాయకుడు గోరటి వెంకన్న, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి, వామపక్ష నాయకులు సాయిబాబ, జ్యోతి, నంద్యాల నరసింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, హైదరాబాద్ బుక్ ఫెయిర్ కోశాధికారి పీ రాజేశ్వర రావు, కవి తంగిరాల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞానకేంద్రంలో కమ్యూనిస్టు ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

# పోలీసు విభాగం ఫిర్యాదుతో కొందరికి నోటీసులు

- ఆధార్ పౌరసత్వపత్రం కాదు: యూఐడీఏఐ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర పోలీసు విభాగం కొందరిని అక్రమ వలసదారులుగా అనుమానిస్తూ, వారు సరైన ధ్రువపత్రాలు చూపకుండా ఆధార్‌ను పొందినట్టు ఫిర్యాదు చేయడంతో యూఐడీఏఐ ప్రాంతీయ కార్యాలయం 127 మందికి నోటీసులు జారీచేసింది. ఈ నేపథ్యంలో కొన్ని ప్రసారమాధ్యమాల్లో వచ్చిన వార్తలు సరైన దృష్టికోణంలో లేవని, ఆధార్ పౌరసత్వ ప్రమాణపత్రం కాదని యూఐడీఏఐ శుక్రవారం ఒక ప్రకటనలోతెలిపింది. చట్ట ప్రకారం ఆధార్ నమోదు చేసుకునే ముందు, ఒక వ్యక్తి దేశంలో 182 రోజులు నివసించి ఉండాలనే నిబంధనను యూఐడీఏఐ తప్పక నిర్ధారించాలని, అక్రమ వలసదారులకు ఆధార్ జారీచేయవద్దని సుప్రీంకోర్టు పేర్కొన్నదని యూఐడీఏఐ గుర్తుచేసింది. నోటీసులు పంపిన 127 మందిలో ఎవరైనా నకిలీపత్రాలు సమర్పించినట్టు తేలితే వారి ఆధార్‌ను రద్దు చేస్తామని, లేదా తాత్కాలికంగా నిలిపివేస్తామని పేర్కొన్నది.

# అన్నీ ఉన్నా న్యాయం దక్కట్లే..

- పారిశ్రామికవేత్త కోసం ఆన్‌లైన్‌లో రైతు భూమి మాయం
- గద్వాల జిల్లా అయిజ రెవెన్యూ అధికారుల నిర్వాకం

ధర్మగంట



సాగులో ఉన్న భూమిలో బాధితుడి తండ్రి



బాధితుడు శ్రీనివాస్‌రెడ్డి

**అయిజ:** ఓ పారిశ్రామికవేత్తకు బ్యాంకు రుణం కోసం ఫ్యాక్టరీ పక్కనున్న సర్వేనంబర్‌లోని తొమ్మిది మంది రైతుల భూమిని రికార్డుల్లో లేకుండా చేశారు రెవెన్యూ అధికారులు. ఏడాదిన్నరపాటు అధికారుల చుట్టూ తిరిగిన బాధిత రైతులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, ఎనిమిది మంది వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేశారు. కాగా, ఒక్క రైతుకు చెందిన భూమిని నేటికి నమోదుచేయకపోవడంతో రెండేండ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. ముగ్గురు తాసిల్దార్లు, ఇద్దరు ఆర్డీవోలు మారినా సదరు రైతుకు మాత్రం న్యాయం జరుగలేదు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రం శివారులో 705 సర్వే నంబర్‌లో 20.34 ఎకరాల సాగుభూమి ఉన్నది. ఇందులో తొమ్మిది మంది రైతులు వంశపారంపర్యంగా సాగు చేసుకుంటున్నారు. రెండున్నరేండ్ల కిందట జీ మాధవి భర్త సంజీవరెడ్డి అనే రైతు పేరు మీద 5 ఎకరాల భూమి ఇదే సర్వే నంబర్‌లో ఆన్‌లైన్ లోకి వచ్చిచేరింది. వాస్తవానికి సంజీవరెడ్డికి పక్క పొలంలో పైపుల ఫ్యాక్టరీ ఉన్నది. దానికి బ్యాంకు లోను కోసం 705 సర్వేనంబర్‌లో 5 ఎకరాల భూమి ఉన్నట్టు నమోదు చేయించడంతోపాటు ఆ సర్వే నంబర్ మొత్తం ఆబాదీ (నివాస గృహాలు)గా రెవెన్యూ రికార్డుల్లో తప్పుగా ఎంట్రీ చేయించారు. ఇందుకోసం భారీగా నగదు చేతులు మారినట్టు ఆరోపణలున్నాయి. 705 సర్వేనంబర్‌లో ఎక్స్‌టెంట్ పెరగడంతో అందరు రైతులకు కొత్త పాసుపుస్తకాలు ఇవ్వకుండా అధికారులు నిలిపేశారు. తమకు జరిగిన అన్యాయంపై రైతులు పోరాడగా 8 మందికి కొత్త పాస్‌పుస్తకాలు ఇచ్చారు. కాగా పీ శ్రీనివాస్‌రెడ్డి అనే మరో రైతుకు (1.28 ఎకరాలు) మాత్రం పాస్‌పుస్తకం రాలేదు. పొజిషన్‌లో ఉన్నది శ్రీనివాస్‌రెడ్డే అని వీఆర్వో, గిర్దావర్‌లు పంచనామా చేసి ఇచ్చినా.. తాసిల్దార్ ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. 1950 ఖాస్రా పహణీ నుంచి ఇప్పటివరకు ఆర్వోఆర్ రికార్డుల్లో శ్రీనివాస్‌రెడ్డి కుటుంబం పక్షానే ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో బాధిత కుటుంబం ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకుంటున్నది.

# గుమ్నామీ బాబా అంశంలో కొత్త ట్విస్ట్

ఎలక్ట్రోఫెరోగ్రామ్ ఫలితాలు లేవన్న సీఎఫ్ఎస్ఎల్

**కోల్‌కతా:** నేతాజీ సుభాష్ చంద్రబోస్‌గా కొంతమంది భావిస్తున్న గుమ్నామీ బాబా అంశం మరోమారు చర్చనీయాంశమైంది. బాబా దంతాలపై జరిపిన ఎలక్ట్రోఫెరోగ్రామ్ ఫలితాల వివరాలు తమ దగ్గరలేవని కోల్‌కతాలోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ(సీఎఫ్ఎస్ఎల్) తాజాగా వెల్లడించింది. మనిషి డీఎన్‌ఏను క్రమపద్ధతిలో ఆవిష్కరిస్తూ.. కచ్చితమైన ఫలితాల కోసం ఎలక్ట్రోఫెరోగ్రామ్ పరీక్షను నిర్వహిస్తారు. నేతాజీ అజ్ఞాతంలో ఉన్నప్పుడు గుమ్నామీ బాబాగా చలామణి అయ్యారని కొందరి వాదన. చివరిదశలో నేతాజీ ఏమయ్యారోనన్న అంశంపై సాయ కేసేన్ అనే ఔత్సాహికుడు పలు వివరాల్ని సేకరిస్తున్నాడు. ఈ క్రమంలో గుమ్నామీ బాబా దంతాలకు సంబంధించిన ఎలక్ట్రోఫెరోగ్రామ్ ఫలితాల వివరాల్ని కోరుతూ సమాచారహక్కు చట్టం ద్వారా సీఎఫ్ఎస్ఎల్, కోల్‌కతా అధికారిని వివరాలు అడిగాడు. దీనిపై స్పందించిన సీఎఫ్ఎస్ఎల్ పౌర సమాచార అధికారి.. గుమ్నామీ బాబాకు సంబంధించిన ఎలక్ట్రోఫెరోగ్రామ్ ఫలితాలు తమవద్ద లేవని తెలిపారు. అయితే, సీఎఫ్ఎస్ఎల్ అధికారుల సమాధానంపై సాయకసేన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గుమ్నామీ బాబా.. నేతాజీ కాదని పేర్కొన్న జస్టిస్ విష్ణు సహాయి కమిషన్ నివేదికను సమాధానంతోపాటు ప్రత్యుత్తరంలో పంపడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. బాబాపై సీఎఫ్ఎస్ఎల్ చేసిన పరీక్షలను డీఎన్ఏ నిపుణులు మరోసారి పరీక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆగస్టు 18, 1945లో తైవాన్‌లో జరిగిన ఓ విమాన ప్రమాదంలో బోస్ అమరుడయ్యాడని ప్రభుత్వం చెబుతుండగా.. బ్రిటిషర్ల నుంచి తప్పించుకున్న బోస్.. గుమ్నామీ బాబాగా ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్‌లో కొంతకాలం గడిపారని, సెప్టెంబర్ 16, 1985లో ఆయన మరణించారని కొందరు నమ్ముతున్నారు.


గుమ్నానీ బాబా.. సుభాష్ చంద్రబోస్

# గ్రెటాకు అరుదైన గౌరవం

నత్తల్లో కొత్త జాతికి పర్యావరణ ఉద్యమకారిణి పేరు



**లండన్, ఫిబ్రవరి 21:** యువ పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్‌కు అరుదైన గౌరవం లభించింది. నత్తల్లో కొత్త జాతికి ఆమె పేరు పెడుతూ నెదర్లాండ్స్ శాస్త్రవేత్తలు నిర్ణయం తీసుకున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషిచేస్తున్న గ్రెటా థన్‌బర్గ్ పేరు కలిసి వచ్చేలా వీటికి 'క్రాస్పిడోట్రోపిస్ గ్రెటాథన్‌బర్గ్' అని పేరు పెట్టినట్టు వాళ్లు పేర్కొన్నారు. మారుతున్న ఉష్ణోగ్రతలకు ఈ జాతికి చెందిన జీవులు త్వరగా ప్రభావితం అవుతాయని.. కరువు కాటకాలు, ఉష్ణోగ్రతల్లో తీవ్రత, అడవుల క్షీణత వంటి విపత్కర పరిణామాలకు త్వరగా లోనవుతాయని, ఇవి నత్తల్లో 'క్యానోగ్యాస్ట్రోపోడ్స్' వర్గానికి చెందిన కొత్త జాతి జీవులని తెలిపారు. ఈ వివరాలు 'బయోడైవర్సిటీ డాటా' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ నత్త జాతిని బ్రూనై లోని కువాలా పరిశోధన కేంద్రానికి అతి సమీపంలో కనుగొన్నట్టు మెన్నో షిల్తుయిజెన్ అనే శాస్త్రవేత్త పేర్కొన్నారు. పర్వత వాలు ప్రాంతాల్లో, నదీ తీరాల్లో, రాత్రి వేళల్లో ఆకుపచ్చని మొక్కల కింది భాగాల్లో ఈ జీవులు సంచరిస్తాయని ఆయన తెలిపారు. కొత్తరకం జాతికి తన పేరు పెట్టడంపై థన్‌బర్గ్ హర్షం వ్యక్తం చేశారని, పర్యావరణ పరిరక్షణ కోసం ఆమె జరుపుతున్న పోరాటంలో అందరూ భాగస్థులు కావాలని మరో శాస్త్రవేత్త జేపీ లిమ్ తెలిపారు.



# ఆర్నెళ్లలో రామమందిర నిర్మాణం ప్రారంభం

శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అధ్యక్షుడు గోపాల్ దాస్ వెల్లడి

**గ్వాలియర్:** అయోధ్యలో రామమందిర నిర్మాణం మరో ఆర్నెళ్లలో ప్రారంభమవుతుందని శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అధ్యక్షుడు మహంత్ నృత్యగోపాల్ దాస్ తెలిపారు. ట్రస్ట్ తదుపరి సమావేశంలో నిర్మాణ తేదీని ఖరారు చేస్తామని చెప్పారు. ఇంతకుముందు ప్రదర్శించిన నమూనా తరహాలోనే మందిర నిర్మాణం జరుగుతుందని, కొద్దిగా మార్పులు ఉండొచ్చన్నారు. విరాళాల ద్వారా కానీ, ప్రభుత్వ నిధులతో కానీ ఆలయాన్ని నిర్మించబోమని, ప్రజల సహకారంతోనే మందిర నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి అఖారాల అధిపతులు త్వరలోనే సమావేశం అవుతారన్నారు. ట్రస్ట్‌లో చోటు కల్పించకపోవడంపై కొందరు సాధువులు అసంతృప్తి వ్యక్తం చేశారన్న వార్తలను ఆయన ఖండించారు. సామరస్యతకు భంగం కలుగకుండా మందిర నిర్మాణాన్ని చేపట్టాలని మోదీ సూచించినట్టు చెప్పారు.

# 'ఫిజికల్ టెస్ట్' పేరుతో నగ్నంగా నిలబెట్టారు!

సూరత్ మున్సిపాలిటీలో పది మంది మహిళా క్లర్క్‌లకు చేదు అనుభవం

**సూరత్:** గుజరాత్‌లోని భుజ్‌లో ఓ హాస్టల్‌లో రుతుస్రావంలో ఉన్న యువతులను గుర్తించేందుకు లో దుస్తులు విప్పించిన ఘటన మరువక ముందే, అదే రాష్ట్రంలోని సూరత్‌లో మరో అమానవీయ ఘటన చోటుచేసుకున్నది. సూరత్ మున్సిపల్ కార్పొరేషన్‌లో శిక్షణలో ఉన్న పది మంది మహిళా క్లర్క్‌లను శారీరక దృఢత్వ పరీక్ష(ఫిజికల్ టెస్ట్) కోసం ఒకే గదిలో నగ్నంగా నిలబెట్టి పరీక్షించడం వివాదాస్పదమైంది. క్లర్క్‌గా శాశ్వత నియామకానికి ముందు మూడేండ్ల శిక్షణ పొందాలి. తర్వాత తప్పనిసరిగా హాజరవ్వాల్సిన ఈ పరీక్ష కోసం గురువారం పదిమంది క్లర్క్‌లు సూరత్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూరత్ మున్సిపల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ దవాఖానకు వెళ్లారు. అక్కడ ఒక్కొక్కరినీ విడివిడిగా పరీక్షించాల్సి ఉండగా, పది మందిని ఒకేసారి గదిలోకి పిలిచిన మహిళావైద్యులు దుస్తులు విప్పించి పరీక్షించారు. పెండ్లికాని మహిళలకు సైతం గర్భనిర్ధారణ పరీక్షలు చేశారని బాధితులు ఆరోపించారు. ఈ ఘటనపై విచారణకు కమిటీని నియమించినట్టు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

# పురుషుల కుటుంబ నియంత్రణ ఉత్తర్వుపై వివాదం

**భోపాల్:** పురుషుల కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు సంబంధించి మధ్యప్రదేశ్‌లోని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) జారీ చేసిన ఉత్తర్వుపై వివాదం చెలరేగింది. మార్చి 31 నాటికి కనీసం ఒక పురుషుడినైనా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు ఒప్పించని ఎంపీహెచ్‌డబ్ల్యూ పురుష సిబ్బంది వేతనాలను నిలిపివేయాలని, ఉద్యోగం నుంచి తొలిగించాలని సూచిస్తూ ఫిబ్రవరి 10న ఉత్తర్వు జారీ అయ్యింది. దీనిపై ఆరోగ్య సిబ్బంది ఆందోళన వ్యక్తం చేయగా.. ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేసింది.

# త్వరలో విమాన సిబ్బందికి డ్రగ్స్ పరీక్షలు

**న్యూఢిల్లీ:** డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ మాదిరిగా విమాన సిబ్బందికి డ్రగ్స్ సంబంధ పరీక్షలు నిర్వహించాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నిర్ణయించింది. నిబంధనలను త్వరలో ఖరారు చేయనున్నట్లు శుక్రవారం తెలిపింది. పైలట్లు, ఎయిర్ హోస్టులు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్(ఏటీసీ)కు తొలిదశలో ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ విమానాశ్రయాల్లో లేదా ఏటీసీ కాంప్లెక్స్‌లలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. మూత్ర నమూనాల్లో మత్తుపదార్థాల ఆనవాళ్లను పరీక్షిస్తారు. ఇందులో పాజిటివ్ అని తేలినవారికి ల్యాబొరేటరీల్లో నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. అక్కడ కూడా పాజిటివ్‌గా వస్తే పునరావాస కేంద్రాలకు పంపుతారు. కోలుకున్న తర్వాత మళ్లీ పరీక్షలు నిర్వహించి, వైద్యుల నుంచి ధ్రువీకరణ పత్రం పొందిన తర్వాతే క్రియాశీలక విధుల్లోకి తీసుకుంటారు. ఆ తర్వాత మళ్లీ డ్రగ్స్ తీసుకొని పట్టుబడితే లైసెన్స్‌ను రద్దు చేస్తారు.

# పక్కా బిజినెస్


కొలరాడోలో ప్రసంగిస్తున్న ట్రంప్

- పూర్తిగా వాణిజ్య కోణంలోనే భారత పర్యటన
- అమెరికా ఉత్పత్తులపై అత్యధిక సుంకం విధిస్తున్నారు
- దీనిపై మోదీతోనే తేల్చుకుంటా
- ఆ దేశంతో అద్భుతమైన ఒప్పందం జరుగొచ్చు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల భారత పర్యటన పూర్తిగా వాణిజ్య కోణంలోనే జరుగనున్నది. సోమవారం నుంచి మొదలుకానున్న తన భారత పర్యటన సందర్భంగా మోదీతో ప్రధానంగా ద్వైపాక్షిక వాణిజ్య అంశాలపైనే చర్చిస్తానని, అమెరికా ఉత్పత్తులను ప్రచారం చేస్తానని ట్రంప్ స్పష్టం చేశారు. భారత్‌తో అద్భుతమైన వాణిజ్య ఒప్పందం జరుగొచ్చన్నారు. భారత్ కొన్నేండ్లుగా అమెరికా ఉత్పత్తులపై అత్యధిక దిగుమతి సుంకం మోపుతూ తీవ్రంగా దెబ్బకొడుతున్నదని, ఈ విషయమై నేరుగా మోదీతోనే తేల్చుకుంటానని చెప్పారు. కోటి మందితో స్వాగతం పలుకుతానని మోదీ తనతో అన్నారని, ఈ పర్యటన తర్వాత తన మనసు కలుషితం కావడం ఖాయమని వ్యాఖ్యానించారు. గురువారం అమెరికాలోని కొలరాడోలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ట్రంప్ పాల్గొని మాట్లాడారు. తనకు భారత ప్రధాని మోదీ అంటే ఎంతో ఇష్టమని చెప్పారు. 'వాణిజ్య పరంగా మేమిద్దరం కొన్ని అంశాలపై చర్చించాల్సి ఉన్నది. అమెరికా ఉత్పత్తులపై ప్రపంచంలోనే అత్యధిక పన్నులు మోపే దేశాల్లో భారత్ ఒకటి. ఇది మనల్ని తీవ్రంగా దెబ్బకొడుతున్నది' అని పేర్కొన్నారు. ట్రంప్ పర్యటన సందర్భంగా భారీ వాణిజ్య ఒప్పందం జరుగుతుందన్న వార్తలపై స్పందిస్తూ.. 'రెండు దేశాల మధ్య అద్భుతమైన ఒప్పందం కుదిరే అవకాశం ఉన్నది. అయితే డీల్ సంతృప్తికరంగా లేకుంటే చర్చలు సత్ఫలితాలను ఇవ్వకపోవచ్చు' అని చెప్పారు. 'చర్చల నుంచి నేను వెనక్కి తగ్గొచ్చు. లేదా ఎన్నికల తర్వాత ఒప్పందం జరుగొచ్చు. చూద్దాం.. ఏమి జరుగుతుందో' అని వ్యాఖ్యానించారు. అమెరికాను అన్నింటా ప్రథమ స్థానంలో నిలిపే క్రమంలో తాను మంచి ఒప్పందాలను మాత్రమే స్వాగతిస్తానని స్పష్టంచేశారు.

## కోటిమంది స్వాగతం పలుకుతారట!

భారత్‌లో తనకు ఘన స్వాగతం లభిస్తుందని ట్రంప్ మరోసారి ఆశాభావం వ్యక్తం చేశారు. మోతేరా స్టేడియం అందమైన, అధునాతనమైన, ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ మైదానమని కితాబిచ్చారు. 'నమస్తే ట్రంప్ ర్యాలీ నా మనసును కలుషితం చేస్తున్నది. నాకు కనీసం కోటి మంది స్వాగతం చెప్తారని ప్రధాని మోదీ చెప్తున్నారు. ఇక్కడే నాకు సమస్య ఎదురవుతున్నది. ప్రస్తుత మన ప్రసంగ వేదిక చాలా చిన్నది. వేలమంది ఇంకా బయటే ఉన్నారు. భారత్‌లో కోటి మంది మధ్య పర్యటించి వచ్చిన తర్వాత.. మన దగ్గర 60వేల మందితో జరిగే సభలో పాల్గొంటే ఎలా సంతృప్తి చెందుతాను. మోతేరాకన్నా పెద్ద స్టేడియం నిర్మించాలన్న కోరిక పుడుతుంది' అని పేర్కొన్నారు.తన పర్యటన అనేకరంగాల్లో అమెరికాకు మేలుచేస్తుందన్నారు.

**బలంగా ద్వైపాక్షిక సంబంధాలు**

అమెరికా-భారత్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు బలంగా ఉన్నాయి. రెండు దేశాల మధ్య వాణిజ్యం విలువ.. ప్రపంచ వాణిజ్యంలో మూడు శాతంగా ఉన్నది. ట్రంప్ పర్యటన నేపథ్యంలో భారత వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్, అమెరికా వాణిజ్య విభాగం ప్రతినిధి రాబర్ట్ లైటైజర్ మధ్య కొన్ని వారాలుగా టెలిఫోన్ చర్చలు జరుగుతున్నాయి. ఇరు దేశాల మధ్య కుదురాల్సిన ఒప్పందాలపై కసరత్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా స్టీల్, అల్యూమినియంపై విధించిన భారీ సుంకాలను తగ్గించాలని భారత్ డిమాండ్ చేస్తున్నది. దీంతోపాటు కొన్ని దేశీయ ఉత్పత్తులకు జీఎస్పీ కింద పన్ను ప్రోత్సాహకాలు పునః ప్రారంభించాలని, వ్యవసాయం, ఆటోమొబైల్, ఇంజినీరింగ్ తదితర రంగాల్లో భారత ఉత్పత్తులకు విస్తృత అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు. మరోవైపు అమెరికా తన వ్యవసాయ రంగ, డెయిరీ ఉత్పత్తులు, వైద్య పరికరాలను భారత మార్కెట్‌లో ప్రోత్సహించాలని డిమాండ్ చేస్తున్నది. సమాచార సాంకేతిక పరికరాలపై విధించిన పన్నులను తగ్గించాలని కోరుతున్నది. భారత్-అమెరికా మధ్య 2018-19లో రూ.1.21 లక్షల కోట్ల (16.9 బిలియన్ డాలర్లు) వాణిజ్య లోటు ఉన్నదని దీనిని పూడ్చాలని అగ్రరాజ్యం కోరుతున్నది.

**భారత్‌కు అతిపెద్ద మార్కెట్**

కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ (సీఆర్ఎస్) ఇటీవల ఇచ్చిన నివేదిక ప్రకారం భారత్‌కు అమెరికా అతిపెద్ద విదేశీ మార్కెట్‌గా ఉన్నది. 2018లో భారత్ ఎగుమతుల్లో 16 శాతం అమెరికాకే వెళ్లాయి. యురోపియన్ యూనియన్ (17.8 శాతం) తర్వాతి స్థానం అగ్రరాజ్యానిదే. ఇక భారత్ దిగుమతుల్లో చైనా (14.6 శాతం), ఈయూ (10.2 శాతం) తర్వాత అమెరికా (6.3 శాతం) మూడో స్థానంలో నిలిచింది. అమెరికాకు సంబంధించి భారత్ ఎనిమిదో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నది.



## కూతురు, అల్లుడు కూడా వస్తున్నారు!

భారత పర్యటన కోసం ట్రంప్ దంపతులతోపాటు వారి కూతురు ఇవాంకా ట్రంప్, అల్లుడు జారెడ్ కుష్నర్ కూడా వస్తున్నారని అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ట్రంప్, ఆయన భార్య మెలానియాతో పాటు ఆర్థిక శాఖ మంత్రి స్టీవెన్ మ్యూనిచ్, వాణిజ్యశాఖమంత్రి విల్బర్ రోస్, జాతీయ భద్రతా సలహాదారు డెరెక్ ఓ'బ్రెయిన్, ఇంధనశాఖ మంత్రి డాన్ బ్రౌలిట్టే వంటి అత్యున్నత స్థాయి అధికారుల బృందం వస్తున్నారని మాత్రమే అమెరికా ప్రభుత్వం సమాచారం ఇచ్చింది. అయితే ఇవాంక దంపతులు కూడా వస్తారని అమెరికా ప్రభుత్వంధ్రువీకరించినట్టు తెలిసింది.

**ఆతిథ్యం మాత్రమే.. ప్రారంభోత్సవం కాదు**

అహ్మదాబాద్‌లో నిర్మించిన మోతేరా స్టేడియం ఈ నెల 24న 'నమస్తే ట్రంప్' సభకు కేవలం ఆతిథ్యం ఇస్తున్నదని, ఇది స్టేడియం ప్రారంభోత్సవం కాదని గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ (జీసీఏ) గురువారం స్పష్టం చేసింది. మోదీ, ట్రంప్ సాక్షిగా ఈ స్టేడియంలో జరుగనున్న సభకు లక్ష మందికిపైగా ప్రజలు హాజరవుతారని అంచనా. బహిరంగ సభతోపాటు స్టేడియం ప్రారంభోత్సవం జరుగుతుందని అధికారులు, పోలీస్ యంత్రాంగం ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జీసీఏ ఉపాధ్యక్షుడు ధన్‌రాజ్ నెత్వానీ గురువారం స్పష్టతనిచ్చారు. 'సమస్తే ట్రంప్ సభకు కేవలం ఆతిథ్యం ఇస్తున్నాం. స్టేడియంను తర్వాత ప్రారంభిస్తాం' అని మీడియాకు చెప్పారు. మరోవైపు ట్రంప్ అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమాన్ని సందర్శిస్తారన్న వార్తలపై గుజరాత్ సీఎం విజయ్ రూపానీ స్పందించారు. దానిపై అమెరికా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు.


ట్రంప్ రాక నేపథ్యంలో అహ్మదాబాద్‌లో ఓ గోడపై గీసిన చిత్రం

# అమూల్యపై దేశద్రోహం కేసు

- 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ
- నా కూతురుది క్షమించరాని తప్పు: అమూల్య తండ్రి
- ఆమెకు నక్సలైట్లతో సంబంధాలున్నాయి: యెడియూరప్ప
- అమూల్య నినాదాలపై స్నేహితురాళ్ల మరో వాదన


అమూల్య

**బెంగళూరు, ఫిబ్రవరి 21:** పౌరసత్వ సవరణ చట్టానికి(సీఏఏ) వ్యతిరేకంగా గురువారం బెంగళూరులో నిర్వహించిన ఓ సభలో పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేసిన అమూల్య లియోనాపై పోలీసులు దేశద్రోహం కేసు నమోదు చేశారు. ఆమెకు 14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసినట్టు శుక్రవారం పోలీసులు తెలిపారు. 'రాజ్యాంగాన్ని కాపాడుదాం' పేరిట గురువారం బెంగళూరులో సీఏఏను వ్యతిరేకిస్తూ నిర్వహించిన సభలో అమూల్య అనే యువతి 'పాకిస్థాన్ జిందాబాద్' అంటూ మూడుసార్లు నినాదాలు చేయడం కలకలం రేపింది. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ సభలో ఉండగానే ఈ పరిణామం చోటుచేసుకున్నది. దీంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఆమెపై దేశద్రోహం కేసు నమోదు చేసిన పోలీసులు.. అరెస్టు చేసి మెజిస్ట్రేట్ న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టారు. దీంతో కోర్టు ఆమెకు 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ ఆదేశాలు జారీ చేసిందని పోలీసులు తెలిపారు. మరోవైపు, పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేసిన అమూల్యను లక్ష్యంగా చేసుకుంటూ చిక్కమంగళూరులోని ఆమె నివాసంపై గురువారం సాయంత్రం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడులకు పాల్పడ్డారని, దీంతో ఇంట్లోని కిటికీల అద్దాలు పగిలిపోయాయని.. ఈ క్రమంలో అక్కడ భద్రతను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. దాడులకు పాల్పడిన వాళ్లు మితవాద కార్యకర్తలుగా అనుమానిస్తున్నారు. ఇంకోవైపు, అమూల్య వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం నగరవ్యాప్తంగా పలు సంస్థలు నిరసనలు చేపట్టాయి.

**అసలు విషయాలు బయటకు వస్తాయి**

అమూల్య వ్యాఖ్యలను కర్ణాటక సీఎం యెడియూరప్ప ఖండించారు. ఇలాంటి ఘటనలతో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు కొన్ని సంస్థలు కుట్ర పన్నుతున్నాయని ఆయన ఆరోపించారు. మైసూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈ ఘటనపై మరింత లోతుగా ఆరా తీస్తే అసలు విషయాలు బయటకు వస్తాయి. గతంలో ఆమెకు నక్సలైట్లతో సంబంధాలు ఉన్నట్టు స్పష్టమైంది. ఆమె తండ్రి కూడా ఆమెను శిక్షించాలని, బెయిల్ కూడా ఇవ్వొద్దని కోరుతున్నారు' అని తెలిపారు.

## పొరుగుదేశాలన్నింటికీ జిందాబాద్!

ఈనెల 16న అమూల్య ఫేస్‌బుక్‌లో పోస్టు చేసిన వీడియో ఇప్పుడు చర్చనీయాంశం అవుతున్నది. అందులో ఆమె భారత్ పొరుగు దేశాల పేర్లు చెబుతూ జిందాబాద్ అని నినదించడం ఉన్నది. గురువారం జరిగిన సభలో కూడా అమూల్య మిగతా దేశాలకు కూడా జిందాబాద్ చెప్పే లోపునే, ఆమెను అక్కడున్న వాళ్లు అడ్డుకున్నారని ఆమె స్నేహితురాళ్లు కొందరు చెబుతున్నారు.


వాజీ

## నా బిడ్డను శిక్షించండి

'పాకిస్థాన్ జిందాబాద్' అంటూ నినాదాలు చేసి తన కూతురు క్షమించరాని తప్పు చేసిందని అమూల్య తండ్రి వాజీ పేర్కొన్నారు. 'అది క్షమించరాని తప్పు. ఆ మాటలతో తను భారతీయులను గాయపర్చింది. చట్టం ప్రకారం తనపై చర్యలు తీసుకోవాలి. తనకు ఇప్పుడు 19 ఏండ్లు. తనెందుకు అలా అన్నదో, తన వెనుక ఎవరు ఉన్నారో తెలుసుకోవాలి' అని అన్నారు. అమూల్య చురుకైన అమ్మాయి అని, సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా జరిగే నిరసనల్లో పాల్గొనొద్దని, చదువుపై దృష్టిసారించాలని తనకు ఇదివరకే చాలాసార్లు చెప్పానని వాజీ తెలిపారు.

# ట్రంప్‌తో ప్రతిపక్షాల భేటీ లేదు: కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత పర్యటన సందర్భంగా ఆయనతో ప్రతిపక్ష పార్టీల బృందం సమావేశం కావటం లేదని తెలుస్తున్నది. విదేశాలకు చెందిన అధ్యక్షులు, ప్రధానులు భారత పర్యటనకు వచ్చినప్పుడు ప్రతిపక్ష పార్టీల బృందంతో అధికారికంగా భేటీ కావడం ఆనవాయితీ. ఇందుకుగాను ప్రభుత్వం కూడా ప్రతిపక్ష పార్టీలకు షెడ్యూల్‌లో కొంత సమయం కేటాయిస్తుంది. కానీ ట్రంప్‌తో ప్రతిపక్ష పార్టీల భేటీకి ఇప్పటి వరకు ఎలాంటి షెడ్యూల్ ఖరారు కాలేదని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఇలా జరుగడం తొలిసారి అని పేర్కొన్నాయి.

**ట్రంప్‌కు ప్రచార అంశంలా పర్యటన ఉండకూడదు**

ట్రంప్ భారత పర్యటన సందర్భంగా మన దేశానికి మేలు జరిగేలా చర్చలు జరుగాలని కాంగ్రెస్ సూచించింది. 'కొద్ది నెలల్లో జరుగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో భారత పర్యటనను ట్రంప్ తన ప్రచారానికి వాడుకునేలా ఉండకూడదు. భారత్‌కు నిర్మాణాత్మక ఫలితాలు లభించేలా ట్రంప్‌తో చర్చలు జరుగాలి' అని కోరింది.

# ఐటీసీ మౌర్య వద్ద మూడంచెల భద్రత

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోమవారం భారత పర్యటనకు రానున్న నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఢిల్లీలో ఆయన విడిది చేసే ఐటీసీ మౌర్య హోటల్ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటుచేస్తున్నారు. అగ్రరాజ్య మాజీ అధ్యక్షులు జార్జిబుష్, బరాక్ ఒబామా బస చేసిన 'చాణక్య' సూట్‌లోనే ట్రంప్ కూడా దిగనున్నారు. ఎన్ఎస్‌జీ కమాండోలు, ఢిల్లీ పోలీసులు గత వారం రోజులుగా ఈ హోటల్ వద్ద అణువణువూ తనిఖీ చేస్తున్నారు. ట్రంప్ పరివారం రాక నేపథ్యంలో హోటల్‌లోని మొత్తం 438 గదులను బుక్ చేశారు. ఇటీవల అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమైన నేపథ్యంలో మరింత జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

# అది కూడా ఉగ్రవాదమే!

సాధారణ జీవితానికి విఘాతం కల్పించడమూ నేరమే

షాహీన్‌బాగ్ నిరసనలపై కేరళ గవర్నర్ ఆరిఫ్ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** తమ అభిప్రాయాలను ఇతరులపై బలవంతంగా రుద్దాలనుకోవడం, సాధారణ జీవితానికి విఘాతం కల్పించడమూ ఉగ్రవాదమేనని కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ అన్నారు. ఢిల్లీలోని షాహీన్‌బాగ్‌లో సీఏఏకు వ్యతిరేకంగా రెండు నెలలకుపైగా కొనసాగుతున్న నిరసనలనుద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ రాజధానిలో శుక్రవారం జరిగిన భారతీయ విద్యార్థి సదస్సులో పాల్గొన్న ఆరిఫ్ పలు అంశాలపై మాట్లాడారు. నిరసనల నేపథ్యంలో ప్రజలు ఇప్పుడు రాజ్యాంగంలోని ప్రవేశికను చదువుతున్నారని, దీనికి తాను చాలా సంతోషిస్తున్నానని చెప్పారు. ఆలోచన, భావ ప్రకటన, నమ్మకం, విశ్వాసం, ఆరాధన స్వేచ్ఛను ఈ ప్రవేశిక తెలియజేస్తుందన్నారు. అయితే భావ స్వేచ్ఛ పేరుతో మీ ఆలోచనలను ఇతరులపై బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నించడం తగదన్నారు. ప్రతి ఒక్కరికి హక్కులు ఉంటాయని, అంతమాత్రాన ఇతరుల సాధారణ జీవితానికి విఘాతం కల్పించకూడదన్నారు. మీ హక్కుల గురించి మాట్లాడే ముందు మీ విధులను కూడా నిర్వర్తించాలని, ఇతరుల హక్కులనూ గౌరవించాలని ఆరిఫ్ సూచించారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్ముకశ్మీర్ నుంచి ఉగ్రవాదం పూర్తిగా అంతమవుతుందని, ఇందులో ఎలాంటి సందేహం లేదని ఆరిఫ్ అన్నారు.

# 100 కోట్ల మంది కన్నా.. 15 కోట్ల ముస్లింల బలమే ఎక్కువ

ఎంఐఎం నేత పఠాన్ వివాదాస్పద వ్యాఖ్యలు.. ఖండించిన పార్టీ



**ఔరంగాబాద్, ఫిబ్రవరి 21:** వంద కోట్ల మంది కన్నా 15 కోట్ల ముస్లింల బలమే ఎక్కువంటూ మహారాష్ట్రకు చెందిన ఎంఐఎం నేత వరీస్ పఠాన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఇటీవల కర్ణాటకలోని కలబురగి ప్రాంతంలో నిర్వహించిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వ్యతిరేక సభలో వరీస్ పఠాన్ మాట్లాడుతూ 'మనమంతా కలిసి నడవాలి. మనమంతా స్వాతంత్ర్యాన్ని సంపాదించాలి. ఈ స్వాతంత్ర్యాన్ని మనం అడిగి తీసుకోవడం కాదు.. బలవంతంగా గుంజుకోవాలి. గుర్తుపెట్టుకోండి.. మనం 15 కోట్ల మందే ఉండొచ్చు.. కానీ 100 కోట్ల మంది కన్నా మన బలం ఎక్కువ.. మరిచిపోకండి' అని తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమవడంతో స్పందించిన ఎంఐఎం మహారాష్ట్ర అధ్యక్షుడు, ఔరంగాబాద్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ ఇలాంటి వ్యాఖ్యలను సహించేది లేదని చెప్పారు. వివరణ ఇవ్వాలంటూ నోటీసు జారీ చేయనున్నామన్నారు. మరోవైపు పఠాన్ వ్యాఖ్యలపై బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర స్పందిస్తూ వాళ్లు (ఎంఐఎం నేతలు) చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుంటారని, కానీ వారి గుండెల్లో మాత్రం పఠాన్‌లాంటి వాళ్లు ఉంటారని విమర్శించారు. ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయడానికి, దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడానికి సీఏఏ వ్యతిరేక ఆందోళనల పేరుతో భారీ కుట్ర జరుగుతున్నట్లు పఠాన్ వ్యాఖ్యలను బట్టి అర్థమవుతున్నదని ఆరోపించారు. సీఏఏను వ్యతిరేకిస్తున్న వాళ్లు పఠాన్ వ్యాఖ్యలపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

# వాళ్లను అప్పుడే పాక్‌కు పంపించాల్సింది!

ముస్లింలపై కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు



**పాట్నా:** దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడే ముస్లిందర్నీ పాకిస్థాన్‌కి పంపించి ఉండాల్సింది.. అలా చేయకపోవడంతోనే ప్రస్తుతం మనం మూల్యం చెల్లించుకుంటున్నామని కేంద్రమంత్రి, బీజేపీ నేత గిరిరాజ్ సింగ్ మరోమారు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పౌరసత్వ సవరణ చట్టానికి(సీఏఏ) వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న సమయంలో గిరిరాజ్ వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. బీహార్‌లోని పూర్నియా జిల్లాలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'స్వాతంత్ర్యం కోసం మన పూర్వీకులు బ్రిటిషర్లతో పోరాడుతున్న సమయంలో ప్రత్యేక ముస్లిం దేశం కావాలంటూ జిన్నా ఒత్తిడి తెచ్చాడు. దానికి మన వాళ్లు ఒప్పుకున్నారు. అప్పుడే గనుక ముస్లిందరినీ పాకిస్థాన్‌కు పంపించి, అక్కడి హిందువులను ఇక్కడికి తీసుకొస్తే ఇప్పుడు ఈ(సీఏఏ తీసుకురావడం) ఇబ్బందులు ఎదుర్కొనే వారమే కాదు. ఇప్పుడు మూల్యం చెల్లిస్తున్నాం' అని గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యానించారు. కాగా, గిరిరాజ్ వ్యాఖ్యలను బీజేపీ మిత్రపక్షం లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ ఖండించారు. తమ పార్టీ నేత గనుక ఇలాంటి వ్యాఖ్యలు చేసినట్లైతే చర్యలు తీసుకునే వాడినన్నారు.

# 'కశ్మీర్ ముక్తి', 'దళిత్ ముక్తి'..

బెంగళూరులో ప్లకార్డు కలకలం


ఆరుద్ర

**బెంగళూరు:** పౌరసత్వ సవరణ చట్టానికి(సీఏఏ) వ్యతిరేకంగా బెంగళూరులో గురువారం నిర్వహించిన ఓ సభలో 'పాకిస్థాన్ జిందాబాద్' అని నినాదాలు చేసిన అమూల్య లియోనా ఘటనను మరువకముందే తాజాగా అదే నగరంలో మరో ఘటన చోటుచేసుకున్నది. 'కశ్మీర్ ముక్తి', 'దళిత్ ముక్తి', 'ముస్లిం ముక్తి' అంటూ కశ్మీరీలు, దళితులు, ముస్లింలకు విముక్తి కావాలనే అర్థంలో శుక్రవారం ఒక యువతి ప్లకార్డులు ప్రదర్శించింది. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేశారు. 'పాకిస్థాన్ జిందాబాద్' అని నినాదాలు చేసిన అమూల్య లియోనా వైఖరిని నిరసిస్తూ బెంగళూరులో శుక్రవారం హిందూ జాగరణ్ వేదిక ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆరుద్ర అనే యువతి.. కార్యక్రమం జరుగుతుండగా 'కశ్మీర్‌ముక్తి', 'దళిత్ ముక్తి', 'ముస్లిం ముక్తి' అంటూ ఇంగ్లిష్, కన్నడ అక్షరాలతో రాసిన ప్లకార్డులు ప్రదర్శించడం కలకలం రేపింది. 'వివిధ వర్గాల ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా ప్రవర్తించిన ఆరుద్రపై కేసు నమోదు చేశాం' అని పోలీసులు తెలిపారు.


బెంగళూరులో హిందూ జన జాగరణ సమితి ఆందోళన

# సీఏఏపై భయం అక్కర్లేదు

ఎన్పీఆర్‌తో ఎవరినీ దేశం నుంచి వెళ్లగొట్టరు

ప్రధానితో భేటీ అనంతరం ఉద్ధవ్ ఠాక్రే వ్యాఖ్యలు


మోదీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్ధవ్ ఠాక్రే, ఆదిత్య ఠాక్రే

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై ఏ ఒక్కరూ భయపడాల్సిన అవసరం లేదని శివసేన అధినేత, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే వ్యాఖ్యానించారు. జాతీయ జనాభా పట్టిక(ఎన్పీఆర్) ద్వారా ఎవరినీ దేశం నుంచి పంపివేయరని చెప్పారు. శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉద్ధవ్ ఠాక్రే ప్రధానిని కలువడం ఇదే తొలిసారి. ఎన్డీయేలో మాజీ భాగస్వామ్యపక్షమైన శివసేన.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీతో విడిపోయి.. కాంగ్రెస్, ఎన్సీపీతో కలిసి మహాకూటమి పేరుతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. 'మహారాష్ట్రకు సంబంధించిన అంశాలపై ప్రధాని మోదీతో చర్చించాను. అలాగే సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌పైనా చర్చలు జరిగాయి. ఎన్పీఆర్ ద్వారా దేశం నుంచి ఏ ఒక్కరినీ వెళ్లగొట్టరు' అని ఉద్ధవ్ పేర్కొన్నారు. మహ కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, తమ ప్రభుత్వం ఐదేండ్లపాటు కొనసాగుతుందని చెప్పారు. సీఏఏ, ఎన్పీఆర్ విషయంలో ఉద్ధవ్ వైఖరిపై కాంగ్రెస్, ఎన్సీపీ ఆగ్రహంతో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. కాగా, మహారాష్ట్ర సర్కారుకు అన్నివిధాలా సహకరిస్తామని ప్రధాని హామీ ఇచ్చారని ఉద్ధవ్ తెలిపారు.



ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ దేశంలో సామ్యవాదం అవసరం లేదంటున్నారు. దీనర్థం అతను రాజ్యాంగ సారాంశానికి వ్యతిరేకం. అతను పేదలను పట్టించుకోకుండా, పెద్ద పెట్టుబడిదారుల కోసం పనిచేస్తున్నాడు. కొంతమంది ప్రత్యేక వ్యక్తుల కోసం పనిచేస్తున్నాడు కానీ సమాజం కోసం కాదు. సామాజిక సమానత్వానికి, నిర్లక్ష్యానికి గురైన వర్గాలకు వ్యతిరేకంగా ఆదిత్యనాథ్ అడుగులున్నాయి.

**అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత**

మహారాష్ట్రలో మూడుపార్టీల సంకీర్ణ ప్రభుత్వం ఉన్నది. సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలపై కాంగ్రెస్ పార్టీ వైఖరి స్పష్టంగా ఉన్నది. ఇవి దేశ ప్రయోజనాల కోసం కాదు. అయితే సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలపై శివసేన వైఖరి ఇంకా స్పష్టత లేనిదిగా ఉన్నది.

**అశోక్ చవాన్, కాంగ్రెస్ సీనియర్ నేత**



**చరిత్రలో నేడు**



1894

భారత వ్యాపారుల పట్ల వివక్షపై పోరాడటానికి నాటల్ ఇండియన్ కాంగ్రెస్ (ఎన్ఐసీ)ను ఏర్పాటుచేసిన మహాత్మాగాంధీ.

1932



ప్రయోగాత్మక నిరంతర టీవీ ప్రసారాలను ప్రారంభించిన బీబీసీ.



1944

ప్యారిస్‌ను నాశనం చేయాలని ఆదేశించిన అడాల్ఫ్ హిట్లర్.

డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటనలో ద్వైపాక్షిక, వాణిజ్య ఒప్పందాలకు పెద్దపీట వేస్తారని చెబుతున్నా, ఒప్పందాల విషయంలో స్పష్టమైన విధాన ప్రకటనలేవీ వెలువడకపోవటం గమనార్హం. దేశంలో ట్రంప్‌నకు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇరుదేశాల మధ్య వాణిజ్య, రక్షణ సహకార ఒప్పందాలు ఉంటాయిని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. ఏదేమైనా వ్యాపార వాణిజ్య ఒప్పందాలు ఇరుదేశాలకు లబ్ధి చేకూరే ఒప్పందాలు కుదిరితేనే పర్యటనకు సఫలత చేకూరుతుంది.

**ది హిందూ**

కాంగ్రెస్‌కు జవసత్వాలు నింపేందుకు కాంగ్రెస్ అగ్రనాయకత్వం కార్యాచరణకు పూనుకోవాలని శశిథరూర్, సందీప్ దీక్షిత్ లాంటి నేతలు కోరుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరపరాజయం తర్వాత రాహుల్‌గాంధీ రాజీనామాతో కాంగ్రెస్‌లో నాయకత్వ శూన్యత ఏర్పడింది. సోనియాగాంధీ తాత్కాలికంగా నాయకత్వ బాధ్యతలు స్వీకరించినా బీజేపీ విస్తరణను, దూకుడును నిలువరించలేకపోతున్నారు. నాయకత్వ స్థానానికి ఎన్నికలు జరిపి నాయకత్వ లేమిని పూరించాల్సిన సమయం ఆసన్నమైనదన్న దాంట్లో వాస్తవం ఉన్నది.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**



# ట్రంప్ పర్యటన

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పర్యటనకు భారత్ ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేస్తున్నది. ఈ నెల 24, 25 తేదీల్లో దేశంలో ట్రంప్ రెండురోజుల పర్యటించనున్నారు. తొలిరోజు గుజరాత్‌లోని అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి ఇటీవలనే నిర్మించిన ప్రపంచంలోనే అతిపెద్ద మోతెరా స్టేడియం దాకా 22 కి.మీ. రోడ్‌షో నిర్వహిస్తారు. ఈ షోలో దారిపొడవునా అందంగా భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేరీతిలో తీర్చిదిద్దిన వేదికలపై సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చేందుకు దేశం నలుమూలల నుంచీ కళాకారులను రప్పిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ప్రజలతో స్వాగతం పలికేందుకు సన్నాహాలు కొనసాగుతున్నాయి. 'నమస్తే ట్రంప్' పేరుతో మోతెరా స్టేడియంలో నిర్వహిస్తున్న స్వాగతసభలో మోదీ, ట్రంప్ ప్రసంగిస్తారు. ఇది అమెరికా పర్యటనలో మోదీకి ఏర్పాటుచేసిన 'హౌడీ మోదీ' సభకు ధీటుగా జరిపేందుకు అటు కేంద్రం, ఇటు గుజరాత్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నాయి. రెండో రోజు తాజ్‌మహల్‌ను ట్రంప్ సందర్శిస్తారు. దీనికిగాను ఆగ్రా ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మరోవైపు ఈ పర్యటన నేపథ్యంలో భారత ప్రభుత్వం చేపడుతున్న చర్యలు వివాదాస్పదమవుతున్నాయి. గుజరాత్‌లో సబర్మతీ నదీతీరం వెంబడి ఉన్న మురికివాడలు ట్రంప్‌కు కనిపించకుండా అడ్డుగోడలు కట్టడం, ఇదేరీతిలో ఢిల్లీలోనూ యమునా తీర ప్రాంతంలో యాచకులు కనిపించకుండా దూరప్రాంతాలకు తరలించటం విమర్శలకు తావిస్తున్నది.

ట్రంప్ పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య కుదిరే దౌత్య, వాణిజ్యపరమైన ఒప్పందాల విషయంలో స్పష్టత లేకున్నా పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. అగ్రరాజ్యాధినేతగా ట్రంప్, అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమైన భారత పర్యటనను కేవలం స్నేహపూర్వక సౌహార్ద్ర సందర్శనగా ఎవరూ పరిగణించకపోవటమే దీనికి కారణం. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్‌కు భారత్ పర్యటన మొదటిదే అయినా, ఈ 8 నెలల కాలంలో వివిధ సందర్భాల్లో ట్రంప్‌తో మోదీ ఐదు సార్లు భేటీ అయ్యారు. గతేడాది అమెరికా పర్యటన సందర్భంలో కూడా మోదీ పర్యటన నుంచి అమెరికాలోని ప్రవాస భారతీయులు ఎంతో ఆశించారు. ఆ క్రమంలో జరిగిన ప్రచార ఆర్భాటం అంతా ఇంతా కాదు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక ఆయన వలసలు, హెచ్1బీ వీసాల విషయంలో అనుసరించిన కఠిన విధానాలతో భారత సంతతి విద్యార్థులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సరిగ్గా ఆ సందర్భంలోనే మోదీ అమెరికాలో పర్యటించారు. భారతీయుల భయాలు దూరం చేసే దిశలో విధాన నిర్ణయాలు ట్రంప్ నుంచి వెలువడుతాయని ఆశించారు. కానీ అలాంటిదేమీ లేకుండానే మోదీ ప్రచార పటాటోపంతోనే ముగిసింది. ప్రస్తుత ట్రంప్ భారత్ పర్యటన ప్రచారానికే పరిమితమైనదని అనుకోవటానికి లేదు. గత కొన్నేండ్లుగా అమెరికా భారత్ నుంచి విస్తృత స్థాయి స్వేచ్ఛా వాణిజ్యానికి తహతహలాడుతున్నది. ఇందులో వ్యవసాయరంగ ఎగుమతులు, డెయిరీ తదితర రంగాల్లో స్వేచ్ఛా వాణిజ్యానికి, ఎగుమతులకు అవకాశం ఉండాలని అమెరికా ఆశిస్తున్నది. దీనికి సంబంధించి విస్తృతస్థాయి ఒప్పందాలు ఇప్పటికిప్పుడు కుదరకపోయినా, మౌలికంగా ప్రాథమికస్థాయి ఒప్పందాలతోనైనా తిరిగివెళ్లాలని ట్రంప్ పర్యటనలో ఉన్న ఆలోచనలని అర్థమవుతున్నది.

**అమెరికా కోరుకుంటున్న ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్సెప్) ఒప్పందం సాకారమై ఉంటే భారత్ ఇప్పటికే చాలా నష్టపోయేది. ఈ ఒప్పందం నుంచి ఎన్డీయే ప్రభుత్వం బయటకురావాలని గతేడాది నవంబర్‌లో నిర్ణయించటం ముదావహం. పొరుగుదేశాలు ముఖ్యంగా చైనా ప్రాంతీయంగా అనుసరిస్తున్న ఆధిపత్య విధానాలు, టెర్రరిజానికి అండగా నిలుస్తున్న పాక్ చర్యలకు చెక్ పెట్టాలంటే అమెరికా అండతో వ్యూహాత్మక దౌత్యసంబంధాలను బలోపేతం చేసుకోవాలి.**

అమెరికాతో దౌత్యపరమైన సంబంధాల్లోనే గాక, వాణిజ్య ఒప్పందాల్లో భారత్‌కు కీలక భాగస్వామ్యం ఉన్నది. రక్షణ, సహకార ఒప్పందాల్లో ఇరుదేశాలు భాగస్వాములై ఉన్నాయి. అమెరికా నుంచి భారత్ రక్షణరంగంలో మూడు బిలియన్ డాలర్ల విలువైన కొనుగోళ్లు చేస్తున్నది. అమెరికాలో ట్రంప్ అవలంబిస్తున్న ఆత్మరక్షణ విధానాల నేపథ్యంలో భారత్ వ్యాపారరంగంలో అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నది. టారిఫ్‌ల పెంపు, కొన్నిరకాల అల్యూమినియం లోహ ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలు విధించటంతో భారత్ తీవ్రంగా నష్టపోయింది. ప్రస్తుతం అమెరికా ఆశిస్తున్నట్లు వ్యవసాయం, డెయిరీ రంగాల్లో బహుళజాతి సంస్థల్ని అనుమతించాలన్నది అమెరికా ఆకాంక్ష. ఇదే జరిగితే ఈ రెండురంగాలకు శరాఘాతమే. దేశంలోని చిన్నస్థాయి డైయిరీ రైతులు, స్థానిక సహకార సంఘాలు, చిన్నస్థాయి అమ్మకందారులు సుమారుగా 15 కోట్ల మంది తీవ్రంగా నష్టపోతారు. గ్రామీణ ప్రాంతంలోని చిన్నతరహా డెయిరీల వార్షిక ఉత్పత్తి విలువ పదివేల కోట్ల డాలర్లు. దేశంలో ఉత్పత్తయ్యే పాలలో సగం గ్రామీణ భారతం నుంచే వచ్చి దేశ అవసరాలను తీరుస్తున్నాయి. పాల ద్వారా వచ్చే ఆదాయంలో 70 శాతం డెయిరీ రైతులకు అందుతున్నది. అమెరికా కోరుతున్న విధంగా స్వేచ్ఛా వ్యాపారానికి తావిస్తే ఈ రంగమంతా విధ్వంసమై రైతాంగం తీవ్రంగా నష్టపోయి, గ్రామీణ ఆర్థికవ్యవస్థ కుదేలవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. అమెరికా కోరుకుంటున్న ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్సెప్) ఒప్పందం సాకారమై ఉంటే భారత్ ఇప్పటికే చాలా నష్టపోయేది. ఈ ఒప్పందం నుంచి ఎన్డీయే ప్రభుత్వం బయటకురావాలని గతేడాది నవంబర్‌లో నిర్ణయించటం ముదావహం. పొరుగుదేశాలు ముఖ్యంగా చైనా ప్రాంతీయంగా అనుసరిస్తున్న ఆధిపత్య విధానాలు, టెర్రరిజానికి అండగా నిలుస్తున్న పాక్ చర్యలకు చెక్ పెట్టాలంటే అమెరికా అండతో వ్యూహాత్మక దౌత్యసంబంధాలను బలోపేతం చేసుకోవాలి. విశాల భారత ప్రయోజనాలకు విఘాతం కలుగనిరీతిలో వాణిజ్య ఒప్పందాలకు పెద్దపీట వేయాలి.

**జనగళం**

## శివాలెత్తు ఈశ్వరా..



సృష్టి స్థితి లయకారుడు నటరాజే తానై..
అవినీతిని అంతంచేసే ప్రళయకారుడే కావాలె!

వినాశకారుడే తానై శివతాండవం చేస్తూ..
అజ్ఞానాన్ని అణిచే ఆదియోగి మహేశ్వరుడే కావాలె!

కన్నీటిని తుడిచే రుద్రాక్ష ప్రియుడే తానై...
భావకాలుష్యాన్ని భస్మం చేసే రుద్రుడు కావాలె!

కోర్కెలు తీర్చే భోళాశంకరుడే తానై..
త్రిశూలధారియై 'దిశ'కంఠులను చెండాడాలె!

మెడలోని అలంకార కాలసర్పమే కాటేసి..
కీచకుల పీచమణచే భీకర శంకరుడే కావాలె!

తలపైన గంగమ్మ ప్రళయమై ప్రవహిస్తూ..
కుళ్లు కుతంత్రాల్ని కూకటి వేళ్లతో పెకిలించాలె!

నిరాడంబర ఆదిభిక్షువు శివుడే తానై..
బడుగు బతుకుల్లో భాగ్యాల భరోసా నింపాలి!

వెండికొండపై వెలసిన శంభుప్రభువే తానై..
వేనవేల వరాల దీవెనల్ని కురిపించి మురిపించాలే!

ప్రశాంత వదన అచలేశ్వర ఆది దేవుడే తానై..
మదిమందిరాల్లో మానవత్వ మొలకలు నాటాలె!

స్మశానమే తనదన్న దేవదేవుడే తానై..
సన్మార్గ స్వర్గసీమను భువికి తోడ్కొని రావాలె!
ఎములాడ రాజన్న, శ్రీశైల మల్లన్న..
పాపాల్ని హరిస్తూ, పుణ్యరాసుల్ని పండించాలె..!

– డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**ముక్తసరి**



**దేవులపల్లి ప్రభాకరరావు**

# అత్త సొమ్ము అల్లుడి దానం

ఎన్ని తంటాలు పడినా, మోదీజీ సర్కారు ఎన్ని ఉచిత విహారయాత్రలు ప్రత్యేకించి ఏర్పాటుచేసినా జమ్ముకశ్మీర్ ఈరోజు గత డబ్బై ఏండ్లలో ఎన్నడూ లేనంతగా అంతర్జాతీయ సమస్యయి కూర్చుంది. ఈ సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం జరుపుతానని మోదీజీ దోస్త్ ట్రంప్ పదేపదే అంటున్నాడు, ఈ సమస్య పరిష్కారానికి తోడ్పడుతానని ఐరాస ప్రధాన కార్యదర్శి ప్రకటించాడు, టర్కీ తదితర ఇస్లామిక్ దేశాలు పాకిస్థాన్‌కు అండగా మోహరిస్తున్నాయి.

ఎవరైనా కశ్మీర్ వెళ్లవచ్చని, అక్కడ పరిస్థితి ప్రశాంతంగా ఉన్నదని మోదీజీ ప్రభుత్వం జోరుగా ప్రచారం చేస్తున్నది గనుక ప్రముఖుడు ఒకాయన ఢిల్లీ నుంచి శ్రీనగర్ వెళ్లాడు. శ్రీనగర్ రోడ్ల మీద, విశేషించి లాల్‌చౌక్ వద్ద దాదాపు రోజూ తీవ్రవాదులు దాడులు చేస్తున్నారని, 'ఆజాద్ కశ్మీర్' నినాదాలు తరచూ వినిపిస్తున్నాయని ఈ ప్రముఖుడికి తెలుసు. మాజీ ప్రధాని వాజపేయి ఎంతో ముద్దుగా, మురిపెంగా ఇచ్చిన 'కశ్మీరియత్, జమ్‌హూరియత్, ఇన్సానియత్' నినాదాలకు కాశీలో ఘటాశ్రాద్ధం పెట్టి, తిలోదకాలిచ్చి ఏడాదైందని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని, పరిస్థితి మరింత దిగజారుతున్నదని, అటల్‌జీ కేంద్ర ప్రభుత్వంలో, విదేశ వ్యవహారాల మంత్రిత్వశాఖలో సహాయమంత్రిగా కొంతకాలం వెలిగిన ఒక మాజీ ముఖ్యమంత్రి ప్రస్తుతం పబ్లిక్ సేఫ్టీ చట్టం కింద నిర్బంధంలో ఉన్నాడని కూడా ఈ ప్రముఖుడికి తెలుసు. అయినప్పటికీ, మోదీజీ ప్రభుత్వ ప్రచారం అబద్ధాల పుట్ట అని, పిట్టల రెట్టలకున్న విలువైనా ఆ ప్రచారానికి లేదని కొట్టేయడం ఇష్టం కాక ఆ ప్రముఖుడు సొంత డబ్బులతో, అయాసం అనుకోకుండా అంతదూరం వెళ్లారు. కష్టమైనా ఇష్టమైనది ఆయనకు శ్రీనగర్ ప్రయాణం. ప్రపంచం గగ్గోలును పట్టించుకోకుండా ఆయన కశ్మీర్ స్థితిని స్వయంగా అవలోకించాలనుకున్నాడు, స్వేచ్ఛగా పదిమందిని కలిసి మాట్లాడాలనుకున్నాడు. ఏడాది నుంచి కశ్మీరులో స్వేచ్ఛ అన్నది మృగతృష్ణ అని ఆ ప్రముఖుడు శ్రీనగర్‌లో అడుగుపెట్టగానే అర్థం చేసుకున్నాడు. హోటల్ దాటి ఎక్కడికి వెళ్లవద్దని సెక్యూరిటీ అధికారులు గట్టిగా చెప్పారు. కనీసం ఆ హోటల్ బాయ్స్‌తో మాట్లాడే అవకాశమైనా ఆ ప్రముఖుడికి లభించలేదు. 'జాతీయ ప్రయోజనాలకు, జాతీయ భద్రతకు' ప్రమాదం కలిగించే ఏ పనులు చేయవద్దని ఆయన గది ఎదుట సహస్రాక్షుడై కాపలా ఉన్న ఓ పోలీసు పిస్టల్ మీద వేళ్లు తిప్పుతూ మరోసారి హెచ్చరించాడు. హోటల్ బాయ్స్‌తో మాట్లాడితే 'జాతీయ ప్రయోజనాలకు, జాతీయ భద్రతకు' భంగం కలుగుతుందా అని ఆ ప్రముఖుడు తనను తానే ప్రశ్నించుకున్నాడు. ఆ ప్రముఖుడు మాజీ కేంద్రమంత్రి, జాతీయంగా, అంతర్జాతీయంగా ఎన్నో కీలక పదవులు నిర్వహించినవాడు. ప్రస్తుతం ఆ ప్రముఖుడు ఫ్రీలాన్స్ జర్నలిస్ట్. ఈరోజు జాతీయ ప్రయోజనాల గురించి పాఠాలు చెప్పించుకోవల్సిన దుస్థితి ఏర్పడినందుకు చాలా బాధపడ్డాడు. 'త్వరలో కోట్లాది రూపాయల విలువైన అయోధ్య రామాలయంలోకి వేంచేయనున్న రామచంద్రా ఇదేమిటీ దుర్గతి' అంటూ అమిత వేదనకు గురైనాడు.

శ్రీనగర్‌కు వచ్చిన వాళ్లందరు ఈ ప్రముఖుడి వలె ఆంక్షలకు, హద్దులకు గురికావడం లేదు. జమ్ముకశ్మీర్ సమస్య స్వతంత్ర భారత్ (ఇప్పుడిది సెక్యులర్, సోషలిస్ట్, డెమొక్రటిక్ రిపబ్లిక్ అవునో కాదో తెలియదు!) అంతర్గత సమస్య అంటూ హూంకరిస్తున్న ప్రస్తుత భారత ప్రభుత్వ రథసారథులు ఇటీవల ఈ జనవరి నుంచి ఇప్పటివరకు దాదాపు యాభై దేశాల రాయబారులను, ప్రజాప్రతినిధులను, ఉన్నత దౌత్యాధికారులను విశిష్ట, ఆత్మీయ అతిథులుగా శ్రీనగర్ తీసుకవెళ్లి (ప్రత్యేక విమానాల్లో భారత ప్రభుత్వ అతిథులుగా) అక్కడి సప్తనక్షత్ర హోటళ్లలో, విలాస భవనాల్లో రాచ మర్యాదలు జరిపారు. అత్యంత సాహసవంతంగా, జేమ్స్‌బాండ్ ఫక్కీలో, ఎవరికి అంతుపట్టకుండా 370వ, 35(ఏ)వ అధికరణాలను రద్దుచేసిన తర్వాత జమ్ముకశ్మీర్ ఎంత 'ప్రశాంతంగా' (శ్మశాన ప్రశాంతితో) ఉందో ఈ విదేశీ అతిథులకు చూపించారు. అక్కడి 'జన హృదయం' ఏ విధంగా ఉన్నదో పరికించడానికి ఈ విదేశీ అతిథులు లెఫ్టినెంట్ గవర్నర్‌తో, ఉన్నత సివిలియన్-పోలీసు అధికారులతో, తాము ఎంపికచేసిన కొందరు దేశభక్తులైన రాజకీయ అనామకులతో సల్లాపాలు జరుపడానికి మోదీజీ ప్రభుత్వం హుటాహుటిన అన్ని ఏర్పాట్లుచేసింది. ఇది కేవలం అంతర్గత సమస్య అయినప్పుడు, జమ్ము-కశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితి ఏర్పడిందని, ప్రజలు హాయిగా ఉన్నారని ఇన్ని దేశాల విదేశీయులు సర్టిఫికెట్లు ఇవ్వవలసిన అవసరం ఉందా అని 'దేశభక్తిరహితులు' కొందరు ముక్కుల మీద వేళ్లేసుకుంటున్నారు. అంతేకాదు, భారత విదేశాంగమంత్రి, కొన్ని సమయాల్లో స్వయంగా ప్రధాని మోదీజీ విదేశాలకు వెళ్లి 'భారత్ అంతర్గత సమస్య' గురించి వివరణలు ఇస్తున్నారు. అంతర్గత సమస్య అయినప్పుడు, అది అంతర్జాతీయ సమస్య కానప్పుడు ప్రాధేయపడుతూ ఇన్ని వివరణలు ఇవ్వవలసిన అవసరముందా అన్నది అసలు ప్రశ్న. కశ్మీర్‌లో, ప్రధానంగా శ్రీనగర్ జీలం నదిలో పడవల్లో తిరుగుతూ షికార్లు చేయడానికి, ఉన్న రెండు మూడు రోజులు అక్కడ అత్యంత విలాసవంత జీవితం గడుపడానికి, ప్రత్యేక విమానాల్లో పర్యటించడానికి ఈ యాభై దేశాల గౌరవ అతిథులపై ఎంత

**ఈ దేశంలో కొందరికి గాంధీజీ, ఆయన సిద్ధాంతాలు ఇప్పటికీ అర్థం కావడం లేదు. అందువల్లనే స్వాతంత్ర్యోద్యమం ఒక డ్రామా అని అంటున్నారు. గాడ్సేను దేశభక్తుడి గా ప్రశంసిస్తున్నారు. నాలుగు రోజుల కిందట ఢిల్లీలో ఒక గ్రంథావిష్కరణ సభ జరిగింది. ఆ గ్రంథం పేరు 'గాంధీజీ కొ సమఝ్‌నే కా సహిస మయ్' ఈ గ్రంథ ఆవిష్కరణ సభలో ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్‌జీ పాల్గొని, ప్రసంగించి ఆరెస్సెస్ స్థాపకుడు హెగ్డెవార్‌తో గాంధీజీని పోల్చారు. ఇది సహేతుకమైన పోలిక కాదు. వీరిద్దరు సైద్ధాంతికంగా నిజానికి ఉత్తర దక్షిణాలు.**

వ్యయం జరిగిందని (కశ్మీర్ సామాన్య ప్రజలు వివిధ రూపాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించిన డబ్బు నుంచి) ప్రశ్నిస్తే 'జాతీయ ప్రయోజనాలకు, భద్రతకు' విఘాతం కలుగుతుందని అంటారు. చెమటోడ్చి, పడవలు నడిపి, టూరిజంను ఒక పరిశ్రమగా పెంచి పోషించి, తోటల్లో ఆపిల్ పండ్లు పండించి కశ్మీర్ అట్టడుగు ప్రజలు ప్రభుత్వ బొక్కసం నింపితే ఇదీ పాలకుల ఖర్చు-ఆ ప్రజల గొంతు నొక్కడానికి. అందుకే అంటారు-అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు అని. ప్రశ్నించడానికి, నిరసించడానికి, ధిక్కరించడానికి అవకాశం లేని ప్రజాస్వామ్య వ్యవస్థ రూపొందుతున్నది. వందేండ్ల కిందట బ్రిటిష్ పాలనలో ఈ దేశప్రజలు అనుభవించిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఈ రోజు స్వతంత్ర భారత్‌లో మృగ్యం కావడం ఘోర పరిణామం! 1919లో, గాంధీజీ రాజ్యాంగ పరిధిని అధిగమించి రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలుపడానికి దేశమంతటా సత్యాగ్రహం జరుపాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. దేశమంతటా లక్షలాదిమంది గాంధీజీ పిలుపు విని సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 1919 ఏప్రిల్ 13వ తేదీన అమృత్‌సర్ జలియన్‌వాలాబాగ్‌లో జనరల్ డయ్యర్ మెషిన్‌గన్ కాల్పుల్లో, కేవలం పది నిమిషాల్లో వందలమంది ప్రాణాలు కోల్పోయారు. ఈ రోజు, వందేండ్ల అనంతరం, స్వతంత్ర భారత్‌లో ఇటీవలి 370వ ఆర్టికల్ రద్దును, లేక నిర్వీర్యతను, పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) ప్రశ్నించడానికి వీల్లేదు. నాడు జలియన్‌వాలాబాగ్‌లో జనరల్ డయ్యర్ మెషిన్‌గన్ పేల్చినట్లు నేడు ఢిల్లీ షాహీన్‌బాగ్‌లో ఓ రాత్రి (జామియా మిలియా ఇస్లామియా గ్రంథాలయంలో నడిరాత్రి పోలీసులు దాడి జరిపినట్లు) సాయుధ బలగాలు ప్రవేశించి దాడి జరిపితే ఆశ్చర్యపడవద్దు. ఎన్ని తంటాలు పడినా, మోదీజీ సర్కారు ఎన్ని ఉచిత విహారయాత్రలు ప్రత్యేకించి ఏర్పాటుచేసినా జమ్ముకశ్మీర్ ఈ రోజు గత డబ్బై ఏండ్లలో ఎన్నడూ లేనంతగా అంతర్జాతీయ సమస్యయి కూర్చుంది. ఈ సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం జరుపుతానని మోదీజీ దోస్త్ ట్రంప్ పదేపదే అంటున్నాడు, ఈ సమస్య పరిష్కారానికి తోడ్పడుతానని ఐరాస ప్రధాన కార్యదర్శి ప్రకటించాడు, టర్కీ తదితర ఇస్లామిక్ దేశాలు పాకిస్థాన్‌కు అండగా మోహరిస్తున్నాయి.

అహింసామూర్తి, భారత జాతిపిత గాంధీజీ మహాత్ముడని సకల ప్రపంచం వందేండ్ల కిందటనే గుర్తించింది. ఈ దేశంలో కొందరికి గాంధీజీ, ఆయన సిద్ధాంతాలు ఇప్పటికీ అర్థం కావడం లేదు. అందువల్లనే స్వాతంత్ర్యోద్యమం ఒక డ్రామా అని అంటున్నారు. గాడ్సేను దేశభక్తుడిగా ప్రశంసిస్తున్నారు. నాలుగు రోజుల కిందట ఢిల్లీలో ఒక గ్రంథావిష్కరణ సభ జరిగింది. ఆ గ్రంథం పేరు 'గాంధీజీ కొ సమఝ్‌నే కా సహిస మయ్' ఈ గ్రంథ ఆవిష్కరణ సభలో ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్‌జీ పాల్గొని, ప్రసంగించి ఆరెస్సెస్ స్థాపకుడు హెగ్డెవార్‌తో గాంధీజీని పోల్చారు. ఇది సహేతుకమైన పోలిక కాదు. వీరిద్దరు సైద్ధాంతికంగా నిజానికి ఉత్తర దక్షిణాలు. వీళ్లు ఇవాళ్లయినా, రేపయినా గాంధీజీని అర్థం చేసుకోలేరనిపిస్తున్నది. 'గాంధీజీ కట్టర్ హిందువు' (కరడుగట్టిన హిందువు) అని భగవత్‌జీ ఈ సభలో అన్నారు. తనకు, తన సిద్ధాంతాలకు ఈ విధంగా వక్రభాష్యాలు చెప్పేవారు కొందరుంటారని గాంధీజీ నాడే ఊహించి వాళ్లకు సమాధానంగా ఈ మాటలన్నారు... "My claim to Hinduism hasbeen rejected by some, because I believe and advocate non-violence in its extreme form. They say that I am a Christian in disguise.. my religion is a matter solely between my maker and myself... I do however suggest non-violence is the end of all religions...". "Ahimsa is in Hinduism, it is in Christianity and Islam.." చౌరీచౌరాలో హింస జరిగిందని, రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా సత్యాగ్రహం జరుగుతున్నప్పుడు జలియన్‌వాలాబాగ్ సామూహిక వధ జరిగిందని గాంధీజీ స్వాతంత్ర్య సమరాన్ని నిలిపివేయలేదు. తర్వాత వెంటనే 1920 ఆగస్టు 1 నుంచి మాంటెగుక్లెమ్స్ ఫర్డ్ సంస్కరణలకు వ్యతిరేకంగా గాంధీజీ దేశమంతటా సత్యాగ్రహ పోరాటం ప్రారంభించారు. "Ahimsa is one of the Worlds greatest principles which no power on earth can wipeout...Ahimsa is the highest ideal. It is meant for the brave, never for cowerdly..." అని గాంధీజీ వివరించారు.

# జీవనదిని కలుషితం చేయొద్దు

**విశ్లేషణ**



**పిట్టల రవీందర్**

ఉమ్మడి రాష్ట్ర ఉనికి కాలంలో నీటి ఎద్దడిని ఎదుర్కోవడం ఎట్లా అనే అత్యంత క్లిష్టమైన విపత్కర పరిస్థితుల్లో ఉన్నది తెలంగాణ సమాజం. ఆరేండ్ల స్వల్పవ్యవధిలో ఇవ్వాళ అత్యవసరమైన నీటి యాజమాన్య విధానాలను రూపొందించుకొని సమర్థవంతంగా అమలుపరుచడానికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన అతికీలకమైన సందర్భానికి చేరుకున్నది. నదీ ప్రవాహాల ద్వారా సముద్రంలోకి వృథాగా చేరుకునే వాననీటిని ఒడిసిపట్టుకున్నది. ఈ నీటిని మానవ సంక్షేమం కోసం, స్థానిక అవసరాలకు, పరిస్థితులకు అనుగుణంగా సాగునీటి యాజమాన్య పద్ధతులకు సంబంధించిన విధివిధానాలను స్వయంగా రూపొందించుకొని సమర్థవంతంగా అమలుపరుస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతులు దేశానికే దిశానిర్దేశంగా నిలుస్తున్నాయి. శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర ఎత్తిపోతల పథకం కేంద్రంగా సాక్షాత్కారమైన గోదావరి ప్రాణహిత నదీజలాల వినియోగంలో సీఎం కేసీఆర్ మేధోమథనంలో ఉదయిస్తున్న కొత్తకొత్త ఆలోచనలు సాగునీటి రంగంలో జాతీయ, అంతర్జాతీయస్థాయి సాగునీటి రంగ నిపుణులకు కూడా అందని రీతిలో అమలులోకి వస్తున్న వాస్తవాలు కళ్లముందు కనిపిస్తున్నాయి.

ఇప్పటివరకు అమల్లో ఉన్న పద్ధతులకు భిన్నమైన రీతిలో కాళేశ్వరం లాంటి భారీ ఎత్తిపోతల పథకాలను నిర్వహిస్తున్నప్పుడు, దానికి అనుసంధానంగా నదీగర్భాన్నే జలాశయాలుగా మలచుకొని 'బ్యాక్ వాటర్'ను నిలువ చేసుకుంటున్నప్పుడు ముందుగా ఊహించని రీతిలో ఆచరణలో కొన్ని అనుకోని ఆవాంతరాలు ఎదురైన అనుభవం ద్వారానే పరిశీలించగలుగుతాం. వాస్తవానికి కాళేశ్వరం ప్రాజెక్టుకు రీ డిజైన్ రూపొందించుకుంటున్న సందర్భంగా ప్రణాళికలో గానీ, ఆలోచనలో గానీ లేని అనేక అంశాలను ప్రాజెక్టుల నిర్మాణక్రమంలోనూ, వినియోగంలోకి వస్తున్న క్రమంలోనూ సీఎం కేసీఆర్ వినూత్నమైన అనుబంధ పథకాలుగానే జోడించారు. గోదావరి నది మీద అతికీలకమైన శ్రీరాంసాగర్ భారీ నీటి పారుదల ప్రాజెక్టుకు సంబంధించిన 'పునరుజ్జీవన పథకం', తెలంగాణలో అందుబాటులో ఉన్న చిన్ననీటి వనరుల మీద రూ.4535 కోట్ల ఖర్చుతో నిర్మించతలపెట్టిన 1235 'చెక్‌డ్యాం'ల నిర్మాణం, మానేరు నదీగర్భాన్ని సైతం జీవనదిగా మార్చేందుకు ఉద్దేశించిన 181 కి.మీ. పరిధిలో ఎగువ మానేరు నుంచి మంథని సమీపంలో గోదావరినదిలో కలిసేవరకు రూ.497 కోట్ల ఖర్చుతో ప్రతిపాదించిన 22 'షేక్ హ్యాండ్ చెక్‌డ్యాం'లు, వేములవాడ నుంచి మధ్యమానేరు వరకు మూలవాగుపై రూ.48 కోట్ల ఖర్చుతో ప్రతిపాదించిన 12 చెక్‌డ్యాం... ఇవన్నీ సాగునీటి పథకాల రూపకల్పన, కార్యాచరణ క్రమంలో కేసీఆర్ దూరదృష్టి నుంచి వాస్తవరూపంలోకి వస్తున్న అంశాలే. పంటపొలాల నుంచి వృథాగా దిగువ ప్రాంతాలకు చేరుకునే 'పడువాటి' (రీ ఛార్జెబుల్) నీటిని కూడా ఒడిసిపట్టుకొని సద్వినియోగం చేసుకోవాలనే అనితరసాధ్యమైన అతిసూక్ష్మ ఆలోచన ముఖ్యమంత్రి బుద్ధికుశలతకు అద్దం పడుతుంది!

కాళేశ్వరం ప్రాజెక్టులు ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకుండానే, కృష్ణానదిపై నిర్మాణంలోఉన్న పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన ప్రాజెక్టులు నిర్మాణ దశ స్థాయిలో ఉండగానే తెలంగాణ ప్రాంతం పంటపొలాలతో, పచ్చదనంతో, ప్రకృతి అందాలతో కోనసీమను, కేరళ పరిసరాలను మరిపిస్తున్నదనే మెచ్చుకోలు మాటలను ఇటీవలి కాలంలో విరివిగా వింటున్నాం. అయితే, తెలంగాణ రాష్ట్రంలో కోటి ఎకరాల విస్తీర్ణాన్ని సంపూర్ణంగా సాగు యోగ్యానికి తయారుచేసుకోవాలనే లక్ష్యం నెరవేరడానికి అవసరమైన పూర్వరంగాన్ని నిర్మించుకోవడం ఒక అద్భుతమైన అభివృద్ధి సూచికగా స్వీకరిస్తూనే, మరోవైపున ప్రతికూలంగా పొంచి ఉన్న ప్రమాదాల విషయంలోనూ అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని మన బాధ్యతగా తెలంగాణ సమాజం భావించవలసి ఉన్నది. మానవాళి నిర్లక్ష్యాలు, మానవ తప్పిదాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక నదులు తమ

**గోదావరినదికి రెండువైపులా విస్తరించి ఉన్న గ్రామాలు, పట్టణాలు, నగరాలకు సంబంధించిన డ్రైనేజీ కాలువలను కూడా ఎలాంటి ట్రీట్‌మెంట్ నిర్వహించకుండానే నేరుగా నదీ ప్రవాహంలోకి యథేచ్ఛగా వదిలిపెడుతున్నారు. గోదావరినదీ లోయలో సింగరేణి నిర్వహిస్తున్న బొగ్గుగనులకు సంబంధించిన పారిశ్రామిక వ్యర్థాలు, సిమెంటు, కాగితం తదితర పరిశ్రమల నుంచి గోదావరి నదిలోకి వచ్చి కలిసే రసాయనిక వ్యర్థాలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సంబంధించిన పలు కాలుష్య కారకాలు గోదావరి నదీజలాలకు కాలుష్య ప్రమాదాలుగా పరిణమించాయి.**

పూర్వవైభవాన్ని, ప్రాశస్త్యాన్ని, ఉనికి కోల్పోయిన దుష్టాంతాలు కోకొల్లలుగా కనిపిస్తున్నాయి. ఎంతో పవిత్రమైనదిగా భావించే గంగానది, మన రాష్ట్రంలో మన కళ్లముందు సాక్షాత్కారంగా నిలిచి ఉన్న మూసీనదులు ఎదుర్కొంటున్న దుర్భర, దుర్గంధ పరిస్థితులను మననం చేసుకోవాలి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూ.లక్షల కోట్లు వెచ్చించి రాష్ట్ర ప్రజల సంక్షేమాలను కాంక్షించి వినియోగంలోకి తీసుకువస్తున్న మన నదీనదాల స్వచ్ఛతను కాపాడుకోవడంలో పౌరసమాజం నిర్వర్తించవలసిన కర్తవ్యాలపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలి. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులతో నిండుకుండలా జలకళలాడుతున్న గోదావరి నది ఒక కాలుష్యకాసారంగా, మురికికూపంగా తయారుకాకుండా కాపాడుకోవాల్సిన అవసరాన్ని పరీవాహక ప్రజలు గుర్తించాలి. ఎందుకంటే గతంలో ఎడారిని తలపించేలా ఎండిపోయిన గోదావరి నదికి, నదీజలాలతో రెండు దరులను తాకుతూ జీవనదిలా ప్రవహిస్తున్న ఇవ్వాల్టి గోదావరి నదికీ భూమ్యాకాశాలకున్నంత తేడా ఉన్నది.

గోదావరినదీ తీరప్రాంతాలను ఆనుకొని ఉన్న బాసర, ధర్మపురి, కోటిలింగాల, మంథని, కాళేశ్వరం, భద్రాచలం తదితర హిందూ పుణ్యక్షేత్రాలను సందర్శించే లక్షలాదిమంది భక్తులు తమ పితృదేవతలకు గోదావరినదిలో పిండప్రదానాలు నిర్వహిస్తారు, ఈ సందర్భంగా పలురకాల కాలుష్యకారకాలను నదిలో వదులుతారు. ఇవన్నీ జలకాలుష్యాన్ని పెంచుతున్నాయి. గోదావరినదికి రెండువైపులా విస్తరించి ఉన్న గ్రామాలు, పట్టణాలు, నగరాలకు సంబంధించిన డ్రైనేజీ కాలువలను కూడా ఎలాంటి ట్రీట్‌మెంట్ నిర్వహించకుండానే నేరుగా నదీ ప్రవాహంలోకి యథేచ్ఛగా వదిలిపెడుతున్నారు. గోదావరినదీ లోయలో సింగరేణి నిర్వహిస్తున్న బొగ్గుగనులకు సంబంధించిన పారిశ్రామిక వ్యర్థాలు, సిమెంటు, కాగితం తదితర పరిశ్రమల నుంచి గోదావరి నదిలోకి వచ్చి కలిసే రసాయనిక వ్యర్థాలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సంబంధించిన పలు కాలుష్య కారకాలు గోదావరి నదీజలాలకు కాలుష్య ప్రమాదాలుగా పరిణమించాయి. గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లోని పంటపొలాల్లో వాడుతున్న ఎరువులు, క్రిమి సంహారక మందులు, రసాయనాలు, కలుపు నివారణ మందులు, జనావాసాల్లో వినియోగించే డిటర్జెంట్లు, ఆమ్లాలు, క్షారాలు, కాస్మోటిక్స్, ప్లాస్టిక్ వస్తువులు, ఇతర కాలుష్య కారకాలన్నీకూడా ఎలాంటి నియంత్రణ లేకుండానే అంతిమంగా గోదావరి నదిలోకి చేరుకుంటున్నాయి. అనేక దశాబ్దాల కలల సాకారంగా సాధించుకున్న గోదావరి జీవనదిని కాలుష్యాల నుంచి కాపాడుకొని, గోదావరినదీ పరీవాహక ప్రాంతాల ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకునేందుకు, ఆయురారోగ్యాలను కాపాడుకునేందుకు ఆయా ప్రాంతాల పౌర సమాజాలు కార్యోన్ముఖులు కావాల్సిన అవసరాన్ని తక్షణమే గుర్తించాలి. గతంలో ఎడారిని తలపించిన గోదావరి నదిని అనతి కాలంలోనే మన ప్రజా నాయకుడు ఒక 'జీవనది'గా మార్చగలిగినప్పుడు, అది కాలుష్యపు విషకోరల్లో చిక్కకుండా కాపాడుకోవాల్సిన కనీస బాధ్యత మనమీద లేదా ..!?

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.


నల్లగొండ జిల్లా తిప్పర్తి శివాలయంలో పూజలు చేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


మెదక్ జిల్లా ఏడుపాయలలో అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి తదితరులు


హన్మకొండలోని వేయిస్తంభాల ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్


నల్లగొండ జిల్లా వాడపల్లి మీనాక్షి అగస్త్యేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల, ఎమ్మెల్యే భాస్కర్‌రావు

# శంభో శంకర..


భక్తజనంతో పులకించిన ఏడుపాయల వనదుర్గామాత దేవాలయం

- భక్తిశ్రద్ధలతో శివరాత్రి మహోత్సవం
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- దర్శించుకున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు


మేడ్చల్ జిల్లా కీసర రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డితో కలిసి స్వామివారిని దర్శించుకొంటున్న సీఎం కేసీఆర్ మనుమడు హిమాన్షు

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. శుక్రవారం ఉదయం నుంచి ఉపవాసంలో ఉన్న భక్తులు సాయంత్రం వేళ ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకొని దీక్ష విడిచారు. భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న ఆలయం, మేడ్చల్ జిల్లాలోని కీసర, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర-ముక్తీశ్వరాలయం, ములుగు జిల్లాలోని రామప్ప, మెదక్ జిల్లా ఏడుపాయల, సంగారెడ్డి జిల్లాలోని కేతకీ సంగమేశ్వరాలయం, జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ బాలబ్రహ్మేశ్వర స్వామి, తదితర ఆలయాలను భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన సోమశిల భక్తజనసంద్రంగా మారింది. కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు సోమేశ్వరాలయంలోని లలితాంబికా, సోమేశ్వరుడిని దర్శించుకున్నారు. నది ఒడ్డున మట్టితో గంగమ్మ తల్లి ప్రతిమలను చేసి పసుపు, కుంకుమతో అలంకరించి పూజించారు. మహబూబ్‌నగర్ శివారులోని ఏనుగొండ శివాలయంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. నల్లగొండ జిల్లాలోని వాడపల్లి మీనాక్షి అగస్త్యేశ్వరాలయంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పూజలు చేశారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులోని శంభులింగేశ్వరస్వామిని శుక్రవారం రాత్రి విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, నవీన్‌రావు దర్శించుకొని అభిషేకాలు, ఇతర పూజలు నిర్వహించారు. రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం జిల్లాలోని కూసుమంచి గణపేశ్వరాలయంలో పూజలు చేశారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్, రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, సినీ నటుడు తనికెళ్ల భరణి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి ఆలయంలో సీఎంవో ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకొని పూజలు చేశారు.

**ఏడుపాయల జాతర ప్రారంభం..**

మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గాభవానిమాత జాతర ప్రారంభమైంది. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బ్రెవరీస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్‌తో కలిసి ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఏడుపాయల ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహం వద్ద మంత్రి పూజలు చేసి జాతరను ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో ఆలయాలకు మహర్దశ కలిగిందన్నారు.


వేములవాడ రాజన్నకు శేషవస్త్రాలను తీసుకెళ్తున్న వైద్యారోగ్యశాఖమంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో ఎమ్మెల్సీ నారదాసు, ఎమ్మెల్యే రసమయి ఉన్నారు.


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఏనుగొండ శివాలయంలో పూజలు చేస్తున్న మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్


ఖమ్మం జిల్లా కూసుమంచిలోని గణపేశ్వరాలయంలో పూజలు చేస్తున్న రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్


పెద్దపల్లి జిల్లా మంథనిలోని శ్రీమహాలక్ష్మి ఆలయంలో సీఎంవో ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని వేయిస్తంభాల ఆలయం వద్ద భక్తుల క్యూ





## ✦ పులకించిన నల్లమల

శివ నామస్మరణతో నల్లమల పులకించిపోయింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం భౌరాపూర్‌లోని మల్లన్న, భౌరమ్మ జాతరను తిలకించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. చెంచులు తమ ఇంటి ఆడపడుచుగా భావించే భ్రమరాంబ దేవి(భౌరమ్మ), మల్లికార్జున స్వామి(మల్లన్న)లకు తమ సంప్రదాయ పద్ధతిలో కల్యాణోత్సవాన్ని జరిపించారు. ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు.. స్వామి, అమ్మవార్లకు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం వేళ రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

- అచ్చంపేట, నమస్తేతెలంగాణ




కర్ణాటక రాష్ట్రం యానగుందెలోని మాణిక్యగిరి క్షేత్రంలో శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మాతా మాణికేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు మాతను దర్శించుకొని పులకించిపోయారు.

- దామరగిద్ద

# కారు బానెట్‌పై కిలోమీటరు ఈడ్చుకెళ్లి..

- దంపతుల మధ్య గొడవలో అడ్డొచ్చిన భార్య మేనమామ
- కారుతో అతడిని ఢీకొట్టిన భర్త
- అక్కడికక్కడే మృతి
- సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో ఘటన


గుంజ శంకర్(ఫైల్)

**నేరేడుచర్ల:** భార్యాభర్తల మధ్య గొడవను ఆపేందుకు వచ్చిన భార్య మేనమామను ఓ వ్యక్తి కారుతో ఢీకొట్టి కిలోమీటరు మేర బానెట్‌పై ఈడ్చుకెళ్లగా మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలో శుక్రవారం జరిగింది. మృతుడి భార్య శైలజ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కనకదుర్గమ్మ దేవాలయానికి వెళ్లే దారిలో నివాసముండే వేముల శ్రీను- యాదమ్మ దంపతులకు ఇద్దరు కూతుర్లు. చిన్న కూతురు శ్రీదేవికి ఏపీ లోని గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన ఆర్లపాటి సృజయ్‌రాజ్‌తో ఐదేండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. సఖ్యత లేని కారణంగా వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఇటీవల భర్తతో గొడవపడిన శ్రీదేవి నేరేడుచర్లలోని పుట్టింటికి వచ్చింది. మరుసటి రోజు భార్యను తీసుకెళ్లడానికి సృజయ్‌రాజ్ నేరేడుచర్లకు వచ్చాడు. పెద్ద మనుషుల సమక్షంలో గొడవ పరిష్కరించుకుందామని చెప్పినప్పటికీ వినకుండా భార్య, పిల్లలను కారులో బలవంతంగా తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. చుట్టు పక్కల వారు వారించడంతో భార్య శ్రీదేవి, చిన్నబిడ్డ అర్వితలను వదిలివేసి.. పెద్ద కూతురు శర్వితను తీసుకెళ్తుండగా కారుకు అడ్డుగా వచ్చిన శ్రీదేవి మేనమామ గుంజ శంకర్(32)ను కారుతో ఢీకొట్టాడు. దీంతో శంకర్ కారు బానెట్‌పై ఎగిరిపడగా.. అలానే కారును ఆపకుండా వేగంగా ముందుకు వెళ్లాడు. జాన్‌పహాడ్ రోడ్డులోని గంగమ్మ గుడి వద్దకు రాగానే అప్పటివరకు ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రయత్నం చేసిన శంకర్ కారు మీద నుంచి జారిపడ్డాడు. అయినా కారును ఆపకుండా అతని మీది నుంచి వెళ్లాడు. తీవ్రంగా గాయపడ్డ శంకర్‌ను 108లో మిర్యాలగూడకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి భార్య శైలజ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై యాదవేంద్రరెడ్డి తెలిపారు.

# 24న పాలమూరుకు కేటీఆర్

**మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఈనెల 24న మహబూబ్‌నగర్‌కు ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ రానున్నట్టు ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాకు వివరాలు వెల్లడించారు. పట్టణాలను మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్రంలో 70 కొత్త మున్సిపాలిటీలు, 12కార్పొరేషన్లను ఏర్పాటు చేసి, ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


వర్ని మండలం తగిలేపల్లిలో నిజాంసాగర్ ప్రధాన కాల్వను పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం

# వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

భర్తను హత్యచేసిన భార్య

**బొల్లారం:** వివాహేతర సంబంధం నెరుపుతున్నావంటూ హింసిస్తున్న భర్తను పక్కింటి మహిళతో కలిసి అంతమొందించిందో భార్య. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలో శుక్రవారం వెలుగుచూసింది. బొల్లారం సీఐ ప్రశాంత్ కథనం ప్రకారం.. బొల్లారం బీరప్ప బస్తీకి చెందిన సంపంగి వెంకటమ్మ, వెంకటయ్య(40) దంపతులు. వెంకటమ్మ వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో భర్త పలుమార్లు మందలించాడు. వెంకటమ్మ ఈ విషయాన్ని పక్కింట్లో ఉంటున్న లక్ష్మమ్మకు చెప్పింది. వెంకటయ్య హత్యకు ఇద్దరు కలిసి పథకం రచించారు. ఇందులో భాగంగా వెంకటయ్యను సినిమాకు తీసుకెళ్లాలని లక్ష్మమ్మ కోరడంతో ఈ నెల 17న ముగ్గురూ కలిసి చందానగర్‌లోని శ్రీదేవి టాకిస్‌కు వెళ్లారు. సినిమా చూడకుండా మద్యం తాగేందుకు అక్కడి నుంచి ముగ్గురూ కలిసి ఆటోలో అమీన్‌పూర్ సమీపంలోని లాలాబాయి కాలనీకి వెళ్లారు. వెంకటయ్య అతిగా మద్యం తాగగా.. లక్ష్మమ్మతో కలిసి వెంకటమ్మ బండరాయితో మోది చంపింది. కాగా, ఈ నెల 19న తన భర్త వెంకటయ్య కనిపించడం లేదంటూ వెంకటమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తులో అసలు విషయం వెలుగుచూసింది.

# అన్నాదమ్ముల మధ్య గొడవ

- తమ్ముడి ఆత్మహత్యాయత్నం
- డయల్ 100కు సమాచారంతో నిలిచిన ప్రాణం

**ముత్తారం:** ఓ వ్యక్తి ఆవేశంలో ఆత్మహత్యకు యత్నిస్తున్నాడని వచ్చిన సమాచారం మేరకు హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లిన ఓ పోలీసు అతడి ప్రాణాలు కాపాడి అందరి అభినందనలు అందుకున్నాడు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం కేశనపల్లికి చెందిన అలువోజు శేఖర్, వెంకటేశ్‌లు అన్నదమ్ములు. శుక్రవారం కుటుంబ విషయమై ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవ దాకా వెళ్లింది. మనస్తాపానికి గురైన వెంకటేశ్ ఓ గదిలోకి వెళ్లి ఉరేసుకునేందుకు యత్నించాడు. గమనించిన శేఖర్ డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. వెంటనే ముత్తారం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సాధిర్ పోలీస్ స్టేషన్‌కు దాదాపు కిలో మీటర్‌కుపైగా దూరంలో ఉన్న కేశనపల్లికి మూడు నిమిషాల్లో చేరుకున్నారు. గది తలుపులు పగులగొట్టి వెంకటేశ్ ప్రాణాలను కాపాడాడు. కాగా డయల్ 100తో నిండుప్రాణం కాపాడిన సాధిర్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళా ఎస్సైతో పూజారి అసభ్య ప్రవర్తన

**వరంగల్‌క్రైం:** మహిళా ఎస్సైతో ఓ పూజారి అసభ్యంగా వ్యవహరించాడు. శుక్రవారం వేయిస్తంభాల ఆలయంలోని వీఐపీ క్యూలైన్ వద్ద విధులు నిర్వహిస్తున్న మహిళా ఎస్సైతో పూజారి సందీప్‌శర్మ ప్రవర్తనతో కంగుతున్న సదరు ఎస్సై.. పూజారి వికృతచేష్టలను ప్రశ్నించగా దురుసుగా మాట్లాడాడు. విధులకు ఆటంకం కలిగించడంతోపాటు అసభ్యంగా వ్యవహరించిన సదరు కీచక పూజారిపై చర్యలు తీసుకోవాలని ఆమె హన్మకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# అలీసాగర్ రివర్స్ పంపింగ్‌తో పుష్కలంగా నీరు

స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

**వర్ని:** అలీసాగర్ రివర్స్ పంపింగ్‌తో రైతులకు పుష్కలంగా నీరు అందుతుందని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా వర్ని, చందూర్, రుద్రూర్, కోటగిరి మండలాల్లోని నిజాంసాగర్ ప్రధాన కాల్వ ఆయకట్టును శుక్రవారం స్పీకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఒకరికొకరు సహకరించుకుంటూ నిజాంసాగర్ ద్వారా ఇస్తున్న నీటిని రెండు తడులకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యాసంగిలో నిజాంసాగర్ ఆయకట్టు రైతులు అనుకున్నదానికంటే ఎక్కువ సాగు చేశారని, ప్రతి ఎకరాకు నీరందించాలన్న లక్ష్యంతో అలీసాగర్, నిజాంసాగర్ నీరు అందిస్తున్నామన్నారు. అలీసాగర్ రివర్స్ పంపింగ్‌తో 49 డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నుంచి చందూర్ వద్ద ఉన్న 38 డిస్ట్రిబ్యూటరీ కెనాల్ వరకు సుమారు 35 వేల ఎకరాలకు సాగు నీరు అందుతున్నదని చెప్పారు.



# వేలానికి నీరవ్ ఆస్తులు

- లగ్జరీ కార్లు, విలువైన కళాకృతులు అమ్మకానికి సిద్ధం
- 27న లైవ్ ఆక్షన్, మార్చి 3, 4 తేదీల్లో ఆన్‌లైన్ ఆక్షన్
- శాఫ్రాన్‌ఆర్ట్ ఆక్షన్ హౌస్ సేవలు పొందనున్న ఈడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)ను నిట్టనిలువునా ముంచి దేశం నుంచి పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్‌మోదీకి చెందిన విలాసవంతమైన కార్లు, విలువైన కళాఖండాలు, ఇతర ఆస్తులను త్వరలో వేలం వేయనున్నారు. ఇందుకోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శాఫ్రాన్‌ఆర్ట్ ఆక్షన్ హౌస్ (వేలం సంస్థ)ను రంగంలోకి దించింది. ఈ వేలాన్ని రెండు విడుతల్లో (ఈ నెల 27న లైవ్ ఆక్షన్, మార్చి 3, 4 తేదీల్లో ఆన్‌లైన్ ఆక్షన్) నిర్వహించనున్నారు. పీఎన్‌బీ కుంభకోణంపై దర్యాప్తులో భాగంగా నీరవ్‌మోదీ నుంచి స్వాధీనం చేసుకొన్న ఓ రోల్స్ రాయిస్ కారు (అంచనా విలువ రూ.75 లక్షల నుంచి రూ.95 లక్షలు), పోర్షే పనమెరా ఎస్ కారు (రూ.2.13 కోట్లు), 'బ్యాటిల్ ఆఫ్ గంగా అండ్ జమున: మహాభారత' పేరుతో ప్రఖ్యాత చిత్రకారుడు ఎంఎఫ్ హుస్సేన్ 1972లో గీసిన ఆయిల్ పెయింటింగ్ (రూ.12 కోట్ల నుంచి రూ.18 కోట్లు), 'బాయ్స్ విత్ లెమన్స్' పేరిట 1935లో అమృత షెర్గిల్ రూపొందించిన కళాఖండం (రూ.12 కోట్ల నుంచి రూ.18 కోట్లు), 1972లో వీఎస్ గైటోండే రూపొందించిన పెయింటింగ్ (రూ.7 కోట్ల నుంచి రూ.9 కోట్లు), మన్‌జీత్ బవా గీసిన కృష్ణుడి పెయింటింగ్ (రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్లు), రాజా రవివర్మ కుంచె నుంచి జాలువారిన చిత్రం (రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు) సహా పలు రకాల వస్తువులను ఈ వేలంలో 112 లాట్లుగా (లైవ్ ఆక్షన్‌లో 40 లాట్లు, ఆన్‌లైన్ ఆక్షన్‌లో 72 లాట్లు) అమ్మనున్నారు. అంతేకాకుండా పాటెక్ ఫిలిప్ నౌటిలస్ గోల్డ్ అండ్ డైమండ్ రిస్ట్‌వాచీ (రూ.55 లక్షల నుంచి రూ.70 లక్షలు), అరుదైన మరో రిస్ట్‌వాచీ (రూ.55 లక్షల నుంచి రూ.70 లక్షలు) సహా విలువైన అనేక గడియారాలు, హ్యాండ్ బ్యాగులు, విలాసవంతమైన పలు ఇతర వస్తువులను అమ్మకానికి తీసుకురానున్నారు. ప్రస్తుతం ఈ వస్తువులన్నింటినీ ముంబైలోని శాఫ్రాన్‌ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రదర్శన వచ్చే నెల 4 వరకు కొనసాగుతుంది.



ఏఐఎంఏ కార్యక్రమంలో కేంద్ర మంత్రి గోయల్ తదితరులు

# తేలిగ్గా చూడకండి

## ఇండస్ట్రీ చాంబర్స్‌పై వ్యాపారులకు గోయల్ సూచన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** ఇండస్ట్రీ చాంబర్స్‌ను తేలిగ్గా చూడొద్దని వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ సూచించారు. తమకు సమస్యలు వచ్చినప్పుడే వ్యాపార, పారిశ్రామిక సంఘాల వద్దకు వ్యాపారులు వస్తున్నారని, ఆ తర్వాత వీటిని పట్టించుకోవడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను గతంలో ఎన్నోసార్లు సీఐఐ, ఫిక్కీ, అసోచామ్ కార్యక్రమాలకు వెళ్లానని, అప్పుడు అక్కడ ఆయా సంఘాల ప్రస్తుత అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, కాబోయే అధ్యక్షులు ఇతర కార్యవర్గ సభ్యులే కనిపించారని, పరిశ్రమ పెద్దల్నెవర్నీ చూడలేదని చెప్పారు. శుక్రవారం ఇక్కడ ఏఐఎంఏ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ రకమైన పద్ధతి మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సహచరులకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన ఏఐఎంఏ అధ్యక్షుడు సంజయ్ కిర్లోస్కర్, మా జీ అధ్యక్షుడు హర్ష్ పాటి సింఘానియాలను కోరారు. ఈ సంఘాలన్నీ జాతీయ విధులను, పాత్రను పోషిస్తున్నాయని కొనియాడారు.




# రిటైర్మెంట్ ఫండే ముద్దు

- రిటైల్ మదుపరుల పెట్టుబడులన్నీ ఆ వైపే
- ఏప్రిల్-జనవరిలో 24.5 శాతం వృద్ధి
- రూ.10,425 కోట్లకు చేరిక

**ముంబై, ఫిబ్రవరి 21:** రిటైర్మెంట్ ఫండ్స్‌పైనే అత్యధిక రిటైల్ మదుపరులు ఆసక్తి కనబరుస్తున్నారు. తమ పెట్టుబడులకు మరింత లాభాల్ని ఈ ఫండ్సే తెచ్చిపెట్టగలవని విశ్వసిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) తొలి మూడు త్రైమాసికాల్లో ఈ ఫండ్స్‌లోని ఆస్తుల విలువ 24.5 శాతం పెరిగింది. ఏప్రిల్‌లో రూ.8,376.2 కోట్లుగా ఉన్న ఆస్తులు.. జనవరి ఆఖరుకల్లా రూ.10,425.3 కోట్లను తాకాయి. మరోవైపు ఎస్‌ఐపీ విభాగంలోనూ రిటైల్ మదుపరులు జోరుగా పెట్టుబడులు పెడుతున్నారని ఇండస్ట్రీ సంఘం ఆంఫీ తెలిపింది. ఇందులో కేవలం రిటైల్ మదుపరుల వాటానే రూ.8,532 కోట్లుగా ఉన్నది. ఇది ఆల్‌టైమ్ హై అని పేర్కొన్నది. ఈ క్రమంలోనే జనవరిలో మొత్తం మ్యూచువల్ ఫండ్స్‌లోని ఆస్తుల విలువ మునుపెన్నడూ లేనివిధంగా రూ.28.18 లక్షల కోట్లకు చేరినట్లు వెల్లడించింది. 'జనరల్, రిటైర్మెంట్ పథకాలపై రిటైల్ మదుపరులు అమితాసక్తిని ప్రదర్శిస్తున్నారు' అని ఆంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎన్ఎస్ వెంకటేశ్ అన్నారు. 'గడిచిన 10 నెలల్లో రిటైర్మెంట్ ఆధారిత పథకాల్లోకి పెట్టుబడులు నిలకడగా కొనసాగాయి' అన్నారు. సాధారణంగా ఈ పథకాల కాల వ్యవధి ఐదేండ్లు లేదా పదవీ విరమణ వయసు పూర్తయ్యేదాకా ఏది ముందైతే అది ఉంటుంది. దీర్ఘకాలిక ప్రయోజనాలకు రిటైర్మెంట్ పథకాలు ఎంతో అనువైనవని వెంకటేశ్ తెలిపారు. ఇదిలావుంటే ఈ ఏడాది జనవరి చివరి నాటికి 24 ఫండ్స్‌ల్లో 25.42 లక్షల ఫోలియోలను ఈ పథకాలు కలిగి ఉన్నాయి. నిరుడు ఏప్రిల్ ఆఖరు నాటికి 21 ఫండ్స్‌ల్లో 24.97 లక్షల ఫోలియోలున్నాయి. ఎస్‌ఐపీల ద్వారా ప్రతి నెలా దాదాపు రూ.8,532 కోట్లను రిటైల్ మదుపరులు పెట్టుబడిగా పెట్టారు.

**THE SINGARENI COLLIERIES COMPANY LIMITED**
(A Government Company)
Regd. Office: KOTHAGUDEM – 507101, Telangana.

**E-PROCUREMENT TENDER NOTICE**

The following list of Tenders have been floated through TS Portal for procurement. For details, please visit **https://tender.telangana.gov.in**

**NIT/Enquiry No.- Description/Subject - Last date & time for Submission of bids**

**E141900433** – Transportation of Coal from MOCP to GDK-1 CHP, RG-I Area on weight basis for a Period of 18 months - **10.03.2020 – 17.00 hrs.**

**E041900409** – Procurement of LDO and HFO for operation of 2x600 MW, STPP on Rate Contract Basis for a period of 2 years against open enquiry through Tender-Cum-Reverse Auction - **10.03.2020 – 17.00 hrs.**

**E101900430** – Supply, erection and commissioning of 145KV 3150A SF6 Gas Circuit Breakers - **16.03.2020 - 17.00 hrs.**

PR/2019-20/MP/HTS/116 General Manager (MP)

# ఈసారి వృద్ధిరేటు 4.9 శాతమే

## 2019-20కిగాను ఎన్‌సీఏఈఆర్ అంచనా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20)లో దేశ వృద్ధిరేటు 4.9 శాతంగానే ఉండొచ్చని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రిసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్) శుక్రవారం అంచనా వేసింది. ఇంతకుముందు అంచనా 5 శాతంగా ఉండగా, ఇప్పుడది స్వల్పంగా తగ్గింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అంచనా 5 శాతంగా ఉన్నది. ఇక గత ఆర్థిక సంవత్సరం (2018-19) భారత జీడీపీ 6.1 శాతంగా నమోదైన విషయం తెలిసిందే. ఆర్థిక మందగమన పరిస్థితుల దృష్ట్యా ఈ ఆర్థిక సంవత్సరం అంచనాలు ఒక్కసారిగా పడిపోయాయి. కాగా, అక్టోబర్-డిసెంబర్ వృద్ధిరేటు 4.9 శాతంగా, జనవరి-మార్చిలో 5.1 శాతంగా ఉండొచ్చని చెప్పింది. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2020-21)గాను దేశ వృద్ధిరేటు 5.6 శాతానికి పెరుగవచ్చని ఈ సందర్భంగా ఎన్‌సీఏఈఆర్ ఓ ప్రకటనలో ఆశాభావాన్ని వెలిబుచ్చింది.




# కాటేస్తున్న కరోనా



## ప్రపంచ ఆర్థిక వ్యవస్థను వణికిస్తున్న వైరస్

భయం గుప్పిట్లో వృద్ధి చోదక దేశాలు.. చైనా ఉత్పాదక రంగం కుదేలు

భారత్‌సహా ఎన్నో దేశాలపై తీవ్ర ప్రభావం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** కరోనా వైరస్.. చైనాలో పుట్టి ప్రపంచాన్ని పట్టుకు పీడిస్తున్న ప్రాణాంతక మహమ్మారి. ఇప్పుడీ అంటువ్యాధి మనుషుల్నేగాక.. దేశాల ఆర్థిక వ్యవస్థల్నీ కబళించేస్తున్నది. గ్లోబల్ ఎకానమీకి తయారీ కేంద్రంగా విరాజిల్లుతున్న చైనా.. ప్రస్తుతం కరోనా (కోవిడ్-19) పడగ నీడలో బిక్కుబిక్కుమంటున్నది. ఈ పరిణామం భారత్‌సహా ప్రపంచ వృద్ధి చోదక దేశాలన్నింటినీ ప్రభావితం చేస్తుండగా, అంతర్జాతీయ వృద్ధిరేటు ప్రమాదంలో పడింది. డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ తాజా నివేదికలో ఈ ఏడాది జూన్ నాటికి వైరస్ తీవ్రత అదుపులోకి రాకపోతే ప్రపంచ జీడీపీ 1 శాతం పడిపోయే అవకాశాలున్నాయని తెలిపింది. చైనాకు రాకపోకలు తగ్గిపోవడంతో ఒక్క విమానయాన రంగానికే సుమారు రూ.2 లక్షల కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనాలున్నాయి. ఇలా ఆటో, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ రంగాల నష్టాలను చూస్తే.. ప్రపంచ జీడీపీకి పెను నష్టం తప్పదన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నది.

### చైనా ఎందుకంత ముఖ్యం



గత 40 ఏండ్లకుపైగా చైనా ఆర్థిక వృద్ధి అద్భుత రీతిలో దూసుకుపోతున్నది. దీంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో రెండో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరించింది. చైనా జీడీపీ విలువ 13.6 లక్షల కోట్ల డాలర్లు. 20.5 లక్షల కోట్ల డాలర్లతో అమెరికా మొదటి స్థానంలో ఉన్నది. చైనా ఉత్పాదక రంగం కుటీర పరిశ్రమ స్థాయిలో వేళ్లూనుకుని ఉండటంతో ప్రపంచ తయారీ కేంద్రంగా ఆవిర్భవించింది. జనాభా పరంగా అతిపెద్ద మార్కెట్ చైనాకు సొంతమవడం కూడా ఇక్కడ ఉత్పత్తిని పెంచగా, అన్ని రంగాల్లో విపరీతమైన టెక్నాలజీ చౌకగా అందుబాటులో ఉండటం, చైనీయుల్లో నైపుణ్యం, ప్రతిభకు కొదవే లేకపోవడం.. ఇతర దేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగేలా చేసింది. అన్నిటికంటే మించి పొరుగున భారత్ వంటి భారీ వినియోగ దేశం ఉండటం చైనాకు అన్ని రకాలుగా కలిసొచ్చింది. ఈ మధ్యకాలంలో అమెరికాతో వాణిజ్య యుద్ధం చైనాను కాస్త ఇరుకున పడేసినా.. ఎలక్ట్రానిక్స్, టెలికం వంటి కీలక రంగాల ఉత్పత్తుల తయారీకి అనువుగా ఉండటంతో బహుళజాతి సంస్థలన్నింటికీ చైనానే అడ్డాగా మారింది.

### ఏం జరుగుతున్నది?

కరోనా వైరస్ ధాటికి చైనా విలవిలలాడిపోతున్నది. ఇప్పటిదాకా మృతుల సంఖ్య 2,200లపైనే. బాధితులు సుమారు 76 వేలుగా ఉన్నారు. ఈ అంటువ్యాధిని నిర్మూలించడానికి చైనా విశ్వ ప్రయత్నాలనే చేస్తుండగా, జనజీవనం స్తంభించిపోయింది. దీంతో వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాలన్నీ నిలిచిపోయాయి. చైనా కేంద్రంగా ప్రపంచ మార్కెట్‌ను నడిపిస్తున్న సంస్థలన్నీ మూతబడగా, ఉత్పాదక రేటు దాదాపు జీరో స్థాయికి పడిపోయింది. ముఖ్యంగా చైనా నుంచి ఇతర దేశాలకు వెళ్తున్న ముడి సరుకు, విడి భాగాల సరఫరాకు బ్రేక్ పడింది. టెలివిజన్లు, మొబైల్స్, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లుసహా ఎన్నో గృహోపకరణాలు, ఆటో రంగ ఉత్పత్తుల తయారీ ఆగిపోయింది. దీంతో భారత్ తదితర దేశాల్లో వస్తూత్పత్తి చేస్తున్న సంస్థలకు ముడి సరుకు కొరత ఏర్పడింది. ఉదాహరణకు గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం యాపిల్ 800 సరఫరాదారుల్లో 290 చైనాలోనే ఉన్నాయి. సంస్థ ఆదాయంపై కరోనా వైరస్ ప్రభావం ఉంటుందని ఇటీవల యాపిల్ ప్రకటించినదీ తెలిసిందే. ఇక చైనాలోని హ్యూందాయ్ ప్లాంట్ మూతపడగా, దక్షిణ కొరియా కేంద్రాలకు ఇక్కడి నుంచి వెళ్లాల్సిన విడి భాగాలకు బ్రేకులుపడ్డాయి. గ్లోబల్ టెలివిజన్ ఉత్పత్తిలో చైనా వాటా 9 శాతంగా ఉండగా, దేశీయ మార్కెట్‌లో చైనా సంస్థల ఆధిపత్యం నేపథ్యంలో ఈ పరిణామాలన్నీ భారత జీడీపీనీ దెబ్బతీస్తున్నాయి. అటు చైనా, ఇటు భారత్ రెండూ ప్రపంచ జీడీపీలో కీలకమే. అలాగే అమెరికాసహా చాలా దేశాలకు చైనా ఎగుమతులు ఎంతో ప్రధానం. దీంతో ప్రపంచ వృద్ధిరేటే ప్రభావితమవుతున్నది.

### స్టాక్ మార్కెట్లకూ దెబ్బే

కరోనా వైరస్ దెబ్బ.. ప్రపంచ స్టాక్ మార్కెట్లకు, ముఖ్యంగా ఆసియా సూచీలకు పెద్ద ఎత్తునే తగులుతున్నది. చైనా, హాంకాంగ్‌సహా భారత్, జపాన్, దక్షిణ కొరియా, తైవాన్ సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. మదుపరులు తమ పెట్టుబడులపై స్థిరమైన నిర్ణయాలను తీసుకోలేకపోతున్నారు. చైనాలో దిగజారిన ఆర్థిక పరిస్థితులు.. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలనూ ప్రభావితం చేస్తున్నాయి. చైనా ప్రపంచంలోనే అతిపెద్ద ముడి చమురు దిగుమతిదారుగా ఉన్నది మరి. దీంతో ఐరోపా తదితర పశ్చిమాది దేశాల స్టాక్ మార్కెట్లూ నష్టాలను చవిచూస్తున్నాయి. కాపర్, ఇనుప ఖనిజం వంటి మెటల్ మార్కెట్లూ నేలచూపులు చూస్తుండగా, పర్యాటక, ఆటో, లగ్జరీ రంగాల షేర్లు కుదేలవుతున్నాయి.

### భారత్‌పై ప్రభావం..

కరోనా వైరస్ భారత్‌లో ప్రాణ నష్టాన్ని కలిగించకపోయినా.. ఆర్థిక నష్టాన్ని మాత్రం సృష్టిస్తున్నది. ఔషధ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఎలక్ట్రానిక్స్, ఆటో రంగాలపై వైరస్ ప్రభావం తీవ్రంగా కనిపిస్తున్నది. ఈ రంగాల దిగుమతుల్లో 70 శాతం చైనావే కావడం ఇందుకు కారణం. భారత్‌లో ఆయా రంగాల తయారీ కేంద్రాలున్నా.. ముడి సరుకు కోసం మాత్రం విదేశాలపై, ముఖ్యంగా చైనాపైనే ఆధారపడాల్సి వస్తున్నది. దీంతో కరోనా దెబ్బకు ఆగిపోయిన చైనా ఉత్పత్తి.. దేశీయ తయారీనీ అడ్డుకుంటున్నది. చైనా నుంచి భారత్‌కు దిగుమతి అవుతున్న ఔషధ పదార్థాలు 69 శాతంగా, సోలార్ ప్యానెల్స్ 75 శాతంగా, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 45 శాతంగా ఉన్నాయి. నిరుడు భారతీయ దిగుమతులు 484 బిలియన్ డాలర్లుగా ఉంటే, 85 బిలియన్ డాలర్లు చైనావేనని క్రిసిల్ గుర్తుచేసింది. ఈ క్రమంలోనే చైనాలో కరోనా నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలపై అన్వేషించాలని భారత్‌కు ఫిక్కీ వంటి వ్యాపార, పారిశ్రామిక సంఘాలు సూచిస్తున్నాయి. అసలే ఆర్థిక మందగమనంతో సతమతమవుతున్న భారత్‌కు చైనా కీలక దిగుమతులు ఆగిపోవడం వల్ల తయారీ కార్యకలాపాలు కుంటుపడి.. ధరలు పెరిగి ఇటు ద్రవ్యోల్బణం, అటు నిరుద్యోగం పెరిగిపోయే వీలుందన్న ఆందోళనలూ వ్యక్తమవుతున్నాయి. ఇదిలావుంటే కరోనా వైరస్ సెగ.. దేశీయ పౌల్ట్రీ పరిశ్రమకూ తగులుతున్నది. గడిచిన 15 రోజుల్లో ఒక్క మహారాష్ట్రలోనే రూ.100 కోట్ల నష్టాన్ని పరిశ్రమ చవిచూసింది. చికెన్, గుడ్లు తినడం వల్ల కరోనా వైరస్ వస్తుందన్న తప్పుడు ప్రచారం సోషల్ మీడియాలో విపరీతంగా నడుస్తుండటమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

### సార్స్ కంటే పెద్దదే

2002-03 కాలంలో భయపెట్టిన సార్స్ వ్యాధి కంటే కరోనా వైరస్ చేస్తున్న ప్రాణ, ఆర్థిక విధ్వంసం చాలా చాలా ఎక్కువగా ఉన్నది. నాడు 37 దేశాలను వణికించిన సార్స్.. 8 వేల మందికిపైగా సోకగా, దాదాపు 750 మందిని బలి తీసుకున్నది. ప్రపంచ జీడీపీపై దీని ప్రభావం కూడా పరిమిత స్థాయిలోనే ఉన్నది. 30 బిలియన్ డాలర్ల నుంచి 50 బిలియన్ డాలర్ల మధ్యే ప్రభావం ఉండొచ్చని అంచనా. నాడు గ్లోబల్ ఎకానమీ విలువ దాదాపు 35 లక్షల కోట్ల డాలర్లే. కానీ ఇప్పుడు అమెరికా, చైనా దేశాల ఆర్థిక వ్యవస్థల విలువే ఇంతున్నది. దీంతో ప్రపంచ జీడీపీపై కరోనా పంజా గట్టిగానే విసురుతున్నది. ఇక సార్స్ కంటే ఆరు రెట్లు వేగంగా వ్యాపిస్తున్న కరోనా వైరస్.. ఇప్పటికే 2,250 మందిని పొట్టనబెట్టుకున్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. సుమారు 76 వేల మందికి ఈ వైరస్ సోకినట్లు స్పష్టమవుతున్నది.



# టోకు వ్యాపారంలోకి ఫ్లిప్‌కార్ట్

## వచ్చే త్రైమాసికంలో ప్రారంభం.. ఇప్పటికే ఢిల్లీలో ఎఫ్ఎంసీజీ పైలట్ ప్రాజెక్టు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** అమెరికా కంపెనీ వాల్‌మార్ట్ ఆధీనంలో పనిచేస్తున్న దేశీయ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ వచ్చే ఆర్థిక సంవత్సర (2020-21) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో తన టోకు (హోల్‌సేల్) వ్యాపారాన్ని ప్రారంభించనున్నది. తద్వారా తన ప్రధాన ప్రత్యర్థి అయిన అమెజాన్ బీ2బీ (బిజినెస్ టు బిజినెస్) డివిజన్‌తోపాటు రిలయన్స్ మార్కెట్, టెన్సెంట్ ప్రోద్బలంతో ముందుకు సాగుతున్న ఉడాన్ లాంటి ఈ-కామర్స్ స్టార్టప్‌లతో పోటీపడేందుకు ఫ్లిప్‌కార్ట్ సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది. ఇందుకోసం ఫ్లిప్‌కార్ట్ గత కొన్ని నెలల నుంచి తన సప్లై చైన్ సామర్థ్యాలను పెంపొందించుకోవడంతోపాటు ఉత్పత్తిదారులతో చర్చలు జరుపుతున్నదని, అంతేకాకుండా ఢిల్లీ ఎన్సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్)లోని కిరాణా దుకాణాలకు సరుకులను సరఫరా చేసేందుకు ప్రయోగాత్మకంగా ఎఫ్ఎంసీజీ (ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్) ప్రాజెక్టును నడుపుతున్నదని అభిజ్ఞవర్గాలు వెల్లడించాయి. కిరాణా దుకాణాలకు సరఫరాచేసే సరుకుల సేకరణను పెంపొందించేందుకు అవసరమయ్యే పెట్టుబడుల విషయమై బీ2బీ ఎఫ్ఎంసీజీ సప్లై చైన్ స్టార్టప్ 'జంబోటెయిల్'తో కూడా ఫ్లిప్‌కార్ట్ సంప్రదింపులు జరుపుతున్నట్టు ఈ వ్యవహారం గురించి తెలిసిన పలువురు ఉన్నతోద్యోగులు చెప్పారు. ఫ్లిప్‌కార్ట్ తొలుత ఎఫ్ఎంసీజీతోపాటు తాజా ఆహారపదార్థాలపై దృష్టిసారించి హోల్‌సేల్ వ్యాపారాన్ని ప్రారంభించనున్నదని, ఆ తర్వాత ఈ వ్యాపారాన్ని మరిన్ని క్యాటగిరీలకు విస్తరించనున్నదని వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఫ్లిప్‌కార్ట్ తన సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ఆదర్శ్ మీననను సారథిగా నియమించడంతోపాటు గత ఐదు నెలల్లో తమ కన్జ్యూమర్ మార్కెట్ డివిజన్‌కు చెందిన పలువురు ఎగ్జిక్యూటివ్‌లను హోల్‌సేల్ బిజినెస్ డివిజన్‌కు బదిలీ చేసిందన్నారు. దేశంలో కిరాణా దుకాణదారులకు, చిన్న, మధ్యతరహా వ్యాపారులకు చేయూతనిచ్చి వారి ఎదుగుదలకు తోడ్పడేందుకు బీ2బీ సెగ్మెంట్‌ను మంచి అవకాశంగా భావిస్తున్నామని, కిరాణా వ్యవస్థను సమర్థంగా తీర్చిదిద్దడంలో టెక్నాలజీ కీలకపాత్ర పదోషించగలదని ఫ్లిప్‌కార్ట్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. రైతుల నుంచి నేరుగా జరిపే కొనుగోళ్లను పెంపొందించేందుకు డిసెంబర్‌లో 'నింజాకార్ట్' (పండ్లు, కూరగాయల సరఫరా సంస్థ)లో పెట్టుబడులు పెట్టిన ఫ్లిప్‌కార్ట్.. ఫుడ్ రిటైల్ క్యాటగిరీలో ప్రవేశించేందుకు అక్టోబర్‌లో 'ఫ్లిప్‌కార్ట్ ఫార్మర్‌మార్ట్' పేరిట ఓ సంస్థను రిజిస్టర్ చేయడంతోపాటు బీ2బీ లాస్ట్-మైల్ డెలివరీ ప్లాట్‌ఫామ్ 'షాడోఫాక్స్'లో పెట్టుబడి పెట్టింది.




### అవిశ్వాస దర్యాప్తుపై పిటిషన్

**కాంపిటీషన్** కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తమపై అవిశ్వాస దర్యాప్తునకు ఆదేశించడాన్ని ఫ్లిప్‌కార్ట్ సవాలు చేసింది. ఈ విషయంలో ఫ్లిప్‌కార్ట్ తన ప్రధాన వ్యాపార ప్రత్యర్థి అమెజాన్ బాటలోనే నడుస్తున్నది. పలు రకాల వస్తువులపై అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తమ కొనుగోలుదారులకు అక్రమంగా రాయితీలు ఇస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయని ఆరోపణలు రావడంతో ఆ రెండు ఈ-కామర్స్ దిగ్గజాలపై దర్యాప్తు జరుపాలని సీసీఐ గత నెలలో ఉత్తర్వు జారీచేసింది. దీనిపై అమెజాన్ పిటిషన్ దాఖలు చేయడంతో గత వారం ఓ రాష్ట్ర కోర్టు ఆ దర్యాప్తును నిలిపివేసింది. సీసీఐ ఉత్తర్వుపై ఫ్లిప్‌కార్ట్ కూడా అసంతృప్తితో ఉన్నదని, అందుకే అవిశ్వాస దర్యాప్తును సవాలుచేస్తూ బెంగళూరులోని కోర్టులో ఈ నెల 18న పిటిషన్ దాఖలు చేసిందని ఈ వ్యవహారంతో సంబంధమున్న ఓ వ్యక్తి వెల్లడించారు. ఈ-కామర్స్ రంగంలో విదేశీ పెట్టుబడులకు సంబంధించిన నిబంధనలను భారత్ కఠినతరం చేస్తున్నదని ఆరోపిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌లో తన పర్యటనను ప్రారంభంకావడానికి కొద్ది రోజుల ముందు ఫ్లిప్‌కార్ట్ ఈ పిటిషన్ దాఖలు చేయడం గమనార్హం. వ్యాపారంలో తాము అనుసరిస్తున్న విధానాలు పోటీని దెబ్బతీస్తున్నాయని చెప్తున్న సీసీఐ.. ఈ విషయంలో ఎలాంటి ప్రాథమిక సాక్ష్యాధారాలు లేకుండానే తమపై దర్యాప్తునకు ఆదేశించిందని ఫ్లిప్‌కార్ట్ ఆ పిటిషన్‌లో ఆరోపించింది. దీనిపై వచ్చే వారం విచారణ జరిగే అవకాశమున్నది.

# జియో లాంగ్‌టర్మ్ ప్లాన్

- 336 రోజులకు రూ.2,121
- రూ.2,020 ప్లాన్ తొలిగింపు
- వ్యాలిడిటీ 29 రోజులు కుదింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** దేశీయ టెలికం మార్కెట్లోకి 'సునామీ'లా దూసుకొచ్చి సరసమైన టారిఫ్ ప్లాన్లతో కేవలం మూడేండ్లలోనే ఎంతోమందికి చేరువవడంతోపాటు అతిపెద్ద నెట్‌వర్క్ ఆపరేటర్‌గా ఆవిర్భవించిన రిలయన్స్ జియో తమ ప్రీపెయిడ్ ఖాతాదారుల కోసం సరికొత్త దీర్ఘకాలిక ప్లాన్‌ను ప్రకటించింది. 336 రోజుల వ్యాలిడిటీ కలిగి ఉన్న ఈ ప్లాన్ ధరను రూ.2,121గా నిర్ణయించింది. 365 రోజుల వ్యాలిడిటీతో ఇప్పటివరకు ఉన్న రూ.2,020 ప్లాన్‌ను తొలిగించింది. దాని ధరను పెంచి కొత్త ప్లాన్‌ను తీసుకొచ్చింది. ఈ ప్లాన్ కింద రోజుకు 1.5 జీబీ డాటా, 100 ఎస్సెమ్మెస్‌లు అందజేయడంతోపాటు అన్ని నెట్‌వర్క్‌లకు అపరిమిత కాలింగ్ సదుపాయాన్ని కల్పించింది. వీటితోపాటు జియో టీవీ, జియో సినిమా, జియో న్యూస్ సబ్‌స్క్రిప్షన్‌ను ఉచితంగా అందజేస్తున్నప్పటికీ పాత ప్లాన్‌తో పోలిస్తే కొత్త ప్లాన్ చెల్లుబాటు గడువును 29 రోజులు కుదించింది. కానీ రూ.2,399 ధరకు వొడాఫోన్, రూ.2,398 ధరతో ఎయిర్‌టెల్ అందజేస్తున్న వార్షిక ప్లాన్లతో పోలిస్తే జియో ప్లాన్ చవకే. ఈ ప్లాన్ జియో యాప్‌తోపాటు పేటీఎం, గూగుల్‌పే లాంటి థర్డ్‌పార్టీ యాప్స్‌లోనూ లభ్యమవుతున్నది.

# దేశీయ ఆర్గానిక్ ఫుడ్ మార్కెట్ వృద్ధి సాలీనా 17 శాతం

- కేంద్ర మంత్రి బాదల్ వెల్లడి
- ఢిల్లీలో ఆర్గానిక్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం


ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శిస్తున్న కేంద్రమంత్రి స్మృతి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** దేశంలో సేంద్రియ ఆహార (ఆర్గానిక్ ఫుడ్) మార్కెట్ పరిమాణం సాలీనా 17 శాతం పెరుగుతున్నదని కేంద్ర ఫుడ్‌ప్రాసెసింగ్‌శాఖ మంత్రి హర్‌సిమ్రత్‌కౌర్ బాదల్ తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతున్నందున దేశీయ ఆర్గానిక్ ఫుడ్ మార్కెట్ మరింత వేగవంతంగా వృద్ధిచెంది రానున్న ఐదేండ్లలో రూ.75 వేలకోట్లకు చేరుకునే అవకాశమున్నదని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడంలో ఇది ముఖ్యపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం శుక్రవారం ఆమె కేంద్ర జౌళి, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి స్మృతి ఇరానీతో కలిసి ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆర్గానిక్ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. మూడురోజులపాటు (ఆదివారం వరకు) కొనసాగే ఈ ప్రదర్శనలో 180 మందికిపైగా మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయ గ్రూపులు, సహకార సంఘాలు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో బాదల్ ప్రసంగిస్తూ.. సేంద్రియ ఆహార రంగంలో మహిళా పారిశ్రామికవేత్తలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలన్న ధ్యేయంతో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏటా దేశవ్యాప్తంగా ఆరుసార్లు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తామని, రానున్న రోజుల్లో దీన్ని అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌గా మార్చాలని యోచిస్తున్నామని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటులో మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ముద్రా రుణాలను అందజేస్తున్నదని, నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో ఫుడ్‌ప్రాసెసింగ్ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని స్మృతి ఇరానీ తెలిపారు.

# జీఎమ్మార్-ఏడీపీ డీల్‌కు సీసీఐ ఆమోదం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ).. జీఎమ్మార్-గ్రూపే ఏడీపీ ఒప్పందానికి ఆమోదం తెలిపింది. జీఎమ్మార్ విమానాశ్రయాల వ్యాపారంలో ఫ్రాన్స్‌కు చెందిన గ్రూపే ఏడీపీ 49 శాతం వాటాను సొంతం చేసుకుంటున్న విషయం తెలిసిందే. గురువారం ఈ మేరకు ఇరు సంస్థల మధ్య డీల్ కుదరగా, దీనికి గ్రీన్ చానెల్ ద్వారా సీసీఐ లైన్‌క్లియర్ చేసింది. జీఎమ్మార్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (జీఏఎల్) బిజినెస్ విలువను రూ.22 వేల కోట్లుగా లెక్కించి ఈ లావాదేవీలకు దిగారు. దీంతో 49 శాతం వాటా కోసం ఏడీపీ రూ.10,780 కోట్లు ఇవ్వాల్సి వస్తున్నది. తొలి వాయిదా కింద తక్షణమే రూ.5,248 కోట్లు అందుకుంటున్నట్లు సంస్థ స్పష్టం చేసింది. జీఎమ్మార్ గ్రూప్ షేర్ల కోసం రూ.9,780 కోట్లను ఇస్తున్న ఏడీపీ.. రూ.1,000 కోట్లను జీఏఎల్‌లో ఈక్విటీగా పెడుతున్నది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంతో జీఎమ్మార్ గ్రూప్ రుణ భారం తగ్గుతుందని, పరపతి మెరుగుపడుతుందని, నగదు నిల్వలు పెరుగుతాయని, మరిన్ని లాభాలు వస్తాయన్న ఆశాభావాన్ని జీఎమ్మార్ ఇన్‌ఫ్రా వ్యక్తం చేసింది. దేశీయంగా హైదరాబాద్, ఢిల్లీ ఎయిర్‌పోర్టులను జీఎమ్మార్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

నమస్తే తెలంగాణ WWW.NTNEWS.COM
/nt.zindagi
# జిందగీ
9 | కరీంనగర్ | శనివారం 22 ఫిబ్రవరి 2020



# పొదరింటి నిర్మాణానికి..

**ఇల్లు కట్టి చూడు. పెండ్లి చేసి చూడు అనేది లోకోక్తి. ఈ మాట ఊరికే అనలేదనిపిస్తుంటుంది. ఈ రెండు విషయాల్లో కామన్ పాయింట్ ఒకటుంది. అందరికీ నచ్చేలా. అందరూ మెచ్చేలా.. ఇల్లు కట్టడం , పెండ్లి చేయడం సాధ్యం కాదంటారు. కానీ అందరి మనసు మెచ్చేలా.. ప్రకృతి నిలయాలుగా.. అందమైన పొదరిల్లు నిర్మించేందుకు సిద్ధమయిందో జంట. జంటనగరాల్లో ఎన్నో భవనాల నిర్మాణం చేస్తూ.. తమదైన ముద్రతో ముందుకు సాగుతున్నారు. వాళ్లే డి+బి స్టూడియో అధినేతలు వివేక్ కట్టెల, రిషిక భాష్యకర్ల. వారి పరిచయం 'జిందగీ'కి ప్రత్యేకం.**

ఒక ఉమ్మడి కుటుంబం..
అన్నలు, తమ్ముళ్లు, బాబాయిలు, పిన్నీలు, అక్కలు, తమ్ములు..
ఇలా బంధుత్వాలు బోలెడు.. దాంతో పాటు ఒక్కొక్కరిదీ ఒక్కో ఆలోచన..
వీరికి అందమైన ఇంటి నిర్మాణం చేయాలంటే ఎలా?
'ఆ.. ఏముందండీ.. అన్ని గదులు ఒకేలా కట్టేస్తే ఏ గొడవ ఉండదు' అని చాలామంది అనుకుంటారు.
కానీ వారి మనసులో ఏముందో ఎవరూ గుర్తించరు.. అడగరు కూడా.

* * *

ఒక హాస్పిటల్.. ఒక స్కూల్.. వీటి నిర్మాణ శైలి వేరు. కానీ అన్ని స్కూళ్లు ఒకలా ఉండవు. అన్ని హాస్పిటల్స్ ఒకేలా కనిపించవు. వీటిని నిర్మించడం కూడా అంత కష్టమేం కాదని బయట నుంచి చూసే మనలాంటి వాళ్లకి అనిపించొచ్చు. కానీ అది కట్టించాలనే వారికి మాత్రం తమ అందమైన కలను సాకారం చేసుకోవడానికి ఎంతో ప్రయాసపడే ఉంటారు.

* * *

ఇలా ఉదాహరణలు చెబుతూ పోతే చాలానే కనిపిస్తాయి. ఏ అందమైన నిర్మాణానికైనా పునాది గట్టిగా ఉంటే చాలానుకుంటాం. కానీ అంతకంటే ముందు ఆ నిర్మాణం ఎలా సాగాలని నిర్ణయించే ఆర్కిటెక్ ముఖ్యమని ఎవ్వరూ గుర్తించరు. పైగా వారి చేతిలో పడితే నిర్మాణం గోరంతది కాస్త కొండంతలు అవుతుందనే అపోహ వ్యాప్తిలో ఉంది. అందుకే వారి జోలికి వెళ్లకుండా ఏదో ఒకలా నిర్మాణాలు కానిచ్చేస్తారు. ఆ తర్వాత బాధలు పడుతుంటారు. ఏ నిర్మాణంలోనైనా ఎక్కడ ఎంత ఉంచాలి, ఎంత తక్కువ చేయాలి. కనిపించని చోట్లకి ఎక్కువ ఖర్చు అవసరం లేదు. కనిపించే చోట నాలుగు డబ్బులు ఎక్కువ పెట్టినా పర్లేదని చెప్పేవాడే ఆర్కిటెక్. ఆ చదువును అభ్యసించారు వివేక్, రిషిక. రెండు సంవత్సరాల్లో 15కు పైగా నిర్మాణాలను చేబట్టారు. మరిన్ని నిర్మాణ పనుల్లో ఉన్నాయి. ఈ సక్సెస్ మాత్రం ఊరికే వారికి రాలేదండి. ఇద్దరిగా మొదలైన వీరి కంపెనీ ఇప్పుడు మరో 20 నుంచి 30 మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా చేయడానికి వెనుక వీరి అపారమైన కృషి ఉంది.

### దృష్టిలో పెట్టుకోవాలి..

ఆర్కిటెక్ట్ అంటే.. బ్రెయిన్ యాక్టివ్‌గా ఉండాలి. స్థలాన్ని బట్టి కాదు.. హ్యూమన్ సైకాలజీ గురించి కూడా తెలుసుండాలి. ఎందుకంటే ఒక ప్రాజెక్ట్‌కి.. మరొక ప్రాజెక్ట్‌కి సంబంధం ఉండదు. ఏది చెప్పినా.. దాని గురించి ముందు పాఠం నేర్చుకోవాల్సి ఉంటుంది. వారి ఆలోచనలకు తగ్గట్లుగా ఆ డిజైన్ ఉంటేనే ఒకే అవుతుంది. ప్రకృతిని దృష్టిలో పెట్టుకొని ఈ స్టూడియో మొదలుపెట్టారు. అక్కడి నుంచి ఇంటిరీయర్ డిజైనర్ అవతారం కూడా ఎత్తారు. అరోవెల్లి దగ్గర బిల్డింగ్ మెటీరియల్స్‌పై వెంకట్ వర్క్‌షాప్స్‌కి అటెండ్ అవుతుంటాడు వివేక్. దీనివల్ల ఇల్లు ఇంక దృఢంగా కట్టేందుకు ఎలాంటి మెటీరియల్ వాడొచ్చు? ఎలా చేస్తే మరింత పటిష్టమైన ఇంటి నిర్మాణం సాగించొచ్చు? అనే దానిమీద మరింత పట్టు సాధించగలిగాడు. మన దగ్గర కాల్చిన ఇటుకలతో ఇంటి నిర్మాణం చేస్తారు. కానీ అది సరైన పద్ధతి కాదంటారు వీళ్లు. మన పురాతన ఇంటి నిర్మాణాలు ఎలా జరిగాయి.. అలా అక్కడి మట్టితోనే ఇటుకలు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాలనే ఆలోచనతో ఉన్నదీ జంట. దీనికి సంబంధించిన పనులు ఇంకా ప్రారంభ దశలో ఉన్నాయి.



### ప్రత్యేకంగా ఉండాలని..

నేను పుట్టింది వరంగల్. పెరిగింది నల్లగొండ. అమ్మానాన్న గవర్నమెంట్ డాక్టర్లు. ఏడు సంవత్సరాల వయసు ఉన్నప్పుడు హైదరాబాద్‌కి వచ్చేశాం. నాకో చెల్లి ఉంది. ఇప్పుడు ప్రత్యేకంగా తెలంగాణ వచ్చాక అన్నిరకాలుగా డెవలప్‌మెంట్ జరుగుతుంది. అందుకే ఇక్కడ అవకాశాలు మంచిగా దొరుకుతున్నాయి. ఈ రంగంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాం. మాకో బాబు. ఇద్దరం ఒకే రంగం కావడంతో కంపెనీని మరింత డెవలప్ చేసేందుకు ఎక్కువ అవకాశం దొరికింది.

**- రిషిక**

### అవే ఆదర్శం..

పుట్టింది, పెరిగింది బర్కత్‌పురలో. కాలేజ్‌లో సెక్రటరీగా పనిచేశా. ఈవెంట్స్‌కి, టూర్‌లకి వెళ్లాలంటే నేనే ప్లాన్ చేసేవాడిని. నాకు లారీ బేకర్ ఆర్కిటెక్‌లో ఇన్సిపిరేషన్. ఇప్పుడు ఇంటికి గ్లాసుతో డిజైనింగ్ చేయిస్తున్నారు. అది మన వాతావరణానికి సరిపడదు. మన పురాతన కట్టడాలను చూడండి.. ఎలా చెక్కు చెదరకుండా ఇప్పటికీ ఉన్నాయి. వాటిని ఆదర్శంగా తీసుకొని ఇంటి నిర్మాణం చెప్పట్టాలనేది నా లక్ష్యం. ఇంటరీయర్ డిజైనింగ్ కూడా కొన్ని ప్రాజెక్టులు చేశాం.

**- వివేక్**

### ఆర్కిటెక్చర్‌పై ప్రేమ..

వివేక్‌కి క్రియేటివ్ ఫీల్డ్‌లో ఉండాలని చిన్నప్పటి నుంచి కోరిక. పైగా ఆయన తండ్రికి బిల్డింగుల నిర్మాణం మీద అవగాహన ఉంది. దాంతో ఈ ఫీల్డ్ మీద ఆసక్తి మొదలైందట. ఆ తర్వాత తండ్రి కూడా ఓకే అనడంతో ఆర్కిటెక్చర్ రంగంలోకి అడుగుపెట్టాడు వివేక్.

రిషిక ఇంట్లో తల్లిదండ్రులిద్దరూ గవర్నమెంట్ డాక్టర్స్. మిగతా చుట్టాల్లో ఎక్కువ శాతం ఇంజినీర్లు. తనకి కూడా చిన్నప్పటి నుంచి ఐఐటీ చేయాలని ఆలోచన ఉండేది. దానికి ప్రిపరేషన్ కూడా అలాగే సాగింది. రిషికకి చిన్నప్పటి నుంచి కళలపై ఆసక్తి కూడా ఎక్కువే. ఒకవేళ ఐఐటీ సాధ్యం కాకపోతే క్రియేటివ్ రంగం వైపు రావాలని ఉండేది. ఇంటర్ సెకండియర్‌లో ఆర్కిటెక్చర్ రంగం ఒకటుందని తెలిసింది. కుటుంబానికి ఈ రంగాన్ని పరిచయం చేసింది. వారు అడ్డు చెప్పకపోవడంతో ఈ రంగంలోకి అడుగుపెట్టింది.

### ఇద్దరిని కలిపింది యూనివర్సిటీ..

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ యూనివర్సిటీలో వివేక్ చేరాడు. రెండు సంవత్సరాల తర్వాత అదే కాలేజీలోకి రితిక ప్రవేశించింది. ఇద్దరు ప్రాజెక్టుల విషయంలో తరుచుగా కలుస్తుండేవాళ్లు. ఆ సమయంలో స్నేహం, ప్రేమ చిగురించాయి. కానీ అవేవీ వారి కెరీర్‌కి అడ్డు కాకూడదని చదువు మీదే ధ్యాస పెట్టాలని భావించారు. ఐదు సంవత్సరాల ఆర్కిటెక్ కోర్సును పూర్తి చేసి మాస్టర్స్ కోసం వివేక్ అహ్మదాబాద్ వెళ్లాడు. అక్కడ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌లో.. 'ఆటోమొబైల్ డిజైనింగ్' రంగంలో అడుగుపెట్టాడు. అక్కడే అతనికి ప్రపంచం మరింత విస్తారంగా కనిపించింది. ఎన్నోరకాల డిజైనింగ్ కోర్సుల గురించి తెలిసింది. అప్పుడే స్టూడెంట్ ఎక్స్‌చేంజ్‌లో జర్మనీకి వెళ్లాడు. ప్రతిభ కనబరిచిన స్టూడెంట్స్‌నే ఇలా పంపిస్తుంటారు. అలా వివేక్‌కి అవకాశం దక్కిందన్నమాట. అలా డిజైనింగ్‌లో మరిన్ని మెళకువలు నేర్చుకున్నాడు.
రిషిక కూడా ఇక్కడ ఆర్కిటెక్చర్‌లో పట్టా పొందింది. ఇక్కడి నుంచి తను కూడా అహ్మదాబాద్ చేరి గ్రాఫిక్స్ డిజైనింగ్‌లో చేరింది. ఆస్ట్రేలియాలో ఎక్స్‌చేంజ్ స్టూడెంట్‌గా వెళ్లి అక్కడ చదివింది. అక్కడ చదువుతున్నప్పుడే పారిస్‌లో ఒక కాంపిటేషన్‌కి వెళ్లాల్సి వచ్చింది. తను కాకుండా మరికొంతమందితో కలిసి పారిస్ వెళ్లింది. పారిస్‌లోని ఒక వీధిని బాగు చేయడానికి కావాల్సిన డిజైన్లను ఆహ్వానించింది అక్కడి ఓ సంస్థ. దాంట్లో రిషిక టీమ్ గెలుపొందింది. అలా తన చదువు పూర్తి చేసుకొని ఇండియా తిరిగి వచ్చింది.

### ఇక్కడే మార్పు..

వివేక్ చదువు ముగించి ఇక్కడికి వచ్చాక హైదరాబాద్‌లోని ఒక కంపెనీలో జాయినయ్యాడు. ఇక్కడి నుంచి బెంగళూరు వెళ్లాడు. రిషిక కూడా బెంగళూరు, హైదరాబాద్‌ల్లో వివిధ కంపెనీల్లో పనిచేసింది. తల్లిదండ్రులు కూడా.. 'ఇద్దరు సెటిలయ్యారు.. ఇంకా పెండ్లి చేయాలి' అని నిర్ణయించారు. అప్పుడు వీరి మనసులోని మాటను బయటపెట్టడంతో.. వాళ్లు కూడా ఓకే చెప్పేశారు. అలా పెండ్లి జరిగిపోయింది. ఇద్దరు ఉదయాన్నే ఆఫీసు.. ఇళ్లు, 30వ తారీఖు వచ్చేసరికి నెల జీతం వచ్చి పడేవి. బిజీబిజీ జీవితమైపోయిందని కొన్ని సంవత్సరాలకు అర్థమైపోయింది. తాము కలలు కన్న ఫీల్డ్ ఇదేనా అనే ప్రశ్న మొదలైంది. ఇలా కార్పొరేట్ సెక్టార్‌లో పనిచేసినంతకాలం పరిస్థితి మారదనే విషయం ఇద్దరికీ అర్థమైపోయింది. అందుకే ఏం చేస్తే బాగుంటుందనే ఆలోచన మొదలైంది. అందులో నుంచి పుట్టిందే 'డి+బి స్టూడియో' డిజైనర్, బిల్డింగ్‌ని కలిపి ఒకే చూరు కింద పెడితే బాగుంటుందని డిసైడయ్యారు. ఇద్దరూ ఆర్కిటెక్చర్‌లే కావడం.. ప్రత్యేకమైన డిజైనింగ్ రంగంలో అనుభవం ఉండడంతో ఆర్కిటెక్చర్‌కి మరిన్ని మెరుగులద్దే అవకాశం ఎక్కువ అయింది. రెండు సంవత్సరాలక్రితం ఈ కంపెనీకి అంకురార్పణ జరిగింది.

... సౌమ్య నాగపురి | వీరగోని రజనీకాంత్‌గౌడ్

## నేడు కవలల పండుగ!



**మనిషిని పోలిన మనుషులు ఏడుగురుంటారో లేదో తెలియదు! కానీ అచ్చుగుద్దినట్లుగా కొందరు కనిపిస్తుంటారు. వాళ్లే ట్విన్స్, ట్రిప్లెక్స్. అలా ఒక్కరిద్దరు కనిపిస్తేనే చూస్తూ ఉండిపోతాం. మరి ఒకేసారి అలాంటివారు వేలాది మంది కనిపిస్తే? ఏప్రిల్ 26న హైదరాబాద్‌లో జరిగే 'ట్విన్ సిటీస్ ట్విన్స్ కార్నివాల్'లో అలాంటి దృశ్యమే ఆవిష్కృతం కానుంది. వేలాది మంది కవలలు దేశ నలుమూలల నుంచి హైదరాబాద్ రానున్నారు. శనివారం కవలల దినోత్సవం! సందర్భంగా ప్రత్యేక కథనం.**

**సరిగ్గా** ఆరు రోజుల క్రితం. తెలుగు లలిత కళా తోరణం. 666 బెలూన్లు. 66 కిలోల కేకు. 66 మొక్కలు. ఆరుగురు గెస్టులు. అక్కడో భారీ వేడుక జరుగుతున్నది. అది కేసీఆర్ జన్మదిన వేడుక. కానీ ఇతర ప్రాంతాల్లో మాదిరిగా రొటీన్‌గా మాత్రం అస్సలు కాదు. 166 మంది కవలలు ఈ కార్యక్రమానికి హాజరవడమే ప్రత్యేకం. ఒకేచోట అంతమంది. అదీ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో మమేకమవడం. 2కే ఫన్.. రన్ వంటి కార్యక్రమాలు ఎందరినో కట్టిపడేశాయి. ఫైట్ మాస్టర్స్ రామ్, లక్ష్మణ్ కవలలతో కలిసి ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కేవలం హైదరాబాద్ ప్రాంత కవలలే పాల్గొన్నారు. కానీ ఏప్రిల్ 26న నిర్వహించే 'ట్విన్ సిటీస్ ట్విన్స్ కార్నివాల్' సందర్భంగా మాత్రం వివిధ దేశాల నుంచి సుమారు 5 వేల మంది కవలలు పాల్గొననున్నారు. 26వ తేదీ సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.



### హైదరాబాదే ఎందుకంటే..

ప్రపంచంలోనే ఘన చరిత్ర కలిగిన ఏకైక ట్విన్ సిటీస్ హైదరాబాద్, సికింద్రాబాద్. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన హైదరాబాద్‌కు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనే ఆలోచనతో 'ట్విన్ సిటీస్ ట్విన్స్ కార్నివాల్'ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం కోసం నిర్వాహకులు, సామాజిక కార్యకర్త గోసుల శ్రీనివాస్ యాదవ్ గత ఏడాది నుంచి కవలల వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. ప్రత్యేకంగా వెబ్‌సైట్ తయారు చేయించి వారి వివరాలు సేకరిస్తున్నారు. మీడియా, సోషల్ మీడియా ద్వారా కవలల వివరాలు సేకరిస్తున్నారు. ట్విన్ సిటీస్ ట్విన్స్ కార్నివాల్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెబ్‌సైట్‌లో ఇప్పటికే 3వేల మందికి పైగా కవలలు పేర్లు నమోదు చేసుకున్నారు.

### హైదరాబాద్‌కు ప్రపంచస్థాయిలో గుర్తింపు!



హైదరాబాద్, సికింద్రాబాద్‌కు ఓ బ్రాండ్‌ను క్రియేట్ చేయాలనే ఆలోచనే ట్విన్ సిటీస్ ట్విన్స్ కార్నివాల్ ఉద్దేశం. కవలలకు ప్రత్యేక రోజంటూ లేదు. 2వ నెల 22వ తారీఖున నిర్ణయించాలని చాలామంది కవలలు కోరుతున్నారు. వారందరి ఆలోచనను ఆచరణలోకి తీసుకొద్దామనే మేం ముందుకొచ్చాం. ట్విన్స్ కార్నివాల్‌లో అన్ని రంగాల్లో ఉన్న ట్విన్స్, నాయకులు, అధికారులు హాజరుకానున్నారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో కవలలు హాజరు కానున్నారు. భవిష్యత్‌లో 185 దేశాల కవలలను గ్యాదర్ చేయాలనే ఆలోచనతో ఉన్నాం.

**- గోసుల శ్రీనివాస్ యాదవ్,** సామాజిక కార్యకర్త

### కార్యక్రమాలేంటంటే..

ట్విన్ సిటీస్ ట్విన్స్ కార్నివాల్ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తెలంగాణలోని అన్ని రంగాల్లో స్థిరపడిన కవలలు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ప్రభుత్వ అధికారులు, నాయకులు కవలలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం ప్రజా సేవకులతో ట్విన్స్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా కవలలకు ఉచిత విద్య, ఉద్యోగావకాశాలు, వారిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, పేద కవలల తల్లిదండ్రులకు ఆర్థికసాయం వంటి కార్యక్రమాలు చేయనున్నారు. సమాజంలో అనేక సంఘాలు, సంస్థలున్నాయి. కానీ కవలల సంక్షేమానికి కృషి చేసే వారే లేరు. ఈనేపథ్యంలో కవలలకు అండగా నిలబడాలనే ఉద్దేశ్యంతో సామాజిక కార్యకర్త గోసుల శ్రీనివాస్‌యాదవ్ తన మిత్రులతో కలిసి ట్విన్స్ వెల్ఫేర్ ఫౌండేషన్‌ను ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు.

### కవలల దినోత్సవం ఈరోజే ఎందుకు?

కవలలకు ప్రత్యేకంగా ఓ రోజంటూ లేదు. ఒక్కో దేశంలో ఒక్కో రోజును కవలల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. 2 ను కవల సంఖ్యకు సూచికగా వాడుతుంటారు. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా రెండో నెల 22వ తేదీన కవలల దినోత్సవంగా నిర్వహించాలని 'ట్విన్ సిటీస్ ట్విన్స్ కార్నివాల్' నిర్వాహకులు, కవలల తల్లిదండ్రులు ప్రతిపాదిస్తున్నారు. భవిష్యత్‌లో దేశవ్యాప్తంగా ఇదే తేదీన కవలల దినోత్సవం జరిపించేలా అధికారికంగా అమలు చేసేందుకు భారత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు.

... పడమటింటి రవికుమార్

### మీరూ నమోదు చేసుకోండిలా..

మీరూ కవలలా.. ఏప్రిల్ 26వ తేదీన నిర్వహించే 'ట్విన్ సిటీస్ ట్విన్స్ కార్నివాల్' కార్యక్రమంలో పాల్గొనాలనుకుంటున్నారా? అయితే (www.twincitytwins.com)లో ఇప్పుడే మీ వివరాలు ఉచితంగా నమోదు చేసుకోండి. లేదా 912190 66647, 91213 66642లో సంప్రదించవచ్చు.

## మేకప్‌తో పనేంటి?

**ఫంక్షన్ అయినా, పార్టీ అయినా బయటికెళ్లాలంటే చాలు చాలామంది మేకప్‌ను ఆశ్రయిస్తుంటారు. మేకప్‌తో పని లేకుండా ఈ చిన్న చిట్కాలు పాటిస్తే చాలు సహజంగా అందాన్ని పొందవచ్చు. చర్మాన్ని కాంతివంతంగా మార్చుకోవచ్చు.**



- ఎండ నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు చర్మానికి హాని చేస్తాయి. సన్‌స్క్రీన్ లోషన్ రాయడం వల్ల చర్మం తాజాగా ఉంటుంది. ఎండకు కందిపోదు. ఎండకు బయటికి వెళ్లేటప్పుడు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవడం మంచిది.
- అందం కోసం సౌందర్య ఉత్పత్తుల మీద ఆధారపడవద్దు. చర్మ ఆరోగ్యానికి ఆహారం ప్రధానమైంది. ముఖ్యంగా ఆరోగ్యవంతమైన చర్మం కావాలనుకునే వారు యాంటీ ఆక్సిడెంట్లు, కొల్లాజెన్ స్థాయిలు అధికంగా ఉండే పండ్లు తీసుకోవడం మంచిది.
- చర్మం కాంతివంతంగా ఉండేందుకు రోజుకు కనీసం 4 నుంచి 5 లీటర్ల నీళ్లు తాగాల్సి ఉంటుంది. దీంతో చర్మంలోని మలినాలు తొలిగిపోయి మొటిమలు రావు. నీళ్లు ఎక్కువగా తాగితే చర్మం మృదువుగా, నునుపుగా తయారవుతుంది.
- కొందరి చర్మం పాలిపోయినట్లుగా, ముడతలు పడి ఉంటుంది. ఇందుకు నిద్రలేమి కూడా కారణంగా చెప్పొచ్చు. నిద్రపోవడం వల్ల కొల్లాజెన్ సహజంగా పెరుగుతుంది. దీనివల్ల చర్మం మెరుస్తుంది.
- మొబైల్ ఫోన్ ఎక్కువగా వాడడం వల్ల కూడా మొటిమలు వచ్చే అవకాశం ఉంది. వీలైనంత వరకు లౌడ్ స్పీకర్ ఆన్ చేసుకోవడం మంచిది. మొబైల్ తెర ముఖానికి తాకితే మొటిమలు వస్తుంటాయని వైద్యులు చెబుతున్నారు.

## కాజు తినండి రోజూ..

**జీడిపప్పును సాధారణంగా ఉప్మాలో, పాయసంలో వాడుతుంటారు. కానీ వీటిని రోజూ తినొచ్చు. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. జీడిపప్పును రోజూ తినడం వల్ల కలిగే లాభాలు.**



- జీడిపప్పు మెటబాలిజాన్ని సక్రమపరిచి ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. ఇందులో పీచు పదార్థాలు ఆకలి వేసేలా చేయవు. అందుకే రోజు మొత్తం జీడిపప్పును స్నాక్స్‌గా తీసుకున్నా ఆకలివేసినట్లు అనిపించదు.
- జీడిపప్పులోని కాపర్, ఐరన్ రక్తకణాల సంఖ్యను పెంచుతుంది. వ్యాధినిరోధకత పెరుగుతుంది. ఆరోగ్యకరమైన ఎముకలకు జీడిపప్పులు బలాన్నిస్తాయి. ఇందులోని లుటిన్ అనే పదార్థం కంటికి మేలు చేస్తుంది. కంటి పొరను కాపాడుతుంది.
- రోజుకు గుప్పెడు జీడిపప్పులు తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. జీడిపప్పుతో పాటు వాల్‌నట్స్, బాదాం, ఎండు ద్రాక్షలు, పండ్లు తీసుకుంటే శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి.
- రోజూ నాలుగు గ్రాముల జీడిపప్పుని తీసుకుంటే ఆకలి ఎక్కువగా వేయదు. దీని ద్వారా బరువును నియంత్రించుకోగలుగుతారు. ఒబెసిటీ తగ్గుతుంది. ఉప్పులో వేయించిన జీడిపప్పును తీసుకోకపోవడం మంచిది. దీనికి బదులు వట్టి జీడిపప్పును దోరగా వేయించి తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది.
- స్నాక్స్‌గా జీడిపప్పును తీసుకుంటే శరీరానికి కావాల్సిన ప్రోటీన్లు సులభంగా అందుతాయని న్యూట్రీషియన్లు చెబుతున్నారు. బరువు తగ్గుతారని చెప్పి అధిక మోతాదులో కూడా జీడిపప్పును తీసుకోవద్దని వారు చెబుతున్నారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
శనివారం 22 ఫిబ్రవరి 2020



రామ్, మాళవికా శర్మ

# పదివేల అడుగుల ఎత్తులో..

**రా**మ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రెడ్'. కిషోర్ తిరుమల దర్శకుడు. శ్రీ స్రవంతి మూవీస్ పతాకంపై రవికిషోర్ నిర్మిస్తున్నారు. ఇటీవలే రెండు పాటల్ని ఇటలీలో చిత్రీకరించారు. ఈ సందర్భంగా నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇటలీలోని టుస్కాన్, ఫ్లారెన్స్, డోలమైట్స్ ప్రాంతాల్లో రెండు పాటల్ని తెరకెక్కించాం. డోలమైట్స్ సముద్ర తీర పర్వత ప్రాంతం. సముద్రానికి పదివేల అడుగుల ఎత్తులో మైనస్ ఐదు డిగ్రీల వాతావరణంలో ఓ పాటను చిత్రీకరించాం. ఆ ప్రదేశంలో షూటింగ్ జరుపుకున్న తొలి తెలుగు చిత్రమిది. అక్కడ ఏటా జరిగే వెనీడియా కార్నివాల్‌ను కూడా అనుమతి తీసుకొని కొంతభాగం చిత్రీకరించాం. దీంతో ఓ పాట మినహా షూటింగ్ మొత్తం పూర్తయింది. ఈ నెలాఖరున హైదరాబాద్‌లో ఆ పాటను తెరకెక్కిస్తాం. ఏప్రిల్ 9న భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నాం' అన్నారు. 'యాక్షన్ థ్రిల్లర్ కథాంశమిది. ఒకే పోలికలున్న ఇద్దరు వ్యక్తుల నేపథ్యంలో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది' అని దర్శకుడు తెలిపారు. నివేదా పేతురాజ్, మాళవికాశర్మ, అమృతాఅయ్యర్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి, సంగీతం: మణిశర్మ, దర్శకత్వం: కిషోర్ తిరుమల.

# అను అంతరంగం

**'మం**చి, చెడు అనేవి పరిస్థితులను బట్టి మన దృష్టికోణంపై ఆధారపడి ఉంటాయి. ఏ పరిస్థితుల్లో ఏ నిర్ణయం తీసుకోవాలన్నది మన అంతరాత్మ మీద ఆధారపడి ఉంటుంది' అని అంటున్న ఓ యువతి కథేమిటన్నది తెలియాలంటే సినిమా చూడాల్సిందే అంటున్నారు మంచు విష్ణు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మోసగాళ్లు'. జెఫ్రీ జీ చిన్ దర్శకత్వం వహిస్తున్నారు. వయామార్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఏవీఏ బ్యానర్స్ పతాకాలపై విరోనికా మంచు నిర్మిస్తున్నారు. కాజల్ అగర్వాల్, రుహానిసింగ్ కథానాయికలు. బాలీవుడ్ నటుడు సునీల్‌శెట్టి కీలక పాత్రను పోషిస్తున్నారు. శుక్రవారం కాజల్ ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదలచేసింది. సినిమాలో అను అనే యువతిగా తాను నటిస్తున్నట్లు కాజల్ ట్విట్టర్ ద్వారా తెలిపింది. 'గత చిత్రాలకు పూర్తి భిన్నంగా కాజల్ పాత్ర శక్తివంతంగా ఉంటుంది. వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. దేశంలో జరిగిన ఓ పెద్ద ఐటీ స్కామ్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఆద్యంతం ఉత్కంఠను పంచుతుంది. ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో కీలక సన్నివేశాల్ని చిత్రీకరించాం. సోమవారం నుంచి హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభిస్తాం' అని చిత్రబృందం తెలిపింది. వేసవిలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్నది.



కాజల్ అగర్వాల్

# ప్రయాణాన్ని ప్రేమిస్తావు!

**సా**యిధరమ్‌తేజ్ సోదరుడు వైష్ణవ్‌తేజ్ కథానాయకుడిగా అరంగేట్రం చేస్తున్న చిత్రం 'ఉప్పెన'. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై నవీన్ ఏర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సానా దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. కృతిశెట్టి కథానాయిక. ఏప్రిల్ 2న విడుదలకానుంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సినిమా కొత్త పోస్టర్‌ను రామ్‌చరణ్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆవిష్కరించారు. 'బిగ్ వెల్కమ్ వైష్ణవ్‌తేజ్. ఈ ప్రయాణాన్ని నువ్వు ప్రేమిస్తావు. చిత్ర బృందం అందరికి ఆల్ ది బెస్ట్' అంటూ రామ్‌చరణ్ పేర్కొన్నారు. 'అందమైన ప్రేమకథా చిత్రమిది. భావోద్వేగభరితంగా సాగుతుంది. లవ్, సెంటిమెంట్, యాక్షన్ హంగులతో మెప్పిస్తుంది' అని చిత్ర బృందం తెలిపింది. విజయ్ సేతుపతి, సాయిచంద్, బ్రహ్మాజీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శ్యాందత్, ఎడిటర్: నవీన్ నూలి, ఆర్ట్: మౌనికా రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: అనిల్ వై, అశోక్ బండ్రెడ్డి, సీఈఓ: చెర్రీ, సంగీతం: దేవిశ్రీప్రసాద్, కథ, దర్శకత్వం: బుచ్చిబాబు సాన.



'ఉప్పెన' చిత్రంలో కృతిశెట్టి, వైష్ణవ్‌తేజ్

# న్యూఏజ్ థ్రిల్లర్‌గా 'రాహు'

**కృ**తిగార్గ్, అభిరామ్ వర్మ, కాలకేయ ప్రభాకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రాహు'. సుబ్బు వేదుల దర్శకుడు. ఏ.వి.ఎస్. ఆర్ స్వామి, శ్రీశక్తి బాబ్జి, రాజా దేవరకొండ, సుబ్బు వేదుల నిర్మాతలు. ఈ నెల 28న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్మాతల్లో ఒకరైన ఏ.వి.ఎస్.ఆర్ స్వామి పాత్రికేయులతో మాట్లాడుతూ 'కథ నచ్చడంతో మా స్నేహితులతో కలిసి నిర్మాణ భాగస్వామిగా మారాను. ఈ చిత్ర కథలో నాయిక జీవితంలో ఒక రాహువు ఉంటాడు. ఆమె కన్వర్షన్ డిజార్డర్‌తో పోరాటం చేస్తుంటుంది. ఆమె తన జీవితంలోకి వచ్చిన రాహుపై ఎలా పోరాటం చేసిందన్నదే చిత్ర కథ. ఆద్యంతం థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఆకట్టుకుంటుంది. కుటుంబమంతా కలిసి చూసేలా ఉంటుంది. న్యూఏజ్ థ్రిల్లర్‌గా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. సినిమా నచ్చి విడుదల చేయడానికి సురేష్‌బాబుగారు ముందుకొచ్చారు' అన్నారు.



ఏ.వి.ఎస్.ఆర్.స్వామి



రవితేజ

# నువ్వెవడైతే నాకేంట్రా..

**'డా**న్‌శీను', 'బలుపు' తర్వాత హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'క్రాక్'. సరస్వతి ఫిలింస్ డివిజన్ పతాకంపై బి.మధు నిర్మిస్తున్నారు. శృతిహాసన్ కథానాయిక. శుక్రవారం హైదరాబాద్‌లో టీజర్‌ను చిత్ర బృందం విడుదలచేసింది. 'ఒంగోల్‌లో రాత్రి ఎనిమిది గంటలకు కరెంట్ పోయిందంటే ఖచ్చితంగా మర్డరే' అనే డైలాగ్‌తో మొదలైన టీజర్ ఆసక్తిని రేకెత్తిస్తున్నది. 'అప్పిగా సుబ్బిగా నువ్వు ఎవడైతే నాకేంట్రా డొప్పిగా' అనే శక్తివంతమైన డైలాగ్‌తో తనదైన శైలి హీరోయిజం, మేనరిజమ్స్‌తో రవితేజ ఆకట్టుకుంటున్నారు. పోలీస్ ఆఫీసర్‌గా మాస్ లుక్‌లో ఆయన కనిపిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'టీజర్‌కు చక్కటి ఆదరణ లభిస్తున్నది. యథార్థ ఘటనల ఆధారంగా రూపొందిస్తున్నాం. రవితేజ పాత్ర నవ్యరీతిలో ఉంటుంది. మే 8న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదలచేస్తాం' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.మధు, అమ్మిరాజు, జీకే విష్ణు, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రియాంకచోప్రా

# ప్రతినాయిక ఛాయలతో

**వెం**డితెరపై తన విలనిజాన్ని చూపించడానికి సిద్ధమవుతోంది గ్లోబల్ స్టార్ ప్రియాంకచోప్రా. వివాదాస్పద ఆధ్యాత్మిక సలహాదారు మా ఆనంద్ శీల జీవితం ఆధారంగా ఓ సినిమా రూపొందనున్నది. భగవాన్ శ్రీ రజనీష్‌కు 1981–85 వరకు పర్సనల్ సెక్రటరీగా పనిచేసిన శీల పేరు 1984లో అమెరికాలో జరిగిన బయో టెర్రర్ అటాక్‌తో ప్రాచుర్యంలోకి వచ్చింది. అమెరికాలోని అతిపెద్ద బయోటెర్రరిస్ట్ అటాక్ పేరొందిన ఈ ఘటనలో 751 మంది అస్వస్థతకు లోనయ్యారు. ఈ కేసులో 39 నెలలు జైలులో గడిపిన శీల ఆ తర్వాత అమెరికా నుంచి స్విట్జర్లాండ్‌కు పారిపోయింది. నేరాలమయంగా సాగిన ఆమె జీవితాన్ని 'శీల' పేరుతో వెండితెరపై ఆవిష్కరిస్తున్నారు. శీల పాత్రలో ప్రియాంకచోప్రా నటిస్తున్నది. బారీ లెవిన్‌సన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు ప్రియాంకచోప్రా ఓ నిర్మాతగా వ్యవహరించనున్నది. ఆంగ్లంతో పాటు హిందీలో ఈ సినిమాను నిర్మించనున్నట్లు సమాచారం. తన కెరీర్‌లో విభిన్న కోణాలున్న పాత్రగా నిలిచిపోతుందని ప్రియాంకచోప్రా చెప్పింది.




# సైకో కిల్లర్ కథ!



'హలో మేడమ్' చిత్ర లోగో ఆవిష్కరణ దృశ్యం

**న**వీన్.కె.చారి, ప్రియాంశ, మేఘన చౌదరి, సుమాయ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'హలో మేడమ్'. వడ్ల జనార్ధన్ దర్శకుడు. వడ్ల గురురాజ్, వడ్ల కార్తిక్ నిర్మాతలు. శుక్రవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర లోగోను దర్శకుడు సాగర్, తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ సంయుక్తంగా విడుదలచేశారు. సాగర్ మాట్లాడుతూ 'హారర్ థ్రిల్లర్ అంశాలతో ఘటికాచలం అందించిన కథను దర్శకుడు జనార్ధన్ చక్కగా తెరపై ఆవిష్కరించారు' అని తెలిపారు. చిన్న సినిమాల్ని ఆదరిస్తేనే కొత్త నిర్మాతలు ఇండస్ట్రీకి వస్తారని, ఈ సినిమా విజయాన్ని సాధించి యూనిట్ అందరికి పేరుతెచ్చిపెట్టాలని ఆర్.కె.గౌడ్ అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మహిళలపై జరుగుతున్న అకృత్యాలను ఆధారంగా చేసుకొని రూపొందిస్తున్నాం. సైకో కిల్లర్ కథ ఇది. అతడిని అంతమొందించినదెవరన్నది ఆకట్టుకుంటుంది. త్వరలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఘటికాచలం, సాయివెంకట్, రామసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నమస్తే తెలంగాణ
సంపద
[ కరీంనగర్ ]
శనివారం 22 ఫిబ్రవరి 2020

హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి ఆర్కిటెక్చర్ సూత్రాల ప్రకారం.. లగ్జరీ నివాసాల్ని కట్టే డెవలపర్ల సంఖ్య పెరుగుతున్నది. అంతర్జాతీయ పోకడలను క్షుణ్నంగా అర్థం చేసుకుని.. మన పరిస్థితులకు అతికినట్టు సరిపోయేలా కచ్చితమైన లగ్జరీ గ్రీన్ హోమ్స్‌కు శ్రీకారం చుడుతున్నారు. హైదరాబాద్‌ను మరోస్థాయికి తీసుకెళ్లేలా బహుళ అంతస్తుల భవనాలు, ఆకాశహర్మ్యాలను డెవలపర్లు చేపడుతున్నారు. వర్టికల్ గ్రీనరీకి ప్రాధాన్యతనిస్తూ.. పచ్చదనానికి పెద్దపీట వేస్తూ.. నగర నిర్మాణ గతినే సంపూర్ణంగా మార్చివేస్తున్నారు. ప్రాజెక్టు స్థలం విస్తీర్ణంతో సంబంధం లేకుండా.. లగ్జరీని మించిన స్థాయిలో ఇవి నగరంలో రూపుదిద్దుకోవడం విశేషం.

# గ్రీన్ లగ్జరీ



**నిన్నటివరకూ** కొనుగోలుదారులు కేవలం క్లబ్‌హౌజ్, స్విమ్మింగ్‌పూల్ వంటివి ఉంటేనే సంతోషించేవారు. అంత కంటే ఆధునిక సౌకర్యాల్ని కూడా పెద్దగా కోరుకునేవారు కాదు. అలాంటిది, ఆధునిక బయ్యర్ల ఆలోచనలు సమూలంగా మారిపోయాయి. తాము కొనుగోలు చేయాలనుకునే ప్రాజెక్టులో ఏదో ఒక కొత్తదనం ఉండాలని ఆశిస్తున్నారు. రోజంతా కష్టించి ఇంటికొచ్చాక.. ప్రత్యేకమైన అనుభూతి కలగాలని భావిస్తున్నారు. శరీరం, మనస్సు, ఆత్మను సుసంపన్నం చేసే లగ్జరీ నివాసాలు ఉండాలని కోరుకుంటున్నారు. మారుతున్న కొనుగోలుదారుల అభిరుచులకు అనుగుణంగా కొన్ని వైవిధ్యమైన ప్రాజెక్టులు హైదరాబాద్‌లో రూపుదిద్దుకుంటున్నాయి. ఇలాంటి వారికోసమే ఎలివేషన్‌లో గ్రీనరీ ఉండే ప్రాజెక్టులు ఆరంభమయ్యాయి. ఆధునిక నిర్మాణాల్లోనే జీవ వైవిధ్యాన్ని చూపెట్టేందుకు సరికొత్త నిర్మాణాలు పోటీపడుతుండటం విశేషం.

### 150 చెట్ల చుట్టూ..

ఈ పదాన్ని నగరానికి చెందిన కొందరు డెవలపర్లు క్షుణ్నంగా అర్థం చేసుకున్నారు. అందుకే, చుట్టూ ఖాళీ పరిసరాలున్న ప్రాంతంలో స్థలం దొరికితే చాలు.. ఎగిరి గంతేస్తున్నారు. అందులోనే హరిత ప్రాజెక్టును చేపట్టడానికి పోటీపడుతున్నారు. గత రెండేండ్ల నుంచి హైదరాబాద్‌లో ధరలూ ఆకాశాన్నంటడంతో.. ఆ స్థాయి నిర్మాణాల్ని చేపట్టే అవకాశం డెవలపర్లకు లభిస్తున్నది. మాదాపూర్‌లో ఒక ప్రాజెక్టును డిజైన్ చేసిన తీరు చూస్తే ముచ్చటేస్తుంది. 30 నుంచి 60 ఫీట్ల ఎత్తు గల 150 చెట్ల చుట్టూ అపార్టుమెంట్లను కడుతున్నారు. దీంతో కాలుష్య ప్రపంచంతో సంబంధం లేకుండా.. ప్రశాంతంగా నివసించడానికి వీలు ఏర్పడుతుంది. కొన్ని ప్రాజెక్టుల్లో ఎకరాలో 4 నుంచి 500 దాకా చెట్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఒక్కో ఫ్లాటుకు 2, 3 బాల్కనీలు ఉండేలా డిజైన్ చేశారు.

- నానక్‌రాంగూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్ చుట్టుపక్కల ప్రాంతాల్లో సరికొత్త నిర్మాణాలకు కొదవే లేదు. సుమారు 65 నుంచి 75 శాతం స్థలాన్ని ఖాళీగా వదిలేస్తూ నిర్మాణం జరుపుకుంటున్న కట్టడాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతుండటం విశేషం. వీటిలో కొన్ని ప్రాజెక్టులకు ఐజీబీసీ గోల్డ్ రేటింగ్ లభించిన కట్టడాలూ ఉండటం గమనార్హం. గాలీ, వెలుతురు ధారాళంగా వస్తూ.. విద్యుత్ వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తాయీ నిర్మాణాలు. ఇలాంటి వాటిలో స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకుంటే మనసెంతో తేలికగా ఉంటుందని, ప్రతి క్షణాన్ని ఆస్వాదించవచ్చని నిర్మాణ సంస్థలు అంటున్నాయి. హరిత సూత్రాలకు అనుగుణంగా చేపట్టిన ప్రాజెక్టుల్లో కొన్ని గృహప్రవేశానికీ సిద్ధంగా ఉండటం విశేషం. ప్రాజెక్టు ఆవరణలోకి ప్రవేశించగానే డిజైనర్ ల్యాండ్ స్కేపింగ్ ఆకట్టుకునేలా తీర్చిదిద్దడంపై దృష్టి సారించారు. కాకపోతే, ఫ్లాట్ల సైజులు పెద్దవి ఉండటం వల్ల సామాన్యులూ వీటిలో నివసించలేరు. ఇవన్నీ కూడా సమాజంలో కాస్త హోదా, పేరు ప్రఖ్యాతలు ఉండేవారికోసమే డెవలపర్లు నిర్మిస్తున్నారు.

### బయ్యర్లలో క్రేజీ..

హరిత భవనాల్లో నివసించడానికి కొందరు కొనుగోలుదారుల్లో ఆసక్తి పెరిగింది. గతేడాది నుంచి ఈ విధానంపై ఎక్కువ శాతం మక్కువ పెరిగింది. కేవలం గృహాలను తీసుకోవడం కాకుండా హరిత భవనాల్లో నివసించేవారి సంఖ్య పెరిగింది. మొత్తం కొనుగోలుదారుల్లో పది నుంచి పాతిక శాతం కంటే ఎక్కువ ఉండకపోవడం గమనార్హం. పదవీవిరమణ పొందిన తల్లిదండ్రులతో పిల్లలు నివసించాలనుకుంటే మాత్రం.. కచ్చితంగా గ్రీన్ హోమ్స్‌లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. కాలుష్యం నుంచి తప్పించుకుని ప్రశాంతంగా నివసించడానికి ఇంతకుమించిన ప్రత్యామ్నాయం లేదని కొందరు కొనుగోలుదారులు ఇటీవల హైదరాబాద్లో జరిగిన క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షోలో 'సంపద'కు తెలిపారు. ఆధునిక జీవన విధానానికి పెద్దపీట వేస్తూ ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తున్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణకు స్థలాన్ని కేటాయిస్తున్నారు.

### గ్రీన్ ప్రాజెక్టులు ఇక్కడే..

| ప్రాజెక్టు | సంస్థ | ఎక్కడ? | ఫ్లాట్ల సంఖ్య | ధర (రూ.కోట్లల్లో) | హ్యాండోవర్ ఎప్పుడు? |
|---|---|---|---|---|---|
| బొల్లినేని బయాన్ | బీఎస్‌సీపీఎల్ ఇన్‌ఫ్రా | కొండాపూర్ | 936 | 1- 1.78 | 2025 |
| 360లైఫ్ | శ్రీముఖ్ నమితా హోమ్స్ | హైటెక్ సిటీ | 288 | 2.47-4.84 | 2022 |
| జయభేరి ద సమ్మిట్ | జయభేరి ప్రాపర్టీస్ | నార్సింగి | 750 | 1.14- 1.48 | 2020 |
| అపర్ణా వన్ | అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ | షేక్‌పేట్ | 464 | 3.45- 6.25 | 2024 |
| మన్‌భూమ్ ఎరౌండ్ ద గ్రొవ్ | మన్‌భూమ్ కన్‌స్ట్రక్షన్స్ | కొండాపూర్ | 202 | 1.46- 2.40 | 2021 |
| రాజపుష్ప ఎటర్నా | రాజపుష్ప ప్రాపర్టీస్ | ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ | 290 | 1.58-2.90 | 2021 |
| గ్రీన్ గ్రేస్ | ఎస్ అండ్ ఎస్ గ్రీన్ ప్రాజెక్ట్స్ | నానక్‌రాంగూడ | 420 | 1.5- 1.81 | రెడీ టు ఆక్యుపై |
| అపర్ణా జెనిత్ | అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ | నలగండ్ల | 2475 | - | 2023 |

గమనిక : కేవలం అవగాహన కోసమే ఈ పట్టిక. ప్రతి అంశాన్ని గమనించాక తుది నిర్ణయం తీసుకోవాలి.

## అనుమతులు సులువైతే ఆనందమే



తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల కారణంగా దేశంలోకెల్లా హైదరాబాద్ నిర్మాణ రంగం మెరుగ్గా ఉన్నదని తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రావు తెలిపారు. రాష్ట్రంలోని నిర్మాణ రంగంలో ఏర్పడిన తాజా స్థితిగతులను ఆయన 'నమస్తే సంపద'కు ప్రత్యేకంగా వివరించారు. టీఎస్-బీపాస్ విధానాన్ని ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రభుత్వం అమల్లోకి తేస్తుండటం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో భవనాలకు అనుమతులు సులభంగా లభిస్తే.. నిర్మాణ రంగం మూడు పూవులు ఆరు కాయలుగా విరాజిల్లుతుందన్నారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

- 'మా తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్‌కు చెందిన దాదాపు ఏడు వందల మంది దాకా బిల్డర్లు, డెవలపర్లు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రాజెక్టులను చేపడుతున్నారు. ఇందులో సుమారు 65 శాతం మంది సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి అవసరమయ్యే ఫ్లాట్లను నిర్మిస్తుండగా.. మిగతా వారు లగ్జరీ విల్లాలు, హైరైజ్ అపార్టుమెంట్లను కడుతున్నారు. ఆర్థికమాంద్యం కారణంగా, ప్రస్తుతం కొందరు కొనుగోలుదారులు వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నారు. పెరుగుతున్న నిర్మాణ వ్యయం, భూముల ధరల కారణంగా రానున్న రోజుల్లో ఫ్లాట్ల ధరలు పెరుగుతాయే తప్ప తగ్గే అవకాశం ఉండదు. కాబట్టి, నగరంలో స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకోవాలని భావించేవారు.. తక్షణమే నిర్ణయం తీసుకుంటే ఉత్తమం.
- దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోల్చితే నేటికీ హైదరాబాద్‌లో ఇండ్ల ధరలు తక్కువగానే ఉన్నాయని చెప్పాలి. నగరానికి విచ్చేస్తున్న జాతీయ, అంతర్జాతీయ సంస్థల కారణంగా మన వద్ద భూముల ధరలు పెరిగిన మాట వాస్తవమే. కాకపోతే, అందుకు తగ్గట్టుగా ఫ్లాట్ల ధరలు పెరగలేదనే విషయాన్ని గమనించాలి. ఈ అంశాన్ని అర్థం చేసుకోకుండా, కొందరు ఇండ్ల రేట్లు తగ్గుతాయని అనుకుంటున్నారు. 2020లో నగరానికి తరలివచ్చే సంస్థలు, పెట్టుబడులు, ప్రభుత్వం తీసుకుంటున్న వినూత్న నిర్ణయాల కారణంగా.. రియల్ రంగం అనూహ్యంగా పుంజుకుంటుందనే విషయాన్ని మర్చిపోవద్దు. కాబట్టి, సొంతింటి కలను సాకారం చేసుకోవడానికి ఇంతకుమించిన తరుణం లేదని చెప్పొచ్చు.'

## పెద్దల గృహాలకు గిరాకీ



నగరంలో పెద్దల గృహాలకు గిరాకీ పెరిగింది. దేశంలో ఎక్కడ పని చేసినా, పదవీవిరమణ తర్వాత హైదరాబాద్‌కు విచ్చేసి ప్రశాంతమైన వాతావరణంలో నివసించాలని భావించేవారి శాతం అధికమైంది. అంతర్జాతీయ సంస్థలు విడుదల చేస్తున్న నివేదికల ప్రకారం.. 2050 నాటికి మనదేశ జనాభా 60 శాతం పెరుగుతుంది. కానీ, 60 ఏండ్లు పైబడిన వారి జనాభా 360 శాతం పెరుగుతుందని తెలిసింది. ఈ నేపథ్యంలో సీనియర్ సిటిజన్లు ఎలాంటి చింత లేకుండా పదవీ విరమణ పొందవచ్చు. అయితే వీరికి అనువైన గృహాలను సృష్టించడం అనుకూలమైన మార్కెట్ అని డెవలపర్లు గుర్తించారు. ప్రధానంగా సీనియర్ సిటిజన్ల గృహాలకు ఎక్కువ డిమాండ్ ఉంది. పెరుగుతున్న ఆదాయం, అధిక జీవితకాలం ఈ డిమాండ్‌కు దారితీసే కారణాలు.

- 2000 ప్రారంభంలో భారత జనాభాలో ఎక్కువ భాగం విదేశాలకు వలస వెళ్లడంతో సీనియర్ సిటిజన్లు అధిక శాతం ఇక్కడే నివసిస్తున్నారు. గతంలో వృద్ధులు ఆర్థికంగా బలహీనంగా, ఇతరులపై ఆధారపడేవారు. కానీ ప్రస్తుతం వారు పదవీ విరమణ తర్వాత ఇబ్బందుల్లేని స్వతంత్ర, గౌరవప్రదమైన వ్యక్తులుగా గుర్తింపు పొందుతున్నారు. ఇప్పుడు భారతదేశంలోని సీనియర్ సిటిజన్ల స్థితిని మార్చడంలో రిటైర్మెంట్ హోమ్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. వృద్ధుల అవసరాలకు అనుగుణంగా బిల్డర్లు ఆధునిక సౌకర్యాలతో కూడిన ఇండ్లను నిర్మిస్తున్నారు. కొందరు బిల్డర్లు సాధారణ అపార్ట్‌మెంట్లపై దృష్టి సారిస్తుండగా మరికొందరు గేటెడ్ కమ్యూనిటీలు, ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ విల్లాలను చేపడుతున్నారు.
- వైద్య సంరక్షణ, భద్రత వంటి అంశాలకు ఈ గృహాల్లో చాలా మంది ప్రాధాన్యతనిస్తున్నారు. రెసిడెంట్ డాక్టర్లు, నర్సులు, ఫిజియోథెరపిస్టులు, అంబులెన్స్ సౌకర్యాలు, జనరేటర్ బ్యాకప్‌తో అత్యవసర తరలింపు కోసం స్ట్రెచర్లు ఏర్పాటు చేస్తున్నారు. వృద్ధుల ఆహార అవసరాలను తీర్చడానికి ప్రత్యేక ఆహారం, పోషకాహార నిపుణుల సేవలను అందిస్తున్నారు. వృద్ధులను దృష్టిలో ఉంచుకుని 75 శాతం బహిరంగ ప్రదేశాలు ఆకుపచ్చగా ఉండేలా, చాలా కాంప్లెక్స్‌ల్లో ప్రత్యేక నడక మార్గాలు రూపొందిస్తున్నారు. సమావేశాలు, వేడుకలు, వినోద ఏర్పాట్లను కూడా సులభతరం చేస్తున్నారు. పార్కులు, ఫొటో గ్యాలరీల వంటి వృద్ధుల ఉత్తేజకరమైన జీవితానికి అవకాశాన్నిస్తాయి. ఇలాంటి సౌకర్యాలున్న ఇండ్లలోనే నివసించాలని సీనియర్ సిటిజన్లు కోరుకుంటున్నారు.

హైదరాబాద్‌లో ప్లాట్లు కొనుక్కోవాలని చాలామందికి ఉంటుంది. కానీ, ఏయే ప్రాంతాల్లో ప్లాటు గజం ధర ఎంతుందో చాలామందికి తెలియదు. ఈ అంశాన్ని గుర్తు పెట్టుకుని.. పలు ఏరియాల్లో ఎంతెంత రేటు ఉందనే విషయాన్ని 'సంపద' కనుక్కున్నది.

## ఏ ప్రాంతం.. ఎంత రేటు?

| ఏరియా | కనీస ధర | గరిష్ట ధర |
|---|---|---|
| అబ్దుల్లాపూర్‌మెట్ | 8,000 | 16,000 |
| ఆదిభట్ల | 10,100 | 25,000 |
| అల్కాపూర్ టౌన్‌షిప్ | 48,000 | 68,000 |
| అల్వాల్ | 31,000 | 47,000 |
| అమీన్‌పూర్ | 15,000 | 22,000 |
| అత్తాపూర్ | 28,000 | 46,000 |
| బాచుపల్లి | 28,000 | 45,000 |
| బడంగ్‌పేట | 19,000 | 32,000 |
| బాలాపూర్ | 19,500 | 25,500 |
| బండ్లగూడ జాగీర్ | 35,000 | 48,000 |
| బీరంగూడ | 19,000 | 37,000 |
| చందానగర్ | 34,000 | 69,000 |
| బోడుప్పల్ | 25,000 | 44,000 |
| చర్లపల్లి | 15,000 | 29,000 |
| దమ్మాయిగూడ | 17,000 | 29,000 |
| దుండిగల్ | 13,000 | 27,000 |
| గాజుల రామారం | 31,000 | 47,000 |
| హఫీజ్‌పేట్ | 60,000 | 83,000 |
| హయత్‌నగర్ | 20,500 | 34,000 |
| ఇస్నాపూర్ | 15,500 | 26,000 |
| కొంపల్లి | 25,000 | 35,000 |
| కొండాపూర్ | 65,000 | 84,000 |
| కూకట్‌పల్లి | 40,500 | 56,000 |

**గమనిక :** కేవలం అవగాహన కోసమే ఈ పట్టిక. న్యాయపరంగా ప్రతి అంశాన్ని క్షుణ్నంగా గమనించాక, ధర గురించి పూర్తిగా తెలుసుకున్నాకే తుది నిర్ణయం తీసుకోవాలి.

## అన్ని రకాల గృహాలకు ఆవాస్

- దెవలపర్లు తమ ప్రాజెక్టులు నమోదు చేసుకోవాలి
- క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు సీహెచ్ రామచంద్రారెడ్డి






భారతదేశంలో క్రెడిబుల్ ప్రాజెక్టులను నిర్మించే క్రెడాయ్ నేషనల్ తాజాగా 'క్రెడాయ్ ఆవాస్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని.. దేశవ్యాప్తంగా క్రెడాయ్ డెవలపర్ల ప్రాజెక్టుల సమాచారం ఇందులో లభిస్తుందని.. సొంతిల్లు కొనుక్కునేవారు ఒక్కసారి ఈ యాప్‌లోకి వెళితే.. అన్నిరకాల ప్రాజెక్టుల సమాచారం తెలుసుకోవచ్చని క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు చెరుకు రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రస్తుతం క్రెడాయ్ తెలంగాణలో పదకొండు ఛాప్టర్లు ఉన్నాయని.. బిల్డర్లందరూ తమ ప్రాజెక్టులను 'క్రెడాయ్ ఆవాస్' యాప్‌లో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

మనదేశంలో క్రెడాయ్ డెవలపర్ల వద్ద ఫ్లాట్లు కొనుగోలు చేస్తే నిశ్చింతగా ఉండొచ్చని రామచంద్రారెడ్డి అన్నారు. ఇతర వెబ్‌సైట్లతో పోల్చితే ఇందులో మధ్యవర్తులు ఉండరని తెలిపారు. క్రెడాయ్ ఆవాస్ యాప్‌లోకి వెళితే.. ఫ్లాట్లను సులభంగా ఎంచుకోవచ్చని చెప్పారు. బయ్యర్లే నేరుగా ఫ్లాట్లను ఎంపిక చేసుకోవచ్చన్నారు. 2017 జనవరి 1 నుంచి తెలంగాణలో రెరా అమల్లోకి వచ్చిందని.. కాకపోతే, అంతకు ముందునుంచే క్రెడాయ్ సభ్యులు కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పాటిస్తున్నారని తెలిపారు.

- క్రెడాయ్ ఆవాస్‌లో కేవలం రెరా అనుమతి పొందిన ప్రాజెక్టుల సమాచారం మాత్రమే లభిస్తుందన్నారు. తెలంగాణలో నివసించేవారు బెంగళూరు, చెన్నై, ఢిల్లీ వంటి మెట్రో నగరాల్లో ఫ్లాట్లు కొనుగోలు చేయాలన్నా క్రెడాయ్ ఆవాస్ ద్వారా సులభతరం అవుతుందన్నారు. దేశంలోని ఇతర నగరాల్లో నివసించే వారు హైదరాబాద్‌లో ఈ యాప్ ద్వారా సులువుగా ఇండ్లను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఈ యాప్ ప్రత్యేకత ఏమిటంటే.. ఇండ్లను కొనాలని భావించేవారు.. నేరుగా నిర్మాణ సంస్థలను సంప్రదించే వీలు కలుగుతుందని వివరించారు. మధ్యవర్తులతో సంబంధం ఉండదన్నారు. క్రెడాయ్ బిల్డర్ల వద్ద కొనుగోలు చేస్తే ఎలాంటి సమస్యలు ఎదురు కావు. ఈ అంశాన్ని అర్థం చేసుకున్నాకే చాలామంది కొనుగోలుదారులు క్రెడాయ్ సభ్యుల వద్ద ఫ్లాట్లను కొనడానికి ముందుకొస్తున్నారు. ఇలాంటి వారందరికీ క్రెడాయ్ ఆవాస్ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ, రెరా పరిధిలో మీకు ఎలాంటి సమస్యలున్నా.. హోమ్‌లోన్స్, లీగల్, రిజిస్ట్రేషన్, ట్యాక్సేషన్ వంటి అంశాల్లో మీకు ఎలాంటి సందేహాలున్నా మాకు రాయండి. మా నిపుణులు మీకు సమాధానాలిస్తారు. మీరు ప్రశ్నలు పంపాల్సిన మా చిరునామా..

**నమస్తే సంపద**

8-2-603/1/7,8,9, కృష్ణాపురం,
రోడ్‌నంబర్.10, నమస్తే తెలంగాణ, మొదటి అంతస్తు, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
nt.sampada@gmail.com

## వర్టూసా గేటెడ్ కమ్యూనిటీలు

ఇండ్లు కొనుగోలు చేయాలనుకునే వారెవరైనా అభివృద్ధికి ఆస్కారమున్న ప్రాంతాల్లో.. ఆధునిక సౌకర్యాలున్న వెంచర్లకే ప్రాధాన్యమిస్తున్నారు. అలాంటి వారికోసం వర్టూసా లైఫ్ స్పేసెస్ నగరంలో పలు గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. కొనుగోలుదారుల అభిరుచికి తగ్గట్టుగా పలు ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ముఖ్యంగా వర్టూసా టక్సెడో పార్కు పేరిట షాద్‌నగర్‌లో సరికొత్త వెంచర్‌ను ప్రారంభించింది. ఇందులో ఆధునిక సౌకర్యాలతో కూడిన నివాసాలు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చేపడుతున్న ప్రాజెక్టులకు ఈ వెంచర్ ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తుందని వర్టూసా సంస్థ చెబుతున్నది.

- ప్రపంచస్థాయి వసతులతో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టు రిసార్ట్ వంటి అనుభూతిని కలిగిస్తుంది. ఈ ప్రాజెక్టులో అత్యుత్తమ సౌకర్యాలతో కూడిన క్లబ్ హౌస్‌ను నిర్మిస్తున్నారు. ఇది ప్రాజెక్టుకే ప్రధానాకర్షణగా నిలుస్తున్నది. దీంతోపాటు స్విమ్మింగ్ పూల్, జిమ్, మల్టీ పర్పస్ హాల్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, గెస్ట్ రూము, కాఫీ షాపు, లైబ్రరీలను ప్రత్యేకమైన డిజైన్‌లో తీర్చిదిద్దుతున్నారు.
- వర్టూసా స్పేసెస్ నిర్మాణ సంస్థ ఇప్పటికే కొంపల్లిలో వర్టుసా ఐకానా మిడోస్ పేరుతో ఒక ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసింది. 45 ఎకరాల్లో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా రెసిడెన్షియల్ విల్లాలు, ప్లాట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్టు ఔటర్ రింగు రోడ్డుకు అతిచేరువలో ఉండటం విశేషం. దీంతోపాటు షాద్‌నగర్ టౌన్‌లో వర్టూసా లోర్నా గ్రీన్స్ పేరుతో మరో ప్రాజెక్టును ప్రారంభించింది. మోకిలా దగ్గరల్లోని శంకర్‌పల్లిలో వర్టూసా సైనోజర్ పేరుతో మరో ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రస్తుతం ఈ రెండు ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. అధునాతన సౌకర్యాలతో ఈ ప్రాజెక్టుల్లోని రెసిడెన్షియల్ విల్లాలను, ప్లాట్లను తీర్చిదిద్దుతున్నారు.


















నమస్తే తెలంగాణ
ఆట
12
[ కరీంనగర్ ]
శనివారం 22 ఫిబ్రవరి 2020
WWW.NTNEWS.COM

# పూనమ్ పంజా

## నాలుగు వికెట్లతో విజృంభణ.. ఆస్ట్రేలియాపై భారత్ అద్భుత విజయం

## టీ20 ప్రపంచకప్‌లో టీమ్ఇండియాకు అదిరిపోయే ఆరంభం

**భారత మహిళల జట్టు అంచనాలకు మించి టీ20 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో సత్తాచాటింది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపైనే మట్టికరిపించి టైటిల్ ఫేవరెట్ రేసులో తామున్నామంటూ ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపింది. తొలి విశ్వకప్ వేటలో ఉన్న భారత జట్టు మొదట బ్యాటింగ్‌లో కాస్త తడబడినా.. బౌలింగ్‌లో సత్తాచాటింది. షెఫాలీ మెరుపులు, దీప్తి విలువైన ఇన్నింగ్స్‌లో తొలుత మోస్తరు స్కోరు సాధించిన టీమ్ఇండియా.. పూనమ్ యాదవ్ లెగ్‌స్పిన్ మయాజాలంతో ఆసీస్ బ్యాటర్ల పనిపట్టడంతో తొలి కఠిన పరీక్షలో ఫస్ట్‌క్లాస్‌లో పాసైంది. ఈ మ్యాచ్‌కు దాదాపు 13వేల మంది వీక్షకులు హాజరుకావడం విశేషం.**

**16ఏండ్ల భారత ప్లేయర్ షెఫాలీ వర్మ బ్యాటింగ్ ఈ మ్యాచ్‌లో హైలెట్. తొలి సారి విశ్వటోర్నీలో అడుగుపెట్టానన్న భయం ఏ మాత్రం లేకుండా అలవోకగా ఫోర్లు బాదుతూ అలరించింది. సెహ్వాగ్‌ను గుర్తుకు తెచ్చేలా తొలి బంతి నుంచే బౌండ్రీ బాదేందుకు కసిగా కనిపించింది. మొత్తానికి 190కి పైగా స్ట్రయిక్ రేట్‌తో మెరుపు ఆరంభం అందించి ఓపెనింగ్‌పై భరోసాను పెంచింది. ఆ తర్వాత మిగిలిన వారు ఆకట్టుకోలేకపోయినా దీప్తిశర్మ(49) చివరి వరకు నిలువడంతో భారత్ పోరాడే స్కోరు చేసింది.**

**లక్ష్యఛేదనలో ఓపెనర్ హేలీ అర్ధశతకంతో దుమ్మురేపడంతో ఆస్ట్రేలియా 9.4ఓవర్లకు 67/2తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. ఆ సమయంలో విజృంభించిన భారత లెగ్‌స్పిన్నర్ పూనమ్ యాదవ్.. హేలీని పెవిలియన్‌కు పంపిఆసీస్ పతనాన్ని శాసించింది. ఆ తర్వాత 12ఓవర్లో వరుసగా రెండు వికెట్లు తీసి కాస్తలో హ్యాట్రిక్ చేజార్చుకున్నా.. జట్టును మాత్రం విజయతీరాలకు చేర్చింది.**



పూనమ్ యాదవ్ (4/19)

**నేటి మ్యాచ్**
వెస్టిండీస్ X థాయ్‌లాండ్
వేదిక: పెర్త్ | మ. 12.30
స్టార్ స్పోర్ట్స్‌లో

**సిడ్నీ:** టీ20 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో భారత అమ్మాయిలు అదరగొట్టారు. డిఫెండింగ్ చాంపియన్, ఆతిథ్య ఆస్ట్రేలియాను మట్టికరిపించి టైటిల్ వేటను ఘనంగా మొదలుపెట్టారు. లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ నాలుగు వికెట్లతో సత్తాచాటడంతో శుక్రవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో టీమ్ఇండియా 17పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. దీప్తి శర్మ(46బంతుల్లో 49 నాటౌట్; 3ఫోర్లు), షెఫాలీ వర్మ(15బంతుల్లో 29; 5ఫోర్లు, ఓ సిక్సర్) మినహా మిగతావారు రాణించలేకపోవడంతో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత 20ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 132పరుగుల మోస్తరు స్కోరు చేసింది. ఆసీస్ బౌలర్లలో జొనాసెన్ రెండు, పెర్రీ, కిమ్మిన్స్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం భారత లెగ్‌స్పిన్నర్ పూనమ్ యాదవ్(4/19), పేసర్ శిఖా పాండే(3/14) విజృంభించడంతో ఆస్ట్రేలియా విలవిల్లాడింది. ఓపెనర్ ఎలీసా హేలీ(35బంతుల్లో 51), గార్డ్నర్(36బంతుల్లో 34) తప్ప మిగిలిన వారు చేతులెత్తేయడంతో చివరికి 19.5ఓవర్లలో 115పరుగులకే ఆసీస్ ఆలౌటైంది. భారత బౌలర్ రాజేశ్వరి గైక్వాడ్‌కు ఓ వికెట్ దక్కింది. అద్భుత స్పిన్ బౌలింగ్‌తో ఆసీస్ పతనాన్ని శాసించిన భారత స్పిన్నర్ పూనమ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ప్రపంచకప్‌లో భారత్ తదుపరి 24వ తేదీన బంగ్లాదేశ్‌తో తలపడనుంది.

**ధనాధన్ షెఫాలీ**

తొలిసారి విశ్వటోర్నీ ఆడుతున్న 16ఏండ్ల భారత ఓపెనర్ షెఫాలీ వర్మ మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్‌కు శుభారంభాన్ని ఇచ్చింది. ప్రతీ బంతిని బౌండరీ దాటించాలన్న కసితో కనిపించింది. తొలిసారి విశ్వటోర్నీ ఆడుతున్నానన్న ఒత్తిడి ఏ మాత్రం లేకుండా స్వేచ్ఛగా షాట్లు ఆడింది. స్టానో క్యాచ్ పట్టలేకపోవడంతో ఊపిరిపీల్చుకున్న మరో స్టార్ ఓపెనర్ స్మృతి మందన(10) రెండో ఓవర్లో రెండు ఫోర్లతో బాదుడు ప్రారంభించినా... ఆ తర్వాత అంతా షెఫాలీ షో నడిచింది. తర్వాతి ఓవర్ రెండో బంతికి ఫోర్ అరుసుకున్న వర్మ.. ఐదో బంతిని లాంగ్ ఆఫ్ మీదుగా అద్భుతమైన షాట్‌తో సిక్సర్‌గా మలిచింది. నాలుగో ఓవర్లో షెఫాలీకి తిరుగేలేకుండా పోయింది. తొలి బంతిని మిడాఫ్ మీదుగా బౌండ్రీ బాదితే.. ఆ తర్వాత బాల్‌ను పాయింట్ దిశగా ఫోర్ కొట్టింది. అదే ఓవర్లో మరో రెండు ఫోర్లు కొట్టడంతో 4ఓవర్లకు భారత్ వికెట్ నష్టపోకుండా 40పరుగులు చేసింది. అయితే ఆ తర్వాతి ఓవర్లో మందన(10) ఔట్ కావడంతో 41పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడగా.. ఆ తర్వాత పరుగుల రాక మందగించింది. పవర్ ప్లే చివరి ఓవర్ మూడో బంతికి భారీ షాట్ ఆడే ప్రయత్నంలో ఆసీస్ బౌలర్ పెర్రీ బౌలింగ్‌లో మిడ్ ఆన్‌లో క్యాచ్ ఇచ్చి షెఫాలీ కూడా వెనుదిరగడంతో మెరుపు ఇన్నింగ్స్‌కు తెరపడింది.

**పూనమ్ తిప్పేసింది**

గాయం కారణంగా ముక్కోణపు సిరీస్‌కు దూరమై విశ్వటోర్నీలో పునరాగమనం చేసిన భారత లెగ్‌స్పిన్నర్ పూనమ్ యాదవ్(4/19) చెలరేగడంతో ఆస్ట్రేలియా వరుస పెట్టి వికెట్లు కోల్పోయి పరాజయం పాలైంది. మోస్తరు లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా ఓపెనర్ అలీసా హేలీ దూకుడుగా ఆడింది. గైక్వాడ్ వేసిన రెండో ఓవర్‌లో రెండు ఫోర్లు బాది జోరును కొనసాగించింది. అయితే, ఆరో ఓవర్ ఓపెనర్ మూనే(6)ను భారత బౌలర్ శిఖా పాండే ఔట్ చేసి వికెట్ల పతనానికి నాంది పలికింది. మరో ఎండ్‌లో హేలీ ఫోర్లతో విరుచుకుపడుతుండగా.. లానింగ్(5)ను ఔట్ చేసి గైక్వాడ్ మరో బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత భారత స్పిన్నర్ పూనమ్ యాదవ్ బరిలోకి దిగడంతో ఆసీస్ కష్టాలు రెట్టింపయ్యాయి. అర్ధశతకం పూర్తి చేసుకున్న హేలీని తన తొలి ఓవర్లోనే పూనమ్ కాట్ అండ్ బౌల్డ్ చేసింది. అయినా, 10ఓవర్లకు ఆసీస్ 67/3తో మంచి స్థితిలోనే నిలిచింది. 12వ ఓవర్‌లో పూనమ్ డబుల్ బొనాంజ అందుకుంది. ఆ ఓవర్ మూడో బంతికి హేనెస్(6)ను ఔట్ చేయగా.. తర్వాతి బంతికే పెర్రీ(0)ని పెవిలియన్‌కు పంపింది. హ్యాట్రిక్ బాల్‌కు జొనాసెన్ ఇచ్చిన కష్టతరమైన క్యాచ్‌ను కీపర్ భాటియా అందిపుచ్చుకోలేకపోవడంతో పూనమ్‌కు హ్యాట్రిక్ మిస్సయింది. మరో ఎండ్‌లో గార్డ్నర్ (34) ఒంటరి పోరాటం చేస్తూ.. అడపా దడపా బౌండ్రీలు బాదింది. కాసేపటికే జొనాసెన్(2)ను పూనమ్ పెవిలియన్‌కు పంపగా.. సథర్లాండ్(2)ను శిఖా పాండే ఔట్ చేయడంతో 101పరుగులకే ఆసీస్ 7వికెట్లు కోల్పోయి ఏ దశలోనూ గెలిచేలా కనిపించలేదు. చివరి ఓవర్లో గార్డ్నర్‌ను శిఖ ఔట్ చేయగా.. స్కట్ రనౌట్ అవడంతో ఆసీస్ ఇన్నింగ్స్‌కు తెరపడింది.



దీప్తి (49 నాటౌట్)

రోడ్రిగ్స్ (26)

### ఆదుకున్న దీప్తిశర్మ

షెఫాలీ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్(2) కౌర్ నిరాశపరిచింది. ఏడో ఓవర్ నాలుగో బంతికి భారీ షాట్ ఆడే యత్నంలో క్రీజు వదిలి స్టంపౌట్‌గా వెనుదిరిగింది. దీంతో భారత్ 47కే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత రోడ్రిగ్స్, దీప్తి ఆచితూచి ఆడడంతో పరుగుల వేగం కాస్త నెమ్మదించింది. దీంతో 10ఓవర్లు ముగిసే సరికి భారత్ 63పరుగులే చేయగలిగింది. నిదానంగా ఆడుతున్న రోడ్రిగ్స్ జోరు పెంచాల్సిన 16ఓవర్లో వెనుదిరిగింది. దీంతో 53పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత దీప్తి శర్మ నిలకడగా ఆడుతూ స్కోరు బోర్డును ముందుకు నడపడంతో భారత్ మోస్తరు స్కోరు చేయగలిగింది. వేద కృష్ణమూర్తి(9) హిట్టింగ్ చేయడంలో విఫలమైంది. భారత ఇన్నింగ్స్‌లో ఒకే ఒక్క సిక్సర్ నమోదు కాగా, అది కూడా మూడో ఓవర్లో షెఫాలీ వర్మ కొట్టిందే.

### స్కోరు బోర్డు

**భారత్:** షెఫాలీ వర్మ (సి)సథర్లాండ్ (సి) పెర్రీ 29; స్మృతి మందన ఎల్బీడబ్ల్యూ(బి) జొనాసెన్ 10; రోడ్రిగ్స్ ఎల్బీడబ్ల్యూ(బి) కిమ్మిన్స్ 26; హర్మన్ ప్రీత్ (సి) హేలీ (బి)జొనాసెన్ 2; దీప్తి శర్మ 49నాటౌట్ ; వేద కృష్ణమూర్తి 9నాటౌట్; **ఎక్స్‌ట్రాలు** 7; **మొత్తం** 20ఓవర్లలో 132/4; **వికెట్ల పతనం:** 41-1, 2-43, 3-47, 4-100; **బౌలింగ్:** మోలీ స్ట్రానో 2-0-15-0, పెర్రీ 3-0-15-1, స్కట్ 4-0-35-0, జొనాసెన్ 4-0-24-2, కిమ్మిన్స్ 4-0-24-1, గార్డ్నెర్ 3-0-19-0

**ఆస్ట్రేలియా:** హేలీ (సి&బి)పూనమ్ యాదవ్ 51; బెత్ మూనే (సి)గైక్వాడ్ (బి)శిఖ 6; లానింగ్ (సి)తానియా భాటియా (బి)గైక్వాడ్ 5; హేనెస్ (స్టంప్)తానియా (బి)పూనమ్ 6; గార్డ్నెర్ (సి&బి) శిఖ 34; ఎలీసే పెర్రీ (బౌల్డ్) పూనమ్ 0; జొనాసెన్ (స్టంప్) తానియా (బి)పూనమ్ 2; సథర్లాండ్ (స్టంప్)తానియా (బి) శిఖ 2; కిమ్మిన్స్ రనౌట్(రోడ్రిగ్స్/దీప్తిశర్మ) 4; స్టానో రనౌట్(రోడ్రిగ్స్/శిఖ) 2; మేగన్ స్కట్ 1నాటౌట్. **ఎక్స్‌ట్రాలు** 2, **మొత్తం** 19.5ఓవర్లలో 115ఆలౌట్; **వికెట్ల పతనం**: 32-1, 55-2, 67-3, 76-4, 76-5, 82-6, 101-7, 108-8, 113-9, 115-10 **బౌలింగ్:** దీప్తి శర్మ 4-0-17-0, రాజేశ్వరి గైక్వాడ్ 4-0-31-1, శిఖ 3.5-0-14-3, అరుంధతి రెడ్డి 4-0-33-0, పూనమ్ యాదవ్ 4-0-19-4

# సాక్షి మాలిక్‌కు రజతం

## కాంస్యంతో సరిపెట్టుకున్న వినేశ్.. ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్



**న్యూఢిల్లీ:** ఎన్నో అంచనాలతో బరిలోకి దిగిన భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్(53కేజీలు) ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యంతోనే సరిపెట్టుకోవాల్సి రాగా, మరో రెజ్లర్ సాక్షి మాలిక్(65కేజీలు) రజతాన్ని కైవసం చేసుకుంది. శుక్రవారం ఇక్కడ జరిగిన మహిళల రెండో రోజు పోటీల్లో మాలిక్ రజతం సాధిస్తే.. వినేశ్, అన్షు మాలిక్(57కేజీలు), గుర్‌శరణ్ ప్రీత్ కౌర్(72కేజీలు) కాంస్య పతకాలు దక్కించుకున్నారు. దీంతో మహిళల విభాగంలో ఈసారి భారత్‌కు ఎనిమిది పతకాలు రాగా, టోర్నీ చరిత్రలో ఇదే అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది. ఈ ఏడాది టోర్నీ ముందు వరకు సీనియర్ ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో ఒకే స్వర్ణం ఉండగా.. గురువారం దివ్య, పింకీ, సరిత పసిడి పట్టి రికార్డు సృష్టించగా, నిర్మల రజతం దక్కించుకున్న సంగతి తెలిసిందే. శుక్రవారం 65కేజీల విభాగం ఫైనల్‌కు అలవోకగానే చేరుకున్న సాక్షిమాలిక్ తుది పోరులో 0-2తేడాతో నవోమీ రూకే చేతిలో పరాజయం పాలై రజతం దక్కించుకుంది. కాగా, క్వార్టర్ ఫైనల్లో వినేశ్ ఫోగట్ 6-2తేడాతో మయు ముకైదా చేతిలో ఓడి నిరాశపరిచింది. అయితే కాంస్యపోరులో మాత్రం తివైకూ(వియత్నాం)పై 10-0తో తిరుగులేని విజయం సాధించింది.

## జాతీయ బాస్కెట్‌బాల్ శిక్షణకు రాష్ట్ర ఆటగాళ్లు


ప్రతీక్


గౌతమ్


కార్తీక్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** బెంగళూరు వేదికగా ఈనెల 25 నుంచి మొదలయ్యే జాతీయ బాస్కెట్‌బాల్ కోచింగ్ క్యాంప్‌నకు రాష్ట్రానికి చెందిన కోట్ల గౌతమ్, చడా కార్తీక్, గోన ప్రతీక్ ఎంపికయ్యారు. ఫిబా అండర్-16 ఆసియా పురుషుల చాంపియన్‌షిప్ సన్నాహాల్లో భాగంగా బెంగళూరులో ప్రత్యేకంగా ఈ కోచింగ్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా నిలకడగా రాణిస్తున్న ఆటగాళ్లను ఎంపిక చేశారు. జయప్రకాశ్ నారాయణ్ జాతీయ యూత్ సెంటర్‌లో జరిగే శిక్షణ శిబిరం కోసం ఎంపికైన ఆటగాళ్లు ఈనెల 25లోగా రిపోర్ట్ చేయాలని జాతీయ బాస్కెట్‌బాల్ సమాఖ్య(బీఎఫ్ఐ) జనరల్ సెక్రెటరీ చందర్‌ముఖి శర్మ పేర్కొన్నారు. నాలుగు ఫొటోలతో పాటు పాస్‌పోర్టుతో హాజరు కావాలని ఆయన సూచించారు.

## క్రికెట్‌కు ఓజా వీడ్కోలు



**న్యూఢిల్లీ:** టీమ్ఇండియా లెఫ్టార్మ్ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా.. అంతర్జాతీయ, ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌కు శుక్రవారం రిటైర్మెంట్ ప్రకటించాడు. 2009లో టీమ్ఇండియా తరఫున టెస్టుల్లో అరంగేట్రం చేసిన ఓజా చివరగా 2013 నవంబర్‌లో వెస్టిండీస్‌పై వాంఖడేలో టెస్ట్ ఆడాడు. ఆ మ్యాచ్‌తోనే దిగ్గజ ఆటగాడు సచిన్ టెస్టు ఫార్మాట్‌కు వీడ్కోలు పలకడం విశేషం. అనుమానాస్పద బౌలింగ్ కారణంగా 2014లో ఓజాపై ఐసీసీ.. వేటు వేసింది. యాక్షన్‌ను సరి చేసుకొని 2015లో అనుమతి పొందిన తర్వాత ఓజా మునుపటిలా రాణించలేకపోయాడు. టీమ్ఇండియా తరఫున 24టెస్టులు ఆడిన ఓజా 113వికెట్లు తీసుకున్నాడు. 18 వన్డేల్లో 21, ఆరు అంతర్జాతీయ టీ20ల్లో 10వికెట్లు సాధించాడు. ఐపీఎల్‌లో దక్కన్ చార్జర్స్, ముంబై ఇండియన్స్ తరఫున ఆడాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో హైదరాబాద్ తరఫున దాదాపు 11 ఏండ్ల పాటు బరిలోకి దిగిన ఓజా.. ఆ తర్వాత బెంగాల్, బీహార్ తరఫున ఆడాడు.

## పోరాడి ఓడింది

**భువనేశ్వర్:** ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత పురుషుల హాకీ జట్టు పోరాడి ఓడింది. రెండు మ్యాచ్‌ల టైలో భాగంగా శుక్రవారం ఇక్కడి కళింగ మైదానంలో జరిగిన తొలి పోరులో భారత్ 3-4తేడాతో ప్రపంచ రెండో ర్యాంకర్ ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. ఆసీస్ తరఫున డైలన్ వర్తెర్‌స్పూన్(6వ నిమిషం), టామ్ విక్‌హమ్ (18వ.), లచ్లన్ షార్ప్ (41వ.), జాకోబ్ అండెర్సన్(42వ.) గోల్స్ బాదారు. భారత ప్లేయర్ రాజ్ కుమార్ పాల్(36వ., 47వ.) డబుల్ గోల్స్‌తో సత్తాచాటగా.. రూపిందర్ పాల్ సింగ్ (52వ.) మరో గోల్ చేసినా ఫలితం లేకపోయింది. ఓ దశలో 0-3తో వెనుకబడిన భారత్ చివరి వరకు పోరాడి ఓ గోల్ తేడాతో ఓడిపోయింది.

## సైనా నిష్క్రమణ



**బార్సిలోనా:** బార్సిలోనా స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ లో భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సైనా 20-22, 19-21తో బుసానన్(థాయ్‌లాండ్) చేతిలో ఓటమిపాలైంది. 45 నిమిషాల పాటు జరిగిన పోరులో తుదికంటా పోరాడిన సైనాకు చివర్లో నిరాశే ఎదురైంది. పాయింట్ పాయింట్‌కు చెమటోడ్చిన ఈ హైదరాబాదీకి అదృష్టం కలిసిరాలేదు. ప్రత్యర్థి కచ్చితమైన షాట్లతో చెలరేగడంతో సైనా ముందంజ వేయలేకపోయింది. మరోవైపు పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో అజయ్ జయరామ్ 21-14, 21-15తో థామస్ రాక్సెల్(ఫ్రాన్స్)పై అలవోక విజయంతో సెమీస్‌లోకి ప్రవేశించాడు. మరో సింగిల్స్‌లో సమీర్‌వర్మ 21-17, 17-21, 12-21తో కునాల్వత్ వితిసర్న్‌పై ఓటమిపాలయ్యాడు.

# పేస్‌కు పడ్డారు

## జేమిసన్ వీరవిహారం.. కోహ్లీ, పుజార, విహారి విఫలం .. ఆదుకున్న రహానే.. భారత్ తొలి ఇన్నింగ్స్ 122/5

**ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో వరుస విజయాలతో దూసుకెళుతున్న భారత్‌కు న్యూజిలాండ్‌లో పేస్ పరీక్ష ఎదురైంది. సవాలు విసిరే వాతావరణ పరిస్థితులకు పిచ్‌పై బుల్లెట్‌లా దూసుకొచ్చే బంతులకు ఎదురొడ్డి నిలువడంలో టీమ్ఇండియా బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. పచ్చని పిచ్‌పై కివీస్ పేసర్లు పండుగ చేసుకున్నారు. ఆరున్నర అడుగుల యువ పేసర్ కైల్ జేమిసన్ అరంగేట్రం మ్యాచ్‌లోనే అదరహో అనిపించాడు. చురకత్తుల్లాంటి బంతులతో భారత్ బ్యాటింగ్ నడ్డివిరిచాడు. పదునైన స్వింగ్‌తో కెప్టెన్ కోహ్లీ, పుజార, విహారిని పెవిలియన్ పంపాడు. పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన జట్టును రహానే ఆపద్బాంవుడిలా ఆదుకున్నాడు. కివీస్ బౌలర్ల సహనానికి పరీక్ష పెడుతూ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. వరుణుడు అంతరాయం కల్గించిన మ్యాచ్‌లో పూర్తి ఓవర్ల కోటా కాకముందే మొదటి రోజు ముగిసింది.**


జెమిసన్ (3/38)

**వెల్లింగ్టన్:** ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో అప్రతిహత విజయాలతో ఎదురన్నది లేకుండా దూసుకెళుతున్న భారత్‌కు అనుకున్నట్లే న్యూజిలాండ్ పిచ్‌లు అగ్ని పరీక్ష పెడుతున్నాయి. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా శుక్రవారం మొదలైన తొలి టెస్టులో టీమ్ఇండియా బ్యాట్స్‌మెన్ పరుగుల వేటలో విఫలమయ్యారు. టాస్ గెలిచిన న్యూజిలాండ్ కెప్టెన్ విలియమ్సన్.. వాతావారణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని టీమ్ఇండియాను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ కైల్ జేమిసన్ (3/38) విజృంభణకు తోడు సౌథీ (1/27), బౌల్ట్(1/44) రాణింపుతో టీమ్ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. రహానే(122 బంతుల్లో 38 నాటౌట్, 4ఫోర్లు) బాధ్యాతాయుత ఇన్నింగ్స్ ఆడగా, మయాంక్ (34) ఆకట్టుకున్నాడు. రహానేకు తోడు పంత్(10) క్రీజులో ఉన్నాడు.

**షా ఫ్లాప్, అగర్వాల్ హిట్:**

రోహిత్‌శర్మ గైర్హాజరీలో జట్టులోకి తిరిగి వచ్చిన పృథ్వీషా(16) ఆకట్టుకోలేకపోయాడు. కివీస్ పదునైన పేస్ దాడికి ఎదుర్కొవడంలో విఫలమైన షా..స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. రెండు బౌండరీలతో ఆకట్టుకునే ప్రయత్నం చేసినా..సౌథీ బౌలింగ్‌లో బంతిని అంచనా వేయలేకపోయిన షా మూల్యం చెల్లించుకున్నాడు. ప్యాడ్లను ముద్దాడుతూ వెళ్లిన బంతి ఆఫ్‌స్టంప్‌ను గిరాటేడయంతో 16 పరుగులకే భారత్ తొలి వికెట్ కోల్పోయింది. మరో ఎండ్‌లో మయాంక్ స్వేచ్ఛగా షాట్లు ఆడుతూ ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన పుజారా(11)తో కలిసి అగర్వాల్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. క్రీజులో నిలదొక్కుకునేందుకు ఆఫ్‌స్టంప్ అవతలి బంతులను వదిలిపెట్టిన పుజారను బౌలింగ్ మార్పుగా వచ్చిన జేమిసన్ ఔట్ చేశాడు. స్వింగ్ డెలివరీని ఆడబోయిన పుజార.. వాట్లింగ్‌కు క్యాచ్ ఇచ్చి రెండో వికెట్‌గా వెనుదిరిగాడు.సహచరులు నిష్క్రమిస్తున్నా.. మయాంక్ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు.

**కోహ్లీ మళ్లీ!**

కెప్టెన్ కోహ్లీ ఫామ్‌లేమి కొనసాగుతున్నది. పుజారా తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కోహ్లీ(2) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యాడు. జేమిసన్ బౌలింగ్‌లో రాస్ టేలర్‌కు క్యాచ్ ఇచ్చి మూడో వికెట్‌గా వెనుదిరిగాడు.

**ఆదుకున్న రహానే:**

మూడు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న జట్టును అగర్వాల్‌తో కలిసి రహానే ఆదుకున్నాడు. ముఖ్యంగా రహానే తన అనుభవాన్ని రంగరిస్తూ సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. గాడిలో పడిందనుకుంటున్న తరుణంలో బౌల్ట్ బౌలింగ్‌లో అగర్వాల్ ఔటయ్యాడు. దీంతో నాలుగో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆదుకుంటాడనుకున్న తెలుగు క్రికెటర్ విహారి(7) కూడా నిరాశపరిచాడు. జేమిసన్‌కు వికెట్ ఇచ్చుకోవడంతో భారత్ కష్టాలు మరింత పెరిగాయి. ఓవైపు వికెట్లు పడుతున్నా.. రహానే.. కివీస్ బౌలర్లకు ఎదురొడ్డి నిలిచాడు. పంత్‌ను అండగా చేసుకుంటూ వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాదాడు. అయితే టీ విరామం తర్వాత ఎడతెరిపిలేని వర్షంతో మ్యాచ్ 55 ఓవర్లకే పరిమితమైంది. మొత్తంగా తొలి రోజు ఆటలో కివీస్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది.

**స్కోరుబోర్డు: భారత్ తొలి ఇన్నింగ్స్:** పృథ్వీషా(బి) సౌథీ 16, మయాంక్(సి)జేమిసన్(బి) బౌల్ట్ 34, పుజారా(సి)వాట్లింగ్(బి)జేమిసన్ 11, కోహ్లీ(సి)టేలర్(బి)జేమిసన్ 2, రహానే 38 నాటౌట్, విహారి(సి)వాట్లింగ్(బి)జేమిసన్ 7, పంత్ 10 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 4; **మొత్తం:** 55 ఓవర్లలో 122/5; **వికెట్ల పతనం:** 1-16, 2-35, 3-40, 4-88, 5-101; **బౌలింగ్:** సౌథీ 14-4-27-1, బౌల్ట్ 14-2-44-1, గ్రాండ్‌హోమ్ 11-5-12-0, జేమిసన్ 14-2-38-3, పటేల్ 2-2-0-0.



కోహ్లి (2)


పుజారా (11)


విహారి (7)